thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 318 | కరీంనగర్ శనివారం, 24 జనవరి 2026 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

### ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియ లేదు.. బీసీఎఫ్ ఐజీ అశోక్ యాదవ్

శ్రీనగర్: ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోందని, పాకిస్థాన్ ఎలాంటి దుందుడుకు చర్యలకు పాల్పడినా తీవ్రస్థాయిలో సమాధానమిస్తామని సరిహద్దు భద్రతా దళం ఇన్‌స్పెక్టర్ జనరల్ అశోక్ యాదవ్ తెలిపారు. శ్రీనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎల్‌ఓసీ వెంబడి పలు లాంచిం గ్ ప్యాడ్లు, ఫార్వార్డ్ లొకేషన్లను ధ్వంసం చేశామని, అయితే కొన్ని యథాతథంగా ఉన్నాయని చెప్పారు. ఉగ్రవాదులు ఇప్పటికీ అక్కడ ఉన్నట్టు చెప్పారు. 'ఆపరేషన్ సిందూర్ సమయంలో ఆర్మీ, సరిహద్దు భద్రతా దళాలు పాకిస్థాన్ లోని అనేక లాంచింగ్ ప్యాడ్లు, ఫార్వార్డ్ లొకేషన్లపై విరుచుకుపడి ధ్వంసం చేశాయి. అయితే కొన్ని మాత్రం ఎల్‌ఓసీ వెంబడి అలాగే ఉన్నాయి. కొందరు ఉగ్రవాదులు అక్కడ సంచారం సాగిస్తున్నారు. అయితే ఉగ్రవాదులు ఎలాంటి చొరబాటు యత్నాలు చేసినా వాటిని తిప్పికొడ తాం. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు, పాకిస్థాన్ ఎలాటి దుస్సాహసానికి పాల్పడినా చాలా తీవ్రమైన స్పందన ఉంటుంది' అని అశోక్ యాదవ్ తెలిపారు.

# రైతులకు పండగే!




## అన్నదాలకు మోదీ సర్కార్ భారీ శుభవార్త..

## పీఎం కిసాన్ సహాయం డబ్బుల్!

అధికారంలోకి వచ్చి పుష్కర కాలం దాటిన నరేంద్ర మోదీ ప్రభుత్వం రైతులకు భారీ శుభవార్త ప్రకటించబోతున్నట్లు సమాచారం. రైతులకు అందిస్తున్న పంట పెట్టుబడి సహాయాన్ని పెంచబోతున్నట్లు తెలుస్తోంది. రైతులకు అందిస్తున్న సహాయాన్ని పెంచి కానుకగా ఇచ్చేందుకు సిద్ధమైందని వార్తలు వస్తున్నాయి. పీఎం కిసాన్ సహాయాన్ని పెంచి ఇవ్వనున్నట్లు.. రానున్న బడ్జెట్‌లో ఈ ప్రకటన ఉంటుందని తెలుస్తోంది. కేంద్ర బడ్జెట్ ఫిబ్రవరి 1వ తేదీన ప్రవేశపెట్టనున్న విషయం తెలిసిందే. కేంద్ర బడ్జెట్‌పై సామాన్య ప్రజానీకంతోపాటు రైతులు, ఉద్యోగులు భారీ ఆశలు పెట్టుకున్నారు. అధికారంలోకి వచ్చి 12 ఏళు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం రైతులకు భారీ కానుక ఇవ్వనున్నట్లు సమాచారం. ఈ క్రమంలో బడ్జెట్‌పై అన్నీ వర్గాలు భారీగా అంచనాలు పెంచుకున్నారు. ఈ బడ్జెట్‌లో రైతులకు సంబంధించిన పీఎం కిసాన్ సమ్మాన్ పథకానికి సంబంధించి భారీ కానుక రాబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అరకొరగా అందిస్తున్న పంట పెట్టుబడి సహాయం ఈసారి పెంచనున్నట్లు తెలుస్తోంది. ప్రధానమంత్రి కిసాన్ యోజన బడ్జెట్‌ను పెంచవచ్చని రైతులు ఆశిస్తున్నారు. ఈ పథకం ప్రారంభమైనప్పటి నుంచి రూపాయి కూడా పెంచలేదు. ఈసారి బడ్జెట్‌లో పెంపు ఉండబోతున్నదని సమాచారం. ప్రధానమంత్రి కిసాన్ యోజనను కేంద్ర ప్రభుత్వం 2019లో ప్రారంభించగా.. ఈ పథకం కింద రైతులకు సంవత్సరానికి రూ.6,000 పంట పెట్టుబడి సహాయం అందిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ సహాయం మూడు విడతలుగా పంపిణీ చేస్తున్నారు. ప్రతి నాలుగు నెలలకు ఒక విడతగా రూ.2 వేల చొప్పున విడుదల చేస్తున్నారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా రైతులకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద 21 వాయిదాలు చెల్లించారు. ఫిబ్రవరి 1వ తేదీన ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ప్రధానమంత్రి కిసాన్ పథకంపై కీలక ప్రకటన ఉంటుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. బడ్జెట్‌లో పీఎం కిసాన్ పథకానికి కేటాయింపులు పెంచనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అందిస్తున్న రూ.6,000 నుంచి రూ.8,000కు పెంచవచ్చని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం ప్రస్తుతం చెల్లిస్తున్న రూ.6 వేలు రైతులకు ఏకోశాన సరిపోవడం లేదు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, డీజిల్, విద్యుత్, నీటిపారుదల, వ్యవసాయ యంత్రాలు ఇలా ప్రతి దాని ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో రైతులకు పంట పెట్టుబడి పెరిగిపోతున్నది. వ్యవసాయ ఖర్చు భారీగా పెరిగిపోతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పీఎం కిసాన్ సహాయం ఏమాత్రం చాలడం లేదు.

**ఆంక్షలతో పీఎం కిసాన్ దూరం..** అందించే అరకొర సహాయానికి అడ్డమైన కొర్రీలు పెట్టారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధుకు నకలుగా అమలుచేస్తున్న పీఎం కిసాన్ పథకంలో అనేక కొర్రీలు పెట్టారు. రైతుబంధు మాదిరి అందరు రైతులకు సహాయం రావడం లేదు. భార్యాభర్తలిద్దరూ పీఎం కిసాన్ సహాయం పొందడానికి అనర్హులు.

ఎవరైనా అలా చేస్తే ప్రభుత్వం వారిని మోసగాళ్లుగా ప్రకటించి వారి నుంచి డబ్బును తిరిగి పొందుతుంది. రైతు కుటుంబంలో ఎవరైనా పన్నులు చెల్లిస్తే వారు ఈ పథకం ప్రయోజనాలకు అర్హులు కారు. అంటే గత సంవత్సరం భర్త లేదా భార్య ఆదాయపు పన్ను చెల్లించినట్లయితే వారు పీఎం కిసాన్ పథకం ప్రయోజనాలకు అర్హులు కారు. ఈ నిబంధనలు ఎత్తివేయాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఒక రైతు మరొక రైతు నుంచి భూమిని సాగు చేయడానికి కౌలుకు తీసుకుంటే వారికి కూడా పీఎం కిసాన్ పథకం ప్రయోజనాలు లభించవు. పీఎం కిసాన్ సహాయం కోసం భూమి యాజమాన్యం అవసరం. ఒక రైతు లేదా కుటుంబ సభ్యుడు రాజ్యాంగ పదవిలో ఉంటే వారికి కూడా పీఎం కిసాన్ డబ్బులు రావు.

## ఫోన్ ట్యాపింగ్‌పై కేటీఆర్ ఆత్మపరిశీలన చేసుకోవాలి: మహేశ్ గౌడ్




హైదరాబాద్, జనవరి 23: మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. శుక్రవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. కేటీఆర్ తనపై వ్యక్తిగత హననం చేస్తున్నారని చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. రాజ్యాంగం ప్రకారమే విచారణ జరుగుతోందని.. రాజకీయ కక్ష సాధింపు ధోరణి ఉంటే, అధికారంలోకి వచ్చిన వెంటనే చర్యలు తీసుకునేవాళ్లమని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ విషయంపై కేటీఆర్ ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచించారు.

**బీఆర్ఎస్‌పై విమర్శలు..** ఇద్దరు వ్యక్తుల మధ్య సంభాషణ వినడం వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించినట్లే అని పీసీసీ చీఫ్ తెలిపారు. కేటీఆర్ మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని వ్యాఖ్యానించారు. 'బట్ట కాల్చి మీద వేసి పారిపోతామంటే కుదరదు. అలీ బాబా 420 దొంగల మాదిరి కేసీఆర్ కుటుంబం దోపిడీ చేసింది.

స్టువర్ట్‌పురం దొంగల బ్యాచ్ బీఆర్ఎస్' అని తీవ్రంగా విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర?స్ దీపం ఆగిపోకుండా 'ఆరనీకుమా ఈ దీపం కార్తీక దీపం' అంటూ కేటీఆర్ రాగాలు తీస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు.

**ఉద్యమ కేసులతో పోల్చొద్దు..** ఫోన్ ట్యాపింగ్‌పై కేటీఆర్ మాట్లాడటం హాస్యాస్పదమని, తోడబుట్టిన చెల్లెలు కవిత ఫోన్ ట్యాప్ చేశారని గగ్గోలు పెడుతుంటే సమాధానం లేదని మహశ్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు తీవ్రమైందని, దీన్ని ఉద్యమ కేసులతో పోల్చడం సరికాదని మహేశ్ గౌడ్ అభిప్రాయపడ్డారు.

బీఆర్ఎస్ హయంలో కేవలం మూడు నెలల్లో 547 ఫోన్లు ట్యాప్ అయ్యాయని, తన మిత్రుడి ఫోన్ కూడా ట్యాప్ అయిందని వెల్లడించారు.

**కవిత ఎపిసోడ్‌పై స్పందిస్తూ..** 'కవితను చెల్లెలుగా ఎప్పుడూ గౌరవిస్తా. కేసీఆర్ కుటుంబంలో తగాదాలకు మూలం వాటాల పంపకంలో తేడా.

కవిత ఇప్పటికైనా నిజాలు మాట్లాడుతున్నందుకు స్వాగతిస్తున్నాం' అని చెప్పారు. అలాగే ఏఐసీసీ ఇన్?ఛార్జ్ మార్పు ఉండదని పీసీసీ చీఫ్ స్పష్టం చేశారు.



## కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చొరవ.. మేడారం జాతరకు నిధులు విడుదల

హైదరాబాద్: ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగ మేడారం జాతరకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. కేంద్రమంత్రి కిషన్?రెడ్డి చొరవతో కేంద్ర పర్యాటక మంత్రిత్వశాఖ, గిరిజన మంత్రిత్వశాఖలు రూ.3.70కోట్లు విడుదల చేశాయి. మేడారం చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల్లో పర్యాటకాన్ని ప్రోత్సహించడం కోసం గిరిజన సర్క్యూట్ పేరిట గతంలో రూ. 80 కోట్లతో ఆయా ప్రాంతాల్లో పర్యాటకులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించింది. యునెస్కో గుర్తింపు లభించిన రామప్ప దేవాలయ అభివృద్ధి కోసం రూ.140 కోట్లు ఖర్చు చేస్తోంది. అమ్మవార్లకు బంగారం సమర్పించి మొక్కులు తీర్చుకోవడానికి రాష్ట్రం నలుమూలల నుంచి, చుట్టుపక్కల రాష్ట్రాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం జాతర జరిగే నాలుగు రోజుల పాటు దక్షిణ మధ్య రైల్వే 30 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది.

# టార్గెట్ రీచ్!




## ముగిసిన సీఎంల దావోస్ పర్యటన..

## భారీ పెట్టుబడులను ఆకర్షించిన తెలుగు రాష్ట్రాలు!!

ప్రభుత్వం అంటే.. ప్రజలను పాలిస్తూ ఉంటే సరిపోదు. తమ పాలన ఎలా ఉందో, ప్రపంచ దేశాలకు చాటాలి. దిగ్గజ కంపెనీల వ్యవస్థాపకులను రాష్ట్రానికి ఆహ్వానించాలి. అలా వచ్చేవారు పెట్టుబడులు పెట్టేందుకు అన్ని రకాల సదుపాయాలూ కల్పించాలి. వీలైనంత త్వరగా లైసెన్సులు ఇవ్వాలి. ఇవన్నీ ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు చేస్తున్నాయి. అందువల్ల రెండు రాష్ట్రాలకూ పెట్టుబడులు బాగా వస్తున్నాయి. తాజాగా స్విట్జర్లాండ్.. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సు (WEF)లో కూడా ఏపీ సీఎం చంద్రబాబు టీమ్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి టీమ్.. మంచి ఫలితాలు సాధించాయి. రెండు టీమ్‌లు విజయవంతం అయ్యాయి. రెండు రాష్ట్రాలకూ భారీగా పెట్టుబడులు రాబోతున్నాయి. అవగాహనా ఒప్పందాలు (MOU) కూడా బాగా జరిగాయి. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలిసి సమావేశమై, తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి సహకారం ఇచ్చిపుచ్చుకునే అంశాలపై చర్చించారు.

**ఆంధ్రప్రదేశ్ సాధించినవి:** ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు టీమ్ దావోస్‌లో పెట్టుబడులను బాగా ఆకర్షించింది. రాష్ట్ర చరిత్రలో అతిపెద్ద పెట్టుబడి ఒప్పందం ఒకటి కుదిరింది. వాటిని గమనిస్తే.. RMZ గ్రూప్‌తో భారీ భాగస్వామ్యం కుదిరింది. సుమారు రూ.84,000 కోట్లు పెట్టుబడి రాబోతోంది. ఇందులో భాగంగా విశాఖపట్నంలో డిజిటల్ హబ్ రాబోతోంది. మెగా ఇండస్ట్రియల్ అండ్ లాజిస్టిక్స్ పార్క్, 1 GW హైపర్ స్కేల్ డేటా సెంటర్, GCC పార్క్ నిర్మాణం జరగబోతోంది. కోటి చదరపు అడుగుల్లో నిర్మాణాలు రానున్నాయి. సుమారు 1 లక్ష ఉద్యోగాలు వస్తాయని అంచనా ఉంది. 2025లో దావోస్‌లో కుదిరిన రూ.2.5 లక్షల కోట్ల పెట్టుబడులు ఇప్పుడు వచ్చే దశలో ఉన్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు.

ఇజ్రాయిల్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉంది. ఖూజు సహకారంతో ఫుడ్ ప్రాసెసింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లో పెట్టుబడులు వచ్చే అవకాశాలున్నాయి. మొత్తంగా దావోస్?లో ఏపీ ప్రభుత్వం రూ.2.36 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను రాబట్టుతోంది. వాటి ద్వారా 1.33 లక్షలకు పైగా ఉద్యోగాలు వస్తాయనే అంచనా ఉంది. ఏపీ బ్రాండ్?ను గ్లోబల్ స్థాయిలో ప్రమోట్ చేయడంలో ఈ పర్యటన బాగానే ఉపయోగపడింది.

**తెలంగాణ సాధించినవి:** ఏపీతో పోల్చితే తెలంగాణకు రెడీగా హైదరాబాద్ ఉంది. అందువల్ల పెట్టుబడులు ఈజీగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఆల్రెడీ చాలా దిగ్గజ కంపెనీలకు హైదరాబాద్‌లో ఆఫీసులు, కంపెనీలు ఉన్నాయి. కాబట్టి.. మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు ఆ కంపెనీలు ఆసక్తి చూపిస్తూనే ఉంటాయి. అయినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం మరింత గట్టిగా ప్రయత్నిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో 'తెలంగాణ రైజింగ్' టీమ్.. 3 రోజులు దావోస్‌లో ఉండి.. కీలక అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. మొత్తం సుమారు ?30,000 కోట్లకు పైగా పెట్టుబడి హామీలు లభించాయి. రష్మి గ్రూప్‌తో MOU చూస్తే.. రూ.12,500 కోట్ల పెట్టుబడితో స్టీల్ ప్లాంట్‌ని తెలంగాణలో స్థాపించబోతున్నారు. సుమారు 12,000 ఉద్యోగాలు రావచ్చు. గ్రీన్ ఎనర్జీపై దృష్టి పెడుతున్నారు. ష్నైడర్ ఎలక్ట్రిక్ సంగతి చూస్తే.. రూ.623 కోట్లతో గాగిల్లాపూర్, శంషాబాద్‌లో యూనిట్లను విస్తరిస్తుంది. ఎనర్జీ ఎఫిషియెన్సీ, గ్రిడ్ మోడర్నైజేషన్ రంగాల్లో సహకారం ఉంది. పియర్సన్ కంపెనీ.. తెలంగాణలో AI ఇన్నోవేషన్ హబ్ కింద గ్లోబల్ AI అకాడమీకి AI స్కిల్లింగ్, కరికులమ్ సపోర్ట్ చెయ్యడానికి ముందుకొచ్చింది. జార్జ్‌టౌన్ యూనివర్సిటీ AI COLAB సంస్థ.. తెలంగాణలో హెల్త్‌కేర్ రంగంలో AI అప్లైడ్ రీసెర్చ్, ట్రైనింగ్ సహకారం అందించేందుకు ఆసక్తి చూపింది. దుబాయ్ మల్టీ కమోడిటీస్ సెంటర్.. తెలంగాణలో స్టార్టప్‌లకు మార్కెట్ యాక్సెస్, ఈవెంట్లకు సహకారం అందించేందుకు ముందుకొచ్చింది. బ్లైజ్ సంస్థ.. హైదరాబాద్‌లో R&D సెంటర్‌ని విస్తరించేందుకూ, AI హార్డ్‌వేర్ అండ్ సాఫ్ట్‌వేర్ రంగాన్ని డెవలప్ చేసేందుకు ఆసక్తి చూపించింది. మొత్తంగా ఈ పర్యటనతో తెలంగాణ AI ఇన్నోవేషన్ హబ్?కు గ్లోబల్ సపోర్ట్ బలపడింది. రాష్ట్రాన్ని AI రాజధానిగా మార్చేలా కీలక అడుగులు పడ్డాయి.




బాసర, వర్గల్‌లోని సరస్వతీ అమ్మవారి క్షేత్రంలో వసంత పంచమి వేడుకలు శుక్రవారం అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. తెల్లవారుజామునే అమ్మవారికి విశేష పంచామృతాభిషేకం చేసిన అనంతరం విద్యా జ్యోతిగా అలంకరించారు. వసంత పంచమి పర్వదినం నాడు అక్షరాభ్యాసాలకు విశేష ప్రాధాన్యం ఉంది. అందుకే వేలాదిమంది భక్తులు తమ చిన్నారులతో కలిసి ఉదయాన్నే ఆలయానికి వచ్చి అక్షరాభ్యాసాలు చేయించుకున్నారు.



## ఫోన్ ట్యాపింగ్ కేసు.. సీరియల్‌లా సిట్ విచారణ: బండి సంజయ్

కరీంనగర్ : ఫోన్ ట్యాపింగ్ కేసు లో సిట్ విచారణ సీరియల్‌లా కొనసాగుతోందని కేంద్రమంత్రి బండి సంజయ్ ఎద్దేవా చేశారు. దొంగే దొంగ అన్నట్లు కేటీఆర్ వ్యవహారం ఉందన్నారు. కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సంజయ్ మాట్లాడారు. సిట్ విచారణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నాటకాలాడుతోందని విమర్శించారు. "కేటీఆర్ సిరిసిల్ల కేంద్రంగా అక్రమంగా ఫోన్లు ట్యాప్ చేయించారు. ఆయన చేసిన దారుణాలతో కొన్ని కుటుంబాలు మునిగాయి. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎలాంటి అరెస్టులు జరగవు. కేసీఆర్ కుటుంబసభ్యులను అరెస్ట్ చేసే ధైర్యం ఈ ప్రభుత్వానికి లేదు. దేశభద్రత కోసం జరిగే ట్యాపింగ్‌కు.. తెలంగాణలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధమే లేదు. మావోయిస్టుల పేరుతో హీరోయిన్లు, వ్యాపారులు, రాజకీయ నేతలు, జడ్జీల ఫోన్లు ట్యాప్ చేశారు. సిట్‌లో మంచి అధికారులు ఉన్నారు.. కానీ ప్రభుత్వం వారికి స్వేచ్ఛను ఇవ్వడం లేదు. ఈ కేసులో ఒక్క రాజకీయ నేతనైనా అరెస్ట్ చేశారామా ప్రభుత్వం అధికారంలో ఉండి ఉంటే కేసీఆర్ కుటుంబ సభ్యులపై చర్యలు చేపట్టేవాళ్లం. తప్పు చేసిన నేతలు, అధికారులను అరెస్ట్ చేయాలి" అని బండి సంజయ్? డిమాండ్ చేశారు.




హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు పది సార్లు పిలిచినా హాజరవుతానని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. తప్పు చేయనపుడు భయపడాల్సిన పనిలేదని చెప్పారు. నేడు సిట్ విచారణకు వెళ్లనున్న నేపథ్యంలో తెలంగాణ భవన్?లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అటెన్షన్ డైవర్షన్ కోసమే సిట్ విచారణ పేరుతో కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. "మంత్రులతో పాటు మా అందరి ఫోన్లను సీఎం రేవంత్‌రెడ్డి ట్యాప్ చేయిస్తున్నారు. రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతున్నారు. ఆరు గ్యారంటీలు, సింగరేణి బొగ్గు కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ కుట్రలు చేస్తున్నారు. నాలుగు కోట్ల ప్రజలను నయవంచన చేసిన ముఖ్యమంత్రిని వదిలిపెట్టం. కాంగ్రెస్‌ను గద్దె దించే వరకు పోరాడతాం. సిట్ విచారణలో ప్రతి ప్రశ్నకూ సమాధానం చెప్తాను. ఈ కేసులు మాకు కొత్తేమీ కాదు.. బెదిరింపులకు భయపడం. కొత్తనాటకాలతో కాలయాపన చేస్తున్నారు. నాపై లేనిపోని లింకులు అంటగట్టి చిల్లర రాజకీయాలు చేస్తున్నారు. ప్రభుత్వ అసమర్థతను ప్రశ్నిస్తూనే ఉంటాం. నా పరువుకు భంగం కలిగించిన రేవంత్, ఆయన తొత్తులను వదిలిపెట్టను" అని కేటీఆర్ అన్నారు.

## సొంత పార్టీ నేతల ఫోన్లనూ ట్యాప్ చేసిన ఘనత బీఆర్ఎస్‌దే: మహేశ్‌కుమార్ గౌడ్



హైదరాబాద్: తాము కక్ష సాధింపు రాజకీయాలు చేస్తే బీఆర్ఎస్ నేతలు జైల్లో ఉండేవారని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. చట్ట ప్రకారమే కేసుల దర్యాప్తు ఉంటుందని తెలిపారు. గతంలో ప్రతిపక్ష నేతలవే కాదు సొంత పార్టీ నేతల ఫోన్లనూ ట్యాప్ చేశారని ఆరోపించారు. హైదరాబాద్ భూములను ప్రైవేట్? వాళ్లకు అక్రమంగా కట్టబెట్టారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ఫోన్లు మాట్లాడాలంటే భయపడేవాళ్లమని వ్యాఖ్యానించారు. సింగరేణిలో అక్రమాలు ఎప్పుడు జరిగాయో తేటతెల్లం అవుతుందన్నారు. "నక్సల్స్ వంకతో తన ఫోన్ ట్యాపింగ్ చేశారని అధికారులు చెప్పారు. నటులు, వ్యాపారులు ఏమైనా తీవ్రవాదులా.. ఎందుకు ట్యాప్ చేశారు. కవిత బయటపెట్టిన వాటికి ఆధారాలు ఇవ్వాలని కోరుతున్నా. 547 మంది ఫోన్లను ట్యాప్ చేశారని అధికారులు చెబుతున్నారు" అని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు.


**బీఆర్ఎస్‌పై దయాకర్ తీవ్ర విమర్శలు..** జైలుకు వెళ్లాలని బీఆర్ఎస్ నేతలకు బాగా ఉబలాటంగా ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఎద్దేవా చేశారు. "తెలంగాణలో ఎన్నికలంటే డబ్బులు, ప్రలోభాలు ఉండాలనే విధంగా బీఆర్ఎస్ తయారు చేసింది. మీరు చేసిన పాపాలు, తప్పిదాలపై మరో ఐదేళ్లు విచారణ చేసినా సమయం సరిపోదు. డ్రోన్ కేసులో రేవంత్‌రెడ్డిని జైలుకు పంపారు. ప్రొఫెసర్ కొదండరామ్ ఇంటి తలుపులు బద్దలు కొట్టి అరెస్ట్ చేశారు. మేమెప్పుడూ రాజకీయ క్షక్ష సాధింపునకు పాల్పడలేదు. సిట్ అధికారులు, పోలీసులను కేటీఆర్? బెదిరిస్తున్నారు. అనైతిక రాజకీయాలు చేస్తున్నారు" అని విమర్శించారు.

**కేటీఆర్, హరీశ్‌పై బల్మూరి వెంకట్ ఫిర్యాదు...** మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావుపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేశారు. ఫోన్ ట్యాపింగ్ విచారణ సందర్భంగా పోలీసు అధికారులను వారిద్దరు బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.




## ఇరాన్ దిశగా అమెరికా సైన్యం: మరోసారి ట్రంప్ హెచ్చరికలు

ఆందోళనకారులను అణచివేస్తోన్న ఇరాన్‌పై సైనిక చర్యకు సిద్ధమైన అమెరికా.. చివరి నిమిషంలో తన నిర్ణయాన్ని రద్దు చేసుకున్న విషయం తెలిసిందే. అయినప్పటికీ ఆ దేశంలో ఉద్రిక్తతలు చల్లారకపోవడంతో ఇరాన్ పాలకులకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి హెచ్చరికలు చేశారు. ఇప్పటికే ఇరాన్ చుట్టూ భారీ నౌకాదళాన్ని మోహరించామని.. అమెరికాలోని అతిపెద్ద సైన్యం ఆ దేశం వైపు కదులుతోందని పేర్కొన్నారు. ఇరాన్ విషయంలో ఆ దేశానికి ఎలాంటి నష్టం జరగకూడదని తాను భావిస్తున్నప్పటికీ ఇంకా ఉద్రిక్తతలు సద్దుమణగట్లేవన్నారు. అక్కడి పరిస్థితులను తాము నిశితంగా పరిశీలిస్తున్నామని, ఇక ముందు ఏం జరుగుతుందో వేచి చూద్దామన్నారు. అధ్యక్ష భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లోని వందల మంది నిరసనకారులకు విధించిన ఉరిశిక్షలను అమెరికా ఒత్తిడి వల్ల అక్కడి అధికారులు రద్దు చేసిన విషయాన్ని ట్రంప్ పునరుద్ఘాటించారు. ఈ విషయంలో తాను కల్పించుకోకపోయి ఉంటే ఇరాన్‌లో 800 మందికి పైగా నిరసనకారులు తమ ప్రాణాలు కోల్పోయేవారని.. వారి ఉరిశిక్షలను తాను ఆపానని తెలిపారు. వారిని ఉరితీస్తే ఇరాన్‌పై తీవ్ర చర్యలు తీసుకుంటానని హెచ్చరించడంతో ఇరాన్ పాలకవర్గం వెనక్కి తగ్గిందన్నారు. కాగా, రాబోయే రోజుల్లో అమెరికాకు చెందిన అతిపెద్ద విమాన వాహక నౌక, ఇతర సైనిక దళాలు పశ్చిమాసియాకు చేరుకోనున్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. ఇరాన్‌తో ఉద్రిక్తతలు పెరుగుతోన్న నేపథ్యంలో గత వారం ఆసియా-పసిఫిక్ ప్రాంతం నుంచి విమాన వాహక నౌక 'యూఎసఎస్ అబ్రహం లింకన్' సహా పలు యుద్ధనౌకలు ముందుకు కదిలినట్లు పేర్కొన్నాయి. వీటితోపాటు అదనపు వైమానిక రక్షణ వ్యవస్థలను కూడా పశ్చిమాసియాకు పంపడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వైట్‌హౌస్ అధికారిక వర్గాలు వెల్లడించాయి.



## జనగామలో మంత్రి సీతక్క పర్యటనలో ఉద్రిక్తత

జనగామ: జనగామలో పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క పర్యటనలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల సందర్భంగా.. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది.

పెంబర్తి క్రాస్ వద్ద చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య, సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణలో ఇరు పార్టీల శ్రేణులు పాల్గొన్నారు. కొబ్బరికాయ కొట్టేందుకు బీఆర్ఎస్ నాయకులను ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి ఆహ్వానించారు. ఇది బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమం కాదని కాంగ్రెస్ నేతలు అభ్యంతరం తెలిపారు. ఈ క్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య తీవ్ర తోపులాట జరిగింది.

పల్లా గో బ్యాక్ అంటూ కాంగ్రెస్ నేతలు నినాదాలు చేశారు. రెండు పార్టీల శ్రేణులను పోలీసులు చెదరగొట్టారు.

## ఈవో దూషించారంటూ కొండగట్టు ఆలయ అర్చకులు ఆందోళన

కొండగట్టు: జగిత్యాల జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు అంజన్న ఆలయ అర్చకులు ఆందోళనకు దిగారు.

తమపై ఈవో శ్రీకాంత్‌రావు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ నిరసన తెలిపారు. ఏపీ మంత్రి నారా లోకేశ్ జన్మదినం సందర్భంగా ఆలయంలో స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచన మేరకు 50 మంది అభిమానులకు ప్రత్యేక దర్శనాలు చేయించారు. ఈ విషయంలో తమపై ఈవో ఆగ్రహం వ్యక్తం చేస్తూ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ అర్చకులు ఆందోళనకు దిగారు. "ఈవో పరుష పదజాలంతో దూషించారు. మాకు న్యాయం చేయాలి. మా గౌరవాన్ని, ఆచార సాంప్రదాయాలు కాపాడాలి" అని అర్చకులు తెలిపారు.



## మాజీ సీఎం కేసీఆర్ ఔదార్యం.. ఏం చేశారంటే..



హైదరాబాద్, జనవరి23 : మాజీ సీఎం, బీఆరస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మరోసారి ఔదార్యాన్ని చాటారు. బీఆరస్ సీనియర్ నాయకుడు, ఉద్యమకారుడు, ములుగు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కుసుమ జగదీశ్ కుటుంబానికి కేసీఆర్ అండగా నిలిచారు. పార్టీలో మొదటి నుంచి క్రియాశీలకంగా వ్యవహరించిన కుసుమ జగదీశ్ రెండేళ్ల క్రితం అనారోగ్యంతో కన్నుమూశారు. జగదీశ్ కుమార్తె సుకీర్తి మెడిసిన్ చదవడానికి ప్రయత్నిస్తున్న విషయం గురించి కేసీఆర్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్నారు.


**చెక్కు అందజేత..** ఆమె మెడిసిన్ చదవడానికి అవసరమైన ఫీజు చెక్కును శుక్రవారం ఎర్రవెల్లి నివాసంలో సుకీర్తికి అందజేశారు. మంచిగా చదువుకోవాలని, ఆమె కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని సుకీర్తిని ఆశీర్వదించారు. సుకీర్తితో పాటు మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ , మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, ములుగు బీఆరస్ శ్రేణులు కేసీఆర్‌ను కలిశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ కార్యకర్తల పట్ల చూపే ఆదరణకు ఈ సంఘటన ఒక నిదర్శనమని ఆ పార్టీ నేతలు తెలిపారు. కుసుమ జగదీశ్ కుటుంబానికి అధినేత అందించిన ఈ ఆర్థిక సహాయం ఆ కుటుంబంలో కొత్త వెలుగును నింపిందని బీఆర?స్ నేతలు పేర్కొన్నారు.




## భగ్గుమన్న బంగారం, వెండి ధరలు ఒక్క రోజులోనే సీన్ రివర్స్

నిన్న భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు నేడు ఒక్కసారిగా ఎగబాకాయి. 10 గ్రాముల మేలిమి బంగారం ధర సుమారు రూ. 5400 మేర పెరిగి రూ. 1.60 లక్షలకు చేరువ అయ్యింది. వెండి ధర కూడా ఏకంగా రూ. 20 వేల మేర పెరిగి రూ. 3.6 లక్షలకు చేరింది. నేడు (జనవరి 23) ఉదయం 11.00 గంటల సమయంలో భారత్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ. 1,59,710గా ఉంది. ఇక 22 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ. 1,46,400 వద్ద తచ్చాడుతోంది. వెండి ధర కూడా నేడు అనూహ్యంగా పెరిగింది. ప్రస్తుతం కిలో వెండి ధర రూ. 3.60 లక్షలకు చేరింది. డాలర్ బలహీనపడటం, అమెరికా ఫెడరల్ రిజర్వ్?కు కొత్త చైర్మన్ రానున్న నేపథ్యంలో బంగారం, వెండి ధరలు మళ్లీ మిన్నంటుతున్నాయని మార్కెట్ నిపుణులు కామెంట్ చేస్తున్నారు.

# జనవరి 24... జాతీయ గీతంగా జనగణమన స్వీకరణ




భారత జాతీయ గీతంగా జనగణమన 1911లో రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన, మొదటిసారి పాడిన గీతాన్ని 1950 జనవరి 24న రాజ్యాంగ సభ స్వీకరించిన రోజు. జనగణమన భారత జాతీయగీతం. నోబెల్ బహుమతి గ్రహీత, రవీంద్రనాథ్ టాగోర్ రాసిన బెంగాలీ గీతం లోని మొదటి భాగం ఇది. భారత జాతీయగీతం సంస్కృత పద భూయిష్టమైన బెంగాలీ భాషలో ఉంది. 1911 డిసెంబర్ 27 న కలకత్తాలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో మొదటి సారిగా పాడారు.1912 జనవరి లో ఈ గీతాన్ని "తత్వ భోదిని" అనే పత్రిక "భారత విధాత" అనే పేరుతో ప్రచురించింది. 1950 జనవరి 24 న జాతీయగీతంగా రాజ్యాంగ సభ స్వీకరించింది. ఈ గీతానికి సంగీత బాణీ కూడా ముందుగా ఠాగూర్ సృష్టించారు. బాణీ కనుగుణంగా ఈ గీతాలాపన చేసేందుకు 52 సెకండ్లు పడుతుంది. అప్పుడప్పుడు మొదటి, చివరి పాదాలను మాత్రమే పాడే పద్ధతి కూడా ఉంది. దీనికి 20 సెకండ్లు పడుతుంది. భారతదేశ జాతీయగీతం 'జనగణమన' గీతాన్ని విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ నిజానికి 1911లోనే రాశారు. అదే ఏడాది డిసెంబర్ 27న కోల్?కతాలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశాలలో కూడా దానిని ఆలపించారు. ఆ తర్వాత కూడా జాతీయోద్యమం నేపథ్యంలో ఆ గీతాన్ని అనేక సార్లు, అనేక వేదికల మీద ఆలపించారు. అయితే ఇప్పుడు మనం వినే ట్యూన్?లో కాకుండా, నిర్దిష్టమైన స్వర కల్పన లేకుండా, ఎవరికి నచ్చిన రాగంలో వాళ్లు పాడుకునే వారు. జనగణమనకు ఆ స్వరాన్ని కట్టింది ఒక ఐరిష్ జాతీయురాలైతే... దానికి వేదికైంది చిత్తూరు జిల్లా మదనపల్లె అనే విషయం చాలా మందికి తెలియని తెలియదు. భారత స్వాతంత్రోద్యమాన్ని బలపరిచిన డాక్టర్ అనీబిసెంట్ మదనపల్లెలో థియోసాఫికల్ కాలేజీని స్థాపించారు. ఐరిష్ జాతీయుడైన ప్రముఖ విద్యావేత్త జేమ్స్ హెన్రీ కజిన్స్ దాని ప్రిన్సిపాల్?గా ఉండేవారు. లండన్ మ్యూజిక్ కాలేజిలో చదువుకున్న ఆయన భార్య మార్గరెట్ కజిన్స్ అక్కడ సంగీతాన్ని నేర్పించేవారు.

1919లో దక్షిణ భారతదేశ పర్యటనలో ఉన్న రవీంద్రనాథ్ ఠాగూర్ ఒకరోజు బెంగళూరు చేరుకున్నారు. అక్కడ ఉన్నపుడే ఆయనకు మదనపల్లె వాతావరణం, జేమ్స్ కజిన్స్ కవిత్వం అంటే చాలా ఇష్టమైన ఠాగూర్?, కజిన్స్ అక్కడే ఉన్న విషయం తెలుసుకుని, ఆయన విశ్రాంతి కోసం మదనపల్లెలోని థియోసాఫికల్ కాలేజీ చేరుకున్నారు. ఠాగూర్‌కు ప్రశాంత వాతావరణం కలిగిన థియోసాఫికల్ కాలేజీలో ప్రతి బుధవారం భోజనాల తర్వాత విద్యార్థులంతా కలిసి పాటలు పాడేవాళు . ఆ సమయంలో అక్కడే ఉన్న ఠాగూర్, ఒక కార్యక్రమంలో పాల్గొని, ఆ సందర్భంగా ఆయన స్వయంగా తన గొంతుకతో జనగణమన ఆలపించారు. ఠాగూర్ కంఠస్వరం నుంచి వెలువడిన ఆ పాటకు విద్యార్థులంతా గొంతు కలిపారు. మార్గరేట్ కజిన్స్ కూడా ఆ సమయంలో అక్కడే ఉండి, పాటలోని దేశభక్తిని, జాతీయ భావాన్ని గమనించారు. కానీ అప్పటికి జనగణమనను ఎవరికి వారే తోచిన రీతిలో పాడుకునే వారు. ఎవరూ రాగయుక్తంగా పాడ లేదు. కనుక దానిని తానే స్వరబద్ధం చేయాలని నిర్ణయించు కున్నారు. తెల్లవారి ఆమె ఠాగూర్?ను కలిసి జనగణమనను స్వరబద్ధం చేయాలన్న తన కోరికను వెలిబుచ్చారు. దీనికి అంగీకరించిన ఠాగూర్, ఆమెకు ఆ పాట అర్థాన్ని వివరించారు. దానికి స్వరం ఎలా ఉంటే బాగుంటుందో సూచించారు. తర్వాత మార్గరేట్ కజిన్స్ తన విద్యార్థినుల సహాయంతో ప్రతి పదానికి అర్థం తెలుసుకుంటూ దానికి. బాణీ సమకూర్చారు. తర్వాత ఠాగూర్?కు తాను కట్టిన స్వరాన్ని వినిపించారు. కొన్ని చిన్న చిన్న సంగీత పరికరాలతో విద్యార్థులు రాగయుక్తంగా పాడిన జనగణమన గీతాన్ని విన్న ఠాగూర్ ఆమెను ఎంతగానో అభినందించారు. బెంగాల్‌లో పుట్టిన జనగణమన గీతం మదనపల్లెలో స్వరాన్ని సమకూర్చు కున్నది. రవీంద్రనాథ్ ఠాగూర్ మదనపల్లెలో ఉన్న సమయంలోనే ఒక ఉదయాన థియోసాఫికల్ కాలేజీ ప్రాంగణం లోని చెట్టుకింద కూర్చుని జనగణమనను ఆంగ్లం లోనికి అనువదించారు కూడా. ఆ తర్వాత దానిని తన అందమైన చేతిరాతతో రాయడమే కాకుండా, కింది భాగంలో దాని పేరు 'మార్నింగ్ సాంగ్ ఆఫ్ ఇండియా' అని రాశారు. దాని కింద ఫిబ్రవరి 28, 1919 అని రాసి, సంతకం చేసి, మార్గరేట్ కజిన్స్?కు బహుమానంగా ఇచ్చారు. మదనపల్లె కాలేజీ వదలివెళ్లే ముందు ఠాగూర్ దానిని 'దక్షిణ భారతదేశపు శాంతినికేతన్' అని కీర్తించారు. నిజానికి జనగణమన దేశభక్తి గేయం. 'జన గణ మన' ఇక నుంచీ మన కొత్త గణతంత్ర రాజ్యానికి జాతీయ గీతమనీ, దీన్ని అంతా గౌరవించి ఆదరించాలనీ 1950 జనవరి 24న రాజ్యాంగ సభ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్? ఓ ప్రకటన చేశారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో మహోన్నత పాత్ర పోషించిన 'వందేమాతరం' గీతాన్ని కూడా జన గణ మనతో సమానంగా గౌరవించి ఆదరించాలి" అని ఆ రోజున రాజేంద్ర ప్రసాద్? పేర్కొన్నారు. భారతదేశ రాజ్యాంగం ఆర్టికల్? 51ఏలో ఈ గీతాన్ని గౌరవించాలంటూ ప్రజలకు విజ్ఞప్తి చేసిన ప్రస్తావన కనిపిస్తుంది. "ప్రతి పౌరుడూ రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలి. జాతీయ పతాకం, జాతీయ గీతం వంటి రాజ్యాంగ ఆదర్శాలు, లక్ష్యాలు, సంస్థలను గౌరవించాలి" అని ఈ చట్టం పేర్కొంటున్నది. ప్రార్థనగా, కృతజ్ఞతగా పఠించే 52 సెకన్ల ఈ చిన్న గీతానికి ఉన్నంత గుర్తింపు , భారత దేశంలో, ప్రపంచంలో కూడా మరే గీతానికీ లేదు. మన జాతీయ గీతం దేశ సమైక్యతకు సరైన ప్రతీకగా నిలిచింది. జాతీయ గీతం, జాతీయ పతాకం పట్ల గౌరవం, ప్రేమాభిమానాలు ప్రదర్శించడమంటే మాతృభూమిని గౌరవించు కోవడమే అవుతుంది. ఇది ప్రతి ఒక్కరిలో దేశభక్తిని, జాతీయ భావాన్ని నింపడానికి ఉపకరిస్తుంది. జనగణమన పాడినప్పుడు దాని అర్థాన్ని కూడా ఒక్కసారి మననం చేసుకోవాలి. దాని నేపథ్యాన్ని, అర్థాన్ని, ప్రాధాన్యతను గుర్తించి, తర్వాత తరం వారికి చేర్చాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్ – 9440595494**

# తెలుగు సినిమా స్వర్ణయుగ రారాణి కృష్ణకుమారి


## జనవరి 24... కృష్ణకుమారి వర్ధంతి



కృష్ణకుమారి (మార్చి 6, 1933 – జనవరి 24, 2018) పాత తరం సినిమా కథానాయిక. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో సుమారు 25 సంవత్సరాలకు పైగా 150 పై చిలుకు చిత్రాల్లో నటించారు. మూడు జాతీయ పురస్కారాలు, రాష్ట్ర ప్రభుత్వ నంది పురస్కారాలు అందుకున్నారు. సావిత్రికి సమకాలీన నటి అయిన ఆమె షావుకారి జానకికి సొంత చెల్లెలు. ఎన్టీఆర్, ఏఎన?ర్,, కృష్ణ, శివాజీ గణేశన్ వంటి దిగ్గజాలతో ఆమె అనేక సినిమాల్లో నటించారు. పశ్చిమ బెంగాల్ లోని నైహతిలో ఓ తెలుగు బ్రాహ్మణ కుటుంబంలో 1933లో జన్మించారు కృష్ణ కుమా రి. వెంకోజి రావు –.సచీ దేవి ఆమె తల్లిదండ్రులు. ఆంధ్ర ప్రదేశ్ లోని రాజమండ్రి వీరి స్వస్థలం. వేదాంతం జగన్నాథ శర్మ దగ్గర శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నారు. ఒకసారి ఆమె తల్లితో సహా స్వప్న సుందరి సినిమా చూడడానికి వెళితే అక్కడకి సౌందరరాజన్ గారి అమ్మాయి భూమాదేవి కూడా వచ్చింది. సినిమా హాల్లో కృష్ణ కుమారిని చూసిన ఆమె నవ్వితే నవరత్నాలు సినిమా కోసం అమా యకంగా కనిపించే కథా నాయిక కోసం వెతుకుతున్నట్లు చెప్పారు. తర్వాత రోజే వారు కృష్ణ కుమారి ఇంటికి వచ్చి తల్లిదండ్రుల అను మతి తీసుకొని ఆమెకు ఆ పాత్ర నిచ్చారు. అలా తెలుగు సినిమా తెరకు 1951 లో నిర్మించిన నవ్వితే నవరత్నాలు సినిమా ద్వారా పరిచయం అయ్యా రు. కానీ దానికంటే ముందు మంత్ర దండం అనే సినిమా విడుదలైంది. తొలి చిత్రంలో నటిస్తుండగానే ఆమెకు 14 సినిమాల్లో అవకాశాలు వచ్చాయి. అప్పటికి ఆమె వయసు కేవలం 16 ఏళ్ళు మాత్రమే. తర్వా త 1953లో తాతినేని ప్రకాశరావు యన్.ఎ.టి.వారి పిచ్చి పుల్లయ్యలో కథానాయిక వేషం వేయించారు. అందులో మంచి నటన ప్రదర్శించిన కృష్ణకుమారికి పినిశెట్టిగారి పల్లె పడుచు, బంగారు పాప వంటి మంచి చిత్రాలతో పరిశ్రమలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. జానపద చిత్రాల కథానాయికగా, అభినయ రాజకుమారిగా తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సొంతం చేసుకున్నారు నటి కృష్ణకుమారి.

అసమాన నటన తో ఎన్నో వైవిధ్యమైన పాత్రలకు ప్రాణప్రతిష్ట చేసిన ఆమె తెలుగు చిత్రసీమలో విలక్షణ నటిగా తనకంటూ ప్రత్యేకతను చాటు కున్నారు. తరువాత ఇలవేల్పు, జయ విజయ, అభిమానం, దేవాం తకుడు మొదలైన చిత్రాలలో వివిధ కథానాయకుల సరసన నటించినా, తన నటనకు గుర్తింపుతెచ్చిన చిత్రా లు కె.ప్రత్యగాత్మగారి భార్యాభర్తలు (1961), కులగోత్రాలు (1962). 1963లో లక్షాధికారి, బందిపోటు, ఎదురీత, కానిస్టేబుల్ కూతురు చిత్రాల్లో వైవిధ్యం ఉన్న పాత్రలు వేశారు. ప్రభుత్వ బహుమతి పొందిన జగపతీ పిక్చర్స్ వారి అంతస్థులులో నాయికగా నటిం చారు. 1967–68 మధ్య కాలంలో ఉమ్మడి కుటుంబం, భువన సుందరి కథ, రహస్యం, చిక్కడు దొరకడు, స్త్రీ జన్మ వంటి చిత్రాలలో వైవిధ్యమున్న పాత్రలు పోషించారు. వరకట్నంలో నాయికగా గ్లామరస్ పాత్ర తర్వాత చిత్రాలు తగ్గి 1970 దశాబ్దంలో కొన్ని చిత్రాలలో నటించ గలిగారు. సుమారు రెండు దశాబ్దాల నట జీవితంలో ఆమె సుమారు 150 సినిమాలలో నటించారు. వాటిలో ఎక్కువగా తెలుగు సినిమాలైతే, 15 కన్నడ చిత్రాలు, కొన్ని తమిళ భాషా చిత్రాలు. మూడు భాషల చిత్రా ల్లోనూ ఆమే స్వయంగా డబ్బింగ్ చెప్పు కోవడం విశేషం. ఆమె ఆనాటి నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వర రావు, కాంతారావు, కృష్ణంరాజు, జగ్గయ్య, హరనాథ్, అందరు మహా నటులతోను నటించి మెప్పించారు. కాంతారావుతో కలిసి 28 జానపద చిత్రాల్లో నటించారు.1963 లో కృష్ణ కుమారి 16 సినిమాల్లో కథానాయి కగా నటించారు. ఒక్క ఏడాదిలో అత్యధిక సినిమాల్లో కథానాయికగా నటించడంలో ఆమె రికార్డు ఇప్పటికీ పదిలంగా ఉంది. ఇందు కోసం ఆమె మూడు నెలలపాటు మూడు షిఫ్టులు ఖాళీ లేకుండా పనిచేశారు. బాలీవుడ్ లో కిశోర్ కుమార్ తో ఒకే ఒక సినిమాలో కథానాయికగా నటించారు. అప్పటికి హిందీ చిత్ర పరిశ్రమలో కృష్ణకుమారి పేరుతో వేరే నటి ఉండటంతో రతి అనే పేరుతో పరిచయం అయినారు. వద్దంటే పెళ్లి, గంగా గౌరీ సంవాదం, సతీ సుకన్య, రమా సుందరి, జయ విజయ, పెళ్లి కానుక, దేవాంత కుడు, వినాయక చవితి, ఇరుగు పొరుగు, అగ్గిపిడుగు, మర్మయోగి, ఉమ్మడి కుటుంబం, లక్షాధికారి, బందిపోటు, బంగారు భూమి, గుణవంతుడు, జేబుదొంగ, యశోద కృష్ణ, దేవదాసు, నేరము శిక్ష, మానవుడు దానవుడు, భార్య బిడ్డలు, తల్లా పెళ్లామా, శ్రీకృష్ణావ తారం, అంతస్తులు, గుడి గంటలు, డాక్టర్ చక్రవర్తి, చదువుకున్న అమ్మా యిలు ఎదురీత, కులగోత్రాలు, భార్యాభర్తలు, శభాష్?రాజా, దీపా వళితో పాటు పలు సినిమాలు ఆమె నటనా ప్రతిభకు తార్కా ణాలుగా నిలిచాయి. ఇండియన్ ఎక్స్ ప్రెస్ మాజీ ఎడిటర్, స్క్రీన్ మేగజైన్ వ్యవ స్థాపకులు, బిజినెస్ మాన్ అయిన కర్ణాటకకు చెందిన అజయ్ మోహన్ ఖైతాన్ ను కృష్ణ కుమారి పెళ్లి చేసు కున్నారు. ఆమెకు చిన్నప్పటి నుండి భానుమతి అంటే చాలా ఇష్టం. ఆమెతో కలిసి కులగోత్రాలు, పుణ్య వతి సినిమాల్లో నటించినప్పుడు ఎంతో థ్రిల్ ఫీలయ్యానని, మహా నటి సావిత్రి తనను స్వంత చెల్లెల్లా చూసుకొనేదని చేపుతుండే వారు. ఆమెకు మూడుసార్లు జాతీయ అవార్డులు, రాష్ట్రస్థాయిలో నంది అవార్డులు వచ్చాయి. ఆమె కాంచన మాల, సావిత్రి, ఎన్టీయార్ అవార్డులు గెలుచుకున్నారు. బ్రిటన్ లోని బర్మింగ్ హాం సంస్థ వారి లైఫ్ టైం అచీవ్?ట్ అవార్డు పొందారు. కృష్ణ కుమారి 2018, జనవరి 24 ఉదయం బెంగుళూరులో అనారోగ్యంతో మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్ – 9440595494**

# భారతదేశ అణుశక్తి పితామహుడు హోమీ బాబా - జనవరి 24...హోమీ జహంగీర్ భాభా వర్ధంతి




హోమీ జహంగీర్ భాభా (1909–1966) భారతదేశ శాస్త్ర రంగానికి, అణుశక్తి అభివృద్ధికి అత్యంత విలువైన సేవలు అందించిన గొప్ప శాస్త్రవేత్త. ఆయన భారతదేశాన్ని అణుశక్తి రంగంలో స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దడంలో ముఖ్యపాత్ర పోషించి, "భారత అణుశక్తి పితామహుడు"గా గుర్తింపు పొందారు. హోమీ జహంగీర్ భాభా 1909 అక్టోబర్ 30న ముంబైలో ఒక సంపన్న పార్సీ కుటుంబంలో జన్మించారు. తండ్రి జెహంగీర్ హోర్ముస్?జీ భాభా, ఒక ప్రముఖ న్యాయవాది. తల్లి మీహర్?బాయి, కళలపట్ల గొప్ప ఆసక్తి కలిగి ఉండేవారు. కుటుంబం విద్యకు ప్రాముఖ్యతనిచ్చింది, ఇది భాభా వ్యక్తిత్వం అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషించింది. భాభా చిన్నతనం లోనే శాస్త్రానికి ఆసక్తి కనబరిచారు. కుటుంబం నుంచి వచ్చిన ప్రోత్సాహంతో, ఇంజినీరింగ్ విద్య కోసం ఇంగ్లాండ్?లోని ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయానికి వెళ్లారు. భాభా కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో భౌతిక శాస్త్రాన్ని అభ్యసించి, భౌతిక శాస్త్ర రంగంలో అద్భుతమైన పరిశోధనలు చేపట్టారు. భాభా–హీట్లర్ సిద్ధాంతం: కాస్మిక్ రేడియేషన్?పై ఆయన చేసిన అధ్యయనాలు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందాయి. భౌతిక శాస్త్రంలో చేసిన ఈ పరిశోధనలు, ప్రతిభను ప్రదర్శించడంతో పాటు, భవిష్యత్తులో ఆయనకు మార్గదర్శకంగా నిలిచాయి. భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత భాభా దేశంలోని శాస్త్ర అభివృద్ధికి పెద్ద అడుగు వేశారు.1945లో ఆయన టాటా ఇన్?స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్‌ను స్థాపించారు. ఇది శాస్త్రవేత్తల కోసం పరిశోధన కేంద్రంగా మారింది.ు×ఖీ= ను భౌతిక శాస్త్రం, అణు శక్తి, మరియు ఖగోళ శాస్త్రంలో ముఖ్య కేంద్రంగా అభివృద్ధి చేశారు.1948లో స్థాపించబడిన ఆటామిక్ ఎనర్జీ కమిషన్కు భాభా అధ్యక్షత వహించారు. ఈ కమిషన్ ద్వారా భారతదేశం శాంతియుత అవసరాల కోసం అణుశక్తిని వినియోగించుకోవడం ప్రారంభించింది. ట్రాంబేలో ఆయన ఆధ్వర్యంలో అణు పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయబడింది. ఇది తర్వాత భాభా అటామిక్ రీసెర్చ్ సెంటర్గా పునర్నామీకరించబడింది. భాభా భారతదేశాన్ని అణుశక్తి రంగంలో గ్లోబల్ లీడర్?గా తీర్చిదిద్దే దిశగా పనిచేశారు. ఆయన ప్రతిపాదించిన త్రిస్థాయి ప్రణాళికలో యురేనియం, థోరియం వంటి శక్తి వనరుల వినియోగం ప్రధానంగా ఉంది. విద్యుత్ ఉత్పత్తి, వైద్యం, మరియు పరిశ్రమల అభివృద్ధిలో అణుశక్తిని వినియోగించేందుకు ఆయన ప్రాధాన్యతనిచ్చారు. విదేశీ ఆధారాన్ని తగ్గించి, స్వదేశీ శక్తి, మరియు సాంకేతిక పరిజ్ఞానానికి ప్రాధాన్యతనిచ్చారు. భాభా శాస్త్రవేత్తగా మాత్రమే కాకుండా ఒక సంపూర్ణ వ్యక్తిత్వం కలిగిన వ్యక్తిగా ప్రసిద్ధి చెందారు. ఆయనకు సంగీతం, చిత్రలేఖనం, మరియు కళలపై ప్రత్యేక ఆసక్తి ఉంది. భాష పట్ల ఆయనకు ఉన్న ఆసక్తి ఆయనను ఆంగ్లం, ఫ్రెంచ్, మరియు ఇతర భాషల్లో నిపుణుడిగా మార్చింది. 1966 జనవరి 24న స్విట్జర్లాండ్?లో జరిగిన విమాన ప్రమాదంలో భాభా మరణించారు. ఆయన మరణం భారత శాస్త్రరంగానికి తీరని నష్టం. ఆయన స్థాపించిన సంస్థలు (ు×ఖీ= మరియు దీూ=జ) భారతదేశ శాస్త్ర రంగానికి కీలక కేంద్రాలుగా కొనసాగుతున్నాయి. హోమీ జహంగీర్ భాభా భారతదేశ శాస్త్రరంగంలో తారగా నిలిచారు. ఆయన కలలైన అణుశక్తి రంగంలో స్వయం సమృద్ధి భారతదేశాన్ని ప్రపంచంలో ప్రధాన స్థానంలో నిలిపింది. భాభా శ్రద్ధ, పట్టుదల, దూరదృష్టి భారత శాస్త్ర రంగానికి మార్గనిర్దేశం చేస్తూ, దేశ అభివృద్ధికి చిరస్థాయిగా ప్రేరణనిస్తుంది. "హోమీ జహంగీర్ భాభా పేరు భారత శాస్త్రరంగ చరిత్రలో సుదీర్ఘకాలం వెలుగొందుతుంది."

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్ – 9440595494**

# ముచ్చింతల్ క్షేత్రంలో గుబాలిస్తున్న ఆధ్యాత్మిక పరిమళాలు

## నానాటికీ అధికమవుతున్న భక్తుల సందర్శనలు



ముచ్చింతల్ లో పరమహంస పరివ్రాజకాచార్య శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి చొరవతో 216 అడుగుల ఎత్తయిన రామానుజాచార్యుల విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగి నాలుగేళ్లు పూర్తయింది. ఈ విగ్రహాన్ని భారత ప్రధాని నరేంద్ర మోదీ 5 ఫిబ్రవరి 2022న వసంత పంచమి పర్వదినం సందర్భంగా ఆవిష్కరించి జాతికి అంకితం ఇచ్చారు. 2026 వసంత పంచమితో విగ్రహావిష్కరణ నాలుగేళ్లు పూర్తి చేసుకుంది. రాజాదరణ పొంది ప్రాబల్యాన్ని సంతరించుకున్న జైన, – బౌద్ధ, శైవ మతాలు స్థానిక ఆచార వ్యవహారాలలో కలసి, అనేకానేక శాఖలుగా విభజితాలై, వేర్వేరు సిద్ధాంతాలను ప్రతిపాదిస్తూ తమ శాఖలు – గొప్ప వని నొక్కి చెబుతూ, మూల ఉపనిషత్తుల సారాన్ని ప్రజలకు చేరువ చేయజాలని సమయాన, విశిష్టాద్వైతాన్ని ప్రతిపాదించి ఉద్ధరించారు శ్రీ రామానుజా చార్యులు. త్రిమతాచార్యులలో, ద్వితీయులైనా, కర్తవ్య నిర్వహణలో అద్వితీయులు. అసమాన ధైర్యాన్ని ప్రదర్శించి, – సాటిలేని భక్తి తత్పరునిగా తత్వవేత్తగా, ఆస్తిక హేతువాదిగా, పరమ యోగిగా, నాటికి ప్రబల ప్రచారంలో ఉన్న సంప్రదాయాలన్నీ, దేవుడిని కొలవడానికి భిన్న మార్గాలే కాని, వైదిక మతానికి బదులుగా పాటించాల్సినవి కానే కాదని నొక్కి చెప్పిన ధీశాలి ఆయన. రామానుజులు జన్మించే నాటికి చోళులు, శైవ మతానుయాయులు అయినప్పటికీ, వైదిక మతాలను వ్యతిరేకించ లేదు. చాళుక్యులు శైవ మతస్తులు అయి ఉండి, తర్వాత జైన మతాన్ని ఆలపించారు. హట్నయసల రాజులు, జైన, వీరశైవ మతాలను ఆదరించారు. మౌర్యుల కాలానికి బౌద్ధం క్షీణ దశకు చేరుకుంది. మద్రాసుకు 30 మైళ్ళ దూరాన గల, శ్రీపెరుంబుదూరులో, హరిత గోత్రోద్భవులు, ఆపస్తంభ సూత్ర, యజుర్వేద శాఖాధ్యాయులు, శ్రీమాన్ అసూరి సర్వక్రతు కేశవ సోమయాజి దీక్షితార్, కాంతిమతి దంపతులకు కలియుగ సంవత్సరం 4118 క్రీస్తు శకం 1017 వైశాఖ శుక్ల పక్ష షష్టి గురువారం జనన మొందారు రామానుజులు. రామానుజులు ఆనాటి ఆచార వ్యవహారాలు, చాందసంగా మారి, సామాజిక ప్రగతికి అడ్డు రాకముందే, గుర్తించి వాటిని, మానడమో, మార్చడమో చేయాలని కర్తవ్య నిర్దేశం చేశారు. గురువు చెప్పేదంతా గుడ్డిగా నమ్మక తర్కానికి గురిచేసి, తప్పో, ఒప్పో నిర్ణయించు కోవడం పాపం కాదని, హితవు పలికారు. సమాజ శ్రేయస్సు కన్నా, వ్యక్తిగత శ్రేయస్సు ముఖ్యం కాదని రామానుజులు నొక్కి చెప్పారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల్ లో 45 ఎకరాల విస్తీర్ణంలో పరమ హంస పరివ్రాజకాచార్య శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి సత్ సంకల్పంతో దివ్య క్షేత్ర పనులు 2016లో ప్రారంభ మయ్యాయి. 45 ఎకరాల విస్తీర్ణంలో రూ.1000 కోట్లతో పనులు జరిగాయి. పల్లవ, చోళ, చాళుక్య, కాకతీయ, విజయనగర నిర్మాణ శైలులను కలగలిపి వివిధ 2700 మంది శిల్పుల భాగస్వామ్యంతో నిర్మాణాలు చేపట్టగా, ప్రధానంగా.. సమతామూర్తి 216 అడుగుల, 1800 కిలోల బరువు గల మహా పంచలోహ విగ్రహాన్ని 1600 భాగాలుగా తొమ్మిది నెలల కఠోర శ్రమ తో చైనాలో తయారు చేయించారు. మన దేశానికి తెచ్చాక చైనాకు చెందిన 60 మంది నిపుణులు విగ్రహ రూపునిచ్చారు. వెయ్యేళ్ల పాటు చెక్కుచెదరకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. సమతామూర్తి మహా విగ్రహం చుట్టూ శ్రీవైష్ణవంలో దివ్య. దేశాలుగా భావించే 108 పుణ్య క్షేత్రాలు, గర్భాలయాల ఆకృతిలో 108 ఆలయాలను నిర్మించారు. వీటిని అనుసంధానిస్తూ మధ్యలో 468 స్తంభాలతో భారీ దివ్యదేశ మండపాన్ని నిర్మించారు. సమతామూర్తి విగ్రహ దిగువ న భద్రవేదిక 54 అడుగులు, పద్మ పీఠం 27 అడుగులు, శ్రీరామానుజాచార్యుల విగ్రహం 108 అడుగులు, స్వామి చేతిలోని త్రిదండం 27 అడుగుల ఎత్తు ఉన్నాయి. మహా విగ్రహం కింద విశాలంగా ఉన్న గర్భగుడిలో 120 కిలోల బంగారు విగ్రహ రూపంలో రామానుజులు నిత్య పూజా మూర్తిగా దర్శనం ఇస్తారు. అలా వెయ్యేళ్ల క్రితం భారతావనిలో నడయాడిన సమతా మూర్తి జగద్గురు శ్రీరామానుజాచార్యులు భక్తులకు నిత్య దర్శనం ఇస్తున్నారు. ముచ్చింతల్ లో గల త్రిదండి చినజీయర్ స్వామి చొరవతో 216 అడుగుల ఎత్తయిన రామానుజాచార్యుల విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగి నాలుగేళ్లు పూర్తయింది. 2022 ఫిబ్రవరి 5వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన చేతుల మీదుగా ఈ సమతా మూర్తి విగ్రహాన్ని ఆవిష్కరించారు. వసంత పంచమితో ఐదవ సంవత్సరంలోకి అడుగు పెట్టింది. రామానుజులవారి బ్రహ్మోత్సవాలు సమతా కుంభ్ 2023 పేరుతో ఆధ్యాత్మిక పండగను 10 రోజుల పాటు నిర్వహించారు. గత నాలుగేళు ్లగా అనుదినం దేశ విదేశాల నుండి పర్యాటకులు, సందర్శకులు, యాత్రికులు, భక్తులు నానాటికీ పెరిగిపోతూ, కొత్త అనుభూతులను వెంట తీసుకెళ్ళు తున్నారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్.. 9440595494**

చురకలు

## సంపాదకీయం

# గవర్నర్లకు ఏమైంది దేశంలో కలకలం!

మొన్న తమిళనాడు.. నిన్న కేరళ.. నేడు కర్ణాటక.. రాష్ట్రం ఏదైనా.. గవర్నర్లు వ్యవహరిస్తున్న తీరు తీవ్ర వివాదానికి దారితీస్తోంది. తమిళనాడులో డీఎంకే ప్రభుత్వానికి అక్కడి గవర్నర్ ఆర్.ఎన్. రవికి మధ్య వివాదం అందరికీ తెలిసిందే. గత రెండేళ్లుగా ఆయన సర్కారును ముప్పుతిప్పలు పెడుతున్నారు. ఈ విషయాన్ని సాక్షాత్తూ సుప్రీంకోర్టు కూడా చెప్పింది. రాష్ట్ర ప్ర భుత్వం చేసిన బిల్లులను ఆమోదించకపోవడం గత ఏడాది పెద్ద దుమారంగా మారి.. దేశాన్ని సైతం కుదిపేసింది. దీనిపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇవ్వగా.. దీనిని రాష్ట్రపతి ప్రశ్నిస్తూ.. సుప్రీంకోర్టుకు లేఖ సంధించారు. ఈ మొత్తం వ్యవహారానికి గవర్నర్ ఆర్. ఎన్. రవివ్యవహరించిన తీరే కారణమన్నది అందరికీ తెలిసిందే. ఇక, తాజాగా కేరళ ప్రభుత్వానికి కూడా ఎదురుతిరిగినట్టుగా అక్కడి గవర్నర్ వ్యవహరించారు. కేరళ అసెంబ్లీ నుంచి ఆయన వాకౌట్ చేయడం బుధవారం దేశవ్యాప్తంగా చర్చకు వచ్చింది. వాస్తవానికి కేరళలో ఇప్పటి వరకు గవర్నర్ వర్సెస్ ప్రభుత్వానికి మధ్య వివాదం లేదు. ఇక, ఇప్పుడు కర్ణాటకలో గవర్నర్ వర్సెస్ సర్కారుకు మధ్య వివాదం తెరమీదికి వచ్చింది. తాజాగా గురువారం ప్రత్యేకంగా భేటీ అయిన అసెంబ్లీలో ప్రభుత్వం రాసిచ్చిన ప్రసంగాన్ని చదవకుండానే గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ సభ నుంచి వాకౌట్ చేశారు. ఈ పరిణామంతో సీఎం సిద్దరామయ్య సహా.. మంత్రులు కూడా ఖిన్నులయ్యారు. కేంద్రం ఇటీవల తెచ్చిన జీ-రామ్‌జీ చట్టాన్ని రాష్ట్రాల్లో అమలు చేసేందుకు సభ లో చర్చించి.. ఆమోదించాల్సి ఉంది. అయితే.. బీజేపీ యేతర పార్టీల ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలు.. జీ-రామ్‌జీ బిల్లును తప్పుబడుతున్నాయి. దీంతో గవర్నర్లు.. సభలను వాకౌట్ చేస్తున్నారు. అయితే.. వాస్తవానికి గవర్నర్‌లు రాజ్యాంగ బద్ధంగా వ్యవహరించాలని రాజ్యాంగం చెబుతోంది. ఇక, పలు సందర్భాల్లో సుప్రీంకోర్టు కూడా గవర్నర్‌లను ఉద్దేశించి పలు కీలక వ్యాఖ్యలు చేసింది. అయినప్పటికీ కేంద్రం కనుసన్నల్లో పనిచేస్తున్న గవర్నర్లు స్వతంత్రంగా వ్యవహరించ లేక పోతుండడం గమనార్హం. ఇదిలావుంటే.. ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో ఈ రగడ మరింత ఎక్కువగా ఉంది.

# జనవరి 24...జాతీయ బాలికా దినోత్సవం




జాతీయ బాలికా దినోత్సవం ప్రతి సంవత్సరం జనవరి 24న నిర్వహించ బడుతుంది. సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల మొదలైన అంశాలపై ఈ బాలికా దినోత్సవం రోజున అవగాహన కల్పిస్తారు. బాలికలపట్ల వివక్ష, అసమానత, చిన్నచూపు, లైంగిక వేదింపులు, అత్యాచారాల నుండి రక్షించడానికి కుటుంబం, మిత్రులు, సమాజం సన్నద్ధం కావాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఆడపిల్ల అనగానే సమాజంలో చిన్నచూపు చూస్తున్నారు. అంతేకాకుండా కడుపులో బిడ్డ ఆడపిల్ల అని తెలియగానే భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారు. పుట్టిన తరువాత అనేక ఆంక్షలు విధిస్తున్నారు. వాటిని నిర్మూలించి ఆడపిల్లలపై ప్రత్యేక దృష్టిసారించే దిశగా భారత ప్రభుత్వం 'నేషనల్ గర్ల్స్ డెవలప్మెంట్ మిషన్' పేరుతో ఒక కార్యక్రమం రూపొందించింది. అందులో భాగంగా 2008లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంతో జాతీయ బాలికా దినోత్సవంను ప్రారంభించడం జరిగింది. సమాజంలో బాలికలు ఎదుర్కొన్న సమస్యలు గురించి ప్రజలలో అవగాహన పెంచడానికి జరుపు కుంటారు. బాలిక శిశువు గురించి అసమానత్వం, విద్య, పోషణ, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, రక్షణ, గౌరవం, బాల్య వివాహంల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. బాలికల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం 'నేషనల్ గర్ల్స్ డెవలప్?మెంట్ మిషన్' పేరుతో ఓ కార్యక్రమం తెచ్చింది. బాలికల సంపూర్ణ ఎదుగుదల కోసం రకరకాల సదుపాయాలు కల్పిస్తోంది. వాటిలో భాగమే జాతీయ బాలికా దినోత్సవం. 2008 నుంచీ దీన్ని ఏటా నిర్వహిస్తోంది. సమాజంలో బాలికల సంరక్షణ, వాళ్ల హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల అంశాలపై ఈ రోజున అవగాహన కల్పిస్తోంది. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రధాని అయ్యాక... "బేటీ బచావో బేటీ పడావో" స్కీం తెచ్చారు. తద్వారా బాలికల చదువు, పెంపకంపై మరిన్ని జాగ్రత్తలు తీసుకునేలా చేస్తున్నారు. సమాజంలో మహిళల హోదాను ప్రోత్సహించటానికి జరుపు కుంటారు. బాలికలు సాధారణంగా వారి జీవితంలో ఎదుర్కొనే వివిధ రకాల సాంఘిక వివక్ష, లైంగిక దోపిడీని నివారించడం అత్యవసరం. సమాజంలో మహిళల ప్రాదాన్యత, భాగస్వామ్యం గురించి అవగాహన పెంచడానికి, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, వివిధ రాజకీయ, సామాజిక, స్వచ్ఛంద సంస్థలు బాధ్యులు, సమాన విద్య, ప్రాథమిక స్వేచ్ఛ కోసం వివిధ కార్యక్రమాల ద్వారా వివరించడం జరుగుతుంది. బాలికల కంటే అబ్బాయిలకే ఎక్కువ ప్రాధాన్యత అధికంగా ఇవ్వడం సర్వత్రా వ్యక్తమవు తున్నది. ఇటీవల కాలంలో ఆడపిల్లగా పుట్టడం, పుట్టినా సురక్షితంగా మనుగడ సాగించడమే దుర్భరమైన దురవస్థ ఉంది. చైనా మొదలు అమెరికాతో సహా ఆధునికత వైపు అడుగులు వేస్తున్న భారత్?లోనూ అమ్మాయిలపట్ల వివక్ష ఉంటుందని గ్లోబల్ ఎర్లీ అడల్సెంట్ స్టడీ పేరిట నిర్వహించిన ఒక అధ్యయనంలో భాగంగా... అమ్మాయిలు పదహారేళ్ల వయసుకు చేరుకున్నప్పటికీ మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తేలింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ, జాన్?హాఫ్?కిన్స్ బ్లూమ్ బెర్గ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ కిడ్స్ సంయుక్తంగా 15 దేశాల్లో నిర్వహించిన సర్వేలో అమ్మాయిలు శారీరకంగా బలహీనులనే విషయం... చిన్న వయసులోనే ముద్ర పడేలా చేయడంలో తల్లిదండ్రులు, బంధువులు, మిత్రులు, టీచర్లు కీలకపాత్ర పోషిస్తున్నట్టు తేలింది.

**చిన్నారులపై లైంగిక వేధింపులు...** నేడు మహిళా సంఘాలు, ప్రభుత్వ యంత్రాంగం నిత్యం ఎన్నో చర్యలు తీసుకుంటున్నా మైనర్లపై అత్యాచారాలు ఆగడంలేదు. సమాజంలో అమ్మాయిలు, మహిళలకు రక్షణ కరువ వుతున్నది. ఎంతోమంది ఆడ పిల్లలు ఈ లోకంలో అడుగుపెట్టక ముందే బలవంతపు మరణాలకు బలవు తున్నారు. ఆధునిక పరిజ్ఞానం ఎంత పెరిగినా మానవతా విలువలు మాత్రం పెరగడం లేదు. దానికి నిదర్శనం భ్రూణ హత్యలు. గర్భస్థ శిశువుల లింగ నిర్ధారణను నిషేధించి తద్వారా ఆడపిల్లల భ్రూణ హత్యలు నివారణ కోసం 1994లోనే చట్టం తెచ్చినా అది ఏనాడూ పకడ్బందీగా అమలైన జాడలు లేవు. దేశంలో నానాటికీ అడపిల్లల సంఖ్య తగ్గిపోతూ, కొనసాగితే చాలా సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందనేది కాదన లేని వాస్తవం. ఇదే కాక ప్రపంచంలో జరుగుతున్న బాల్య వివాహాల్లో 40% పైగా భారతదేశం లోనే జరుగుతున్నాయని ఇటీవలే యూనిసెఫ్ గణాంకాలను వెల్లడించింది. బాలికల ఉన్నత విద్య మరో సమస్యగా మారింది, ఇప్పటికి అధిక రాష్ట్రాల్లో 40%నికి పైగా పదో తరగతి కంటే ముందే బడి మాని వేస్తున్నారు. ప్రభుత్వాలు ఎన్ని కార్యక్రమాలు చేసినా ఎన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా, ఉన్నత విద్యలో డ్రాపౌట్స్ తగ్గడంలేదు. బాల్య వివాహం కారణంగా రాష్ట్రంలోని 28 శాతం మంది బాలికలకు పద్దెనిమిది సంవత్సరంలోపే వివాహాలు చేస్తున్నారు. యునెస్కో వెలువరించిన ప్రపంచ విద్య నివేదిక ప్రకారం భారత దేశంలో వయోజన నిరక్షరాస్యులలో మహిళలు 68 శాతం వున్నారు. పంతొమ్మిది ఏళ్లు నిండక ముందే దాంపత్య జీవితంలో అడుగు పెడుతున్నారు. బాలికల సంఖ్య 41 శాతం అని జనగణనలో తేలింది. బాల్య వివాహాలు, పాఠశాలలు చేరువ, అందుబాటులో పూర్తి స్థాయిలో లేకపోవడం, బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్ల కొరత, లైంగిక విచక్షణ వంటి సమస్యలు భారతావనిలో బాలిక విద్యకు శాపంగా పరిణ మించింది. పోషకాహార లోపం కారణంగా రక్తహీనతతో బాధపడుతున్న బాలికల సంఖ్య దేశంలో దాదాపు డెబ్బై శాతం అన్న అంచనాలు తీవ్రంగా కలవర పరుస్తున్నాయి. మహిళా కార్మిక శక్తి, వారి ఆదాయం, అక్షరాస్యాత స్థాయి, జననాల విషయం, తదితర అంశాల్లో అథమస్థాయిలో వున్న 20 దేశాల్లో మన దేశం ఒకటి కావడం ఆందోళనకర అంశం. మహిళలు పురుషులకన్నా ఎందులోనూ తక్కువ కాదు. ఆడపిల్లలు ప్రతి రంగంలో, చదువులో మొదలుకుని ఆటల దాకా, రాణిస్తున్నారు. పురుషులతో పోటీ పడుతున్నారు. బాలికలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలియ చేయడమే కాకుండా, ఆ సమస్యలు పరిష్కరించ బడినప్పుడు జరిగే పరిణామాల గురించి కూడా అవగాహన పెంచడానికి ఈ దినోత్సవం ఉపయోగ పడుతున్నది. ఆడపిల్లలకి తప్పనిసరి అవసరమైన భద్రత, సాంకేతిక విజ్ఞానాన్ని సేవల్ని అందుబాటులో వుంచాలి. బాలికలను విద్యావంతులను చేసి, బాల్య వివాహాలు తగ్గించడంలో, విద్యను అభ్యసించిన బాలికలు అధిక వేతనాలతో ఉద్యోగాలు పొందడంలో మార్గదర్శకంగా నిలవడం ద్వారా మహిళత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కూడా సహాయ పడు తున్నది. ప్రపంచ వ్యాప్తంగా బాల్య వివాహాల్లో నలభై శాతంకి పైగా భారత్?లోనే జరుగుతున్నాయన్న చేదు నిజాన్ని యునిసెఫ్ స్పష్టం చేసింది. సమాజంలో చైతన్యం నింపాలంటే ముందు మహిళ జాగృతం కావాలి. స్త్రీ కళ్లు తెరిస్తే కుటుంబం, దానితో పాటు గ్రామం, రాష్ట్రం, దేశం పురోగతి బాట పడతాయి' అని భారత తొలి ప్రధాని జవహర్?లాల్ నెహ్రూ గతంలో చేసిన వ్యాఖ్యలు గుర్తుంచు కోవాలి. కౌమారదశలో ఆడపిల్లలు, యువతులు ఎదుర్కొనే వివిధ రకాల హింసను అంతం చేయాలి. బాలికలు వారి చట్టపరమైన హక్కులు మరియు జీవిత వాస్తవాలను గురించి తెలుసు కోవాలి. వారు మంచి విద్య, పోషణ, ఆరోగ్య సంరక్షణ హక్కులను కలిగి ఉంటారని అవగాహన కల్పించాలి. గృహ హింస చట్టం 2009, చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ 2006 నిషేధించడం మరియు కట్న నిషేధ చట్టం 2006 వంటి చట్టాల గురించి వారి సరైన హక్కులు పొందడానికి మరియు జీవితంలో అన్ని సవాళ్లను ఎదురుకొని ముందుకు వెళ్ళాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# ప్రజాస్వామ్యంలో రాజ్యాంగానికి ఉత్కృష్ట స్థానం - భారత రాజ్యాంగం ఆమోదానికి సభ్యులు ప్రతులపై సంతకాలు చేసిన దినం


భారత రాజ్యాంగం ద్వారా భారత దేశానికి గణతంత్ర ప్రతిపత్తి వచ్చింది. 1950 జనవరి 26 న భారత రాజ్యాంగాన్ని అమలు పరిచిన తరువాత స్వతంత్ర భారతదేశం సర్వసత్తాక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా అవతరించింది. ప్రతి సంవత్సరం భారత రాజ్యాంగ అమలు దినమైన. జనవరి 26 రోజును గణతంత్ర దినంగా జరుపు కుంటారు. పొట్టకూటికోసం, వ్యాపారం పేరుతో, మన దేశంలో అడుగు పెట్టిన శ్వేత జాతీయులు, చివరకు మన దేశాన్ని, రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యంలో భాగంగా చేసుకోగా, సుదీర్ఘకాలం పరాయి పాలనలో మగ్గిన దేశం భారతదేశం. ఎందరో స్వాతంత్ర్య సమర యోధుల త్యాగ ఫలితాలతో 1947 ఆగస్టు 15న స్వతంత్ర భారత మాత స్వేచ్ఛా వాయువులు పీల్చ గలిగింది. స్వయం పాలనాధికారాన్ని దక్కించుకున్న దేశంలోని అన్ని మతాలు, తెగలు, నిమ్న దళితులు, గిరిజనులు, వెనుక బడిన కులాల తదితర వర్గాలకు సైతం న్యాయం జరిగేలా, వారి హక్కులకు భంగం వాటిల్లకుండా ఉండేందుకు, సర్వసత్తాక సౌర్వభౌమాధికారాన్ని దక్కించు కొనేందుకు వీలుగా రాజ్యంగాన్ని రూపొందించాల్సిన బాధ్యత అప్పటి ప్రభుత్వంపై పడింది. రాజ్యాంగం అంటే దేశానికి, ప్రజలకు, ప్రభుత్వానికి కరదీపిక లాంటిది. ఆ దీపస్తంభపు వెలుగుల్లో సర్వసత్తాక సౌర్వభౌమాధికార దేశంగా ప్రగతి వైపు అడుగులు వేయాలి. అందుకనే రాజ్యాంగానికి ఆధునిక ప్రజాస్వామ్య చరిత్రలో అంతటి విశిష్టమైన స్థానముంది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మన దేశం కంటే ముందు అనేక దేశాలు రాజ్యాంగాలను రచించాయి. అయితే భారత రాజ్యాంగ రచన ఒక సంక్లిష్టం. దేశంలో అనేక మతాలు, తెగలు, ఆదీవాసీలు, దళితులు, అణగారిన, పీడనకు గురైన వర్గాలు... తదితరులు ఎందరో ఉన్నారు. సదరు వర్గాల ఆకాంక్షలకు అనుగుణంగా రాజ్యాంగ రచన నిస్సందేహంగా ఒక పెద్ద సవాలే. ఇందుకు భారత తొలి రాష్ట్రపతి బాబు రాజేంద్ర ప్రసాద్? నేతృత్వంలో డా.బాబా సాహెబ్? అంబేద్కర్? అధ్యక్షతన (ముసాయిదా) డ్రాఫ్టింగ్? కమిటీని ఏర్పాటు చేశారు. రాజ్యాంగాన్ని తయారు చేసుకోవడానికి దేశంలోని సుప్రసిద్ధ నాయకులు, న్యాయ కోవిదులు అనుభవజ్ఞులు, విద్యావేత్తలు, వివిధ రంగాల నిపుణులు, ప్రముఖులతో రాజ్యాంగ నిర్మాణ సభను నిర్వహించు కున్నారు. రాజ్యాంగ రూపకర్త అంబేద్కర్? భిన్నత్వ సమ్మేళితమైన దేశానికి రాజ్యాంగాన్ని రూపొందించడంలో ప్రముఖ పాత్రలో ఎంతగానో శ్రమించారు. ప్రభుత్వ విధి విధానాలు, శాసన సభల రూపకల్పనతో పాటు కోట్లాది మంది పీడిత ప్రజల ఆశయాలను ప్రతిబింభించేలా రాజ్యాంగాన్ని లిఖించారు. కులాలు, విభిన్న మతాలు, రకరకాల కట్టూ బొట్టు ఆచార వ్యవహారాల సంఘటిత భారతావనికి స్వపరిపాలనా రూపకల్పనను రాజ్యాంగ బద్ధం చేశారు. రాజ్యాంగమంటే కేవలం ప్రభుత్వ విధి విధానాలు, శాసన సభల రూపకల్పనే కాదు... కోట్లాది పీడిత ప్రజల ఆశయాలను ప్రతిబింభించాలన్నది బాబా సాహెబ్ ప్రధానాశయం. ఆయన కృషి ఫలితంగానే ప్రపంచంలోనే కొత్తదైన రాజ్యాంగం రూపు దిద్దుకుంది. అందుకనే ప్రపంచంలోని అనేక దేశాల రాజ్యాంగాల కంటే భారత రాజ్యాంగం ఉన్నత విలువలు కలిగిందంటూ మన్ననలు పొందింది. అంబేద్కర్ చైర్మన్‌గా, జవహర్?లాల్ నెహ్రూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్, సర్దార్ పటేల్, ఆచార్య జె.బి.కృపలానీ, డా.రాజేంద్ర ప్రసాద్, సరోజినీ నాయుడు, రాజాజీ, వల్లబ్ పంత్, బి.ఆర్.అంబేద్కర్, టంగుటూరి ప్రకాశం పంతులు, పట్టాభి సీతారామయ్య మొదలైన వారు ఈ సభలో సభ్యులు. 2 సంవత్సరాల, 11 నెలల, 18 రోజులు కష్టించి, రాజ్యాంగ సభ మొదటి సమావేశం 1946, డిసెంబర్ 9తో ప్రారంభించి 11 సార్లు, 165 రోజుల పాటు సమావేశాలు జరగగా, ఇందులో 114 రోజులు రాజ్యాంగం రాత ప్రతిపై వెచ్చించింది. రాజ్యాంగ రాతప్రతిని తయారుచేసే క్రమంలో రాజ్యాంగ సభ ముందుకు 7,635 సవరణ ప్రతిపాదనలు వచ్చాయి. వీటిలో 2,473 ప్రతిపాదనలను పరిశీలించి, చర్చించి, పరిష్కరించింది. ఏడు దశాబ్దాల కిందట 26నవంబర్? 1949నాడు డాక్టర్? బాబు రాజేంద్రప్రసాద్? అధ్యక్షతన సర్దార్? వల్లభాయి పటేల్? ప్రతిపాదించి ప్రవేశ పెట్టారు. అందమైన చేతిరాతతో హిందీ, ఇంగ్లీషు ప్రతులను, 24 జనవరి 1950న 284 మంది సభ్యుల సంతకాలతో అమోదించారు. రెండు రోజుల తర్వాత 26 జనవరి 1950నుంచి మన రాజ్యాంగం అమలులోకి వచ్చింది. రాజ్యాంగాన్ని సభలో ప్రవేశపెట్టే ముందు అప్పటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్... మహాత్మాగాంధీకి నివాళులు అర్పించి ప్రసంగించారు. రాజ్యాంగాన్ని ఆమోదించిన తర్వాత జాతీయ గీతం 'జనగణమన'ను స్వాతంత్ర్య సమర యోధురాలు పూర్ణిమా బెనర్జీ ఆలపించారు. భారత రాజ్యాంగం ప్రపంచంలోని అతి పెద్ద లిఖిత రాజ్యాంగాలలో ఒకటి. భారత రాజ్యంగ రూపకల్పన సమయంలో 8 షెడ్యూళ్ళు ఉండగా ప్రస్తుతం 12 షెడ్యూళ్ళు ఉన్నాయి. అవతారిక, 448 అధికరణాలు, 12 షెడ్యూళ్ళతో కూడిన గ్రంథం ఇది. రాజ్యాంగం భారత ప్రభుత్వ వ్యవస్థ, రాష్ట్రాలు, రాష్ట్రాల నిర్మాణం, కేంద్ర రాష్ట్ర సంబంధాలు, కేంద్ర రాష్ట్రాల విధులు, అధికారాలు, స్థానిక సంస్థలు, ఎన్నికలు మొదలైన విషయాలను నిర్వచించింది. ప్రధానంగా ప్రజలందరికీ స్వేచ్ఛ, పార్ల మెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ, బలమైన కేంద్రంతో కూడిన సమాఖ్య వ్యవస్థ, ప్రాథమిక విధులు, ప్రాథమిక హక్కులు, ఆదేశ సూత్రాలు, ద్వి సభా విధానం, భాషలు, వెనక బడిన సామాజిక వర్గాల సంబంధిత అంశాలన్నీ చేర్చబడినాయి. 1936 భారత ప్రభుత్వ చట్టం ప్రకరణలు , 16 షెడ్యూళ్ళు, 14 విభాగాలు ఉండగా, దానిని రద్దు పరుస్తూ, 315 నిబంధనలు , 8పెడ్యూళబ్ళు భారత రాజ్యాంగ రూపకల్పనా సమయంలో ఉండగా, ప్రస్తుతం 12 ఉన్నాయి. 1951లో మొదటి రాజ్యాంగ సవరణ ద్వారా 9వ షెడ్యూల్ ను చేర్చగా , 1985లో 52 వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజీవ్ గాంధీ ప్రధాని కాలంలో 10వ షెడ్యూల్, తర్వాత 1992 సంవత్సరంలో 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా 11 మరియు 12 వ షెడ్యూల్స్



ను చేర్చడం జరిగింది. భారత దేశ గణతంత్ర దినోత్సవాన్ని భారత రాజ్యాంగం అమలు లోనికి వచ్చిన రోజు జరుపుకునే సంప్రదాయాచరణ అమలవుతున్నది. 1935 భారత ప్రభుత్వ చట్టానికి బదులు భారత రాజ్యాంగం దేశ పరిపాలనకు మార్చడాన్ని "భారత దేశ గణతంత్ర దినం"అంటారు. భారత రాజ్యాంగ సభలో 1949 నవంబర్ 26న రాజ్యాంగం ఆమోదం పొంది, 1950 జనవరి 26న దీనిని ప్రజాతంత్ర పాలన పద్ధతి ' న అమల్లోకి తేవాలని నిర్ణయించారు. జనవరి 26 ను ,"స్వతంత్ర దినం"గా వ్యవహరించగా, దేశ స్వాతంత్ర్య దినం బ్రిటిషర్లు నిర్ణయించినది కావడం వల్ల, నెహ్రూ తదితర జాతీయోద్యమ అగ్రనేతలు జనవరి 26 ను దేశ గణతంత్ర దినంగా చేశారు. రాజ్యాంగ మౌలిక లక్ష్యం... సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అందరరికీ అంచించడం. ఈ లక్ష్యము ప్రజల హక్కులకు రూపాన్ని ఇచ్చింది. ప్రజాస్వామ్య సంప్రదాయాలను పరిరక్షించేందుకు స్వతంత్ర ప్రతిపత్తి గల, సమర్ధ వంతమైన న్యాయాన్ని ఇవ్వగల వ్యవస్థ రూప కల్పనే రాజ్యాంగం. రాజ్యాంగ అమలు ద్వారా పౌర హక్కుల అవగాహనను వివిధ దశల్లో విస్తృత పరిచారు. ప్రాథమిక హక్కులకు పెద్దపీట వేశారు. ప్రభుత్వాలు చట్టాలు ప్రజా వ్యతిరేకముగా ఉన్నా రాజ్యాంగాన్ని అతిక్రమించేవిగా ఉన్నా అవి చెల్లవని చెప్పే అధికారము రాజ్యాంగ ధర్మాసనాలకు ఉన్నది .. సుప్రీం కోర్టు ఇచ్చే తీర్పులకు కూడా చట్ట హోదా ఉంటుంది. ఒక్క అమాయకుడికి కూడా అన్యాయము జరగ కూడదన్న సూత్రము న్యాయ వ్యవస్థకు పునాది. భాదితుల హ?క్కుల?ను కాపాడ?టం. తీవ్ర?మైన నేరాల?ను నివారించ?డం, శాంతి, భ?ద్ర?త?ల?కు భంగం వాటిల్ల?కుండా చేయ?డానికి ప్రతి ఒక్కరి భాగస్వామ్య యుత కృషి జరగాలి. అప్పుడే రాజ్యాంగ లక్ష్యం, న్యాయ పరిరక్షణ సాకారం కాగలుగుతాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్ - 9440595494**

# అంతర్జాతీయ విద్యా దినోత్సవం - విశ్వవ్యాప్త విద్యకు ఊతం - జనవరి 24....అంతర్జాతీయ విద్యా దినోత్సవం




ప్రతి సంవత్సరం జనవరి 24న జరుపుకునే అంతర్జాతీయ విద్యా దినోత్సవం విద్య యొక్క ప్రాముఖ్యతను గుర్తించేందుకు, ప్రపంచానికి చైతన్యం తీసుకొచ్చేందుకు ప్రత్యేకమైన రోజు. ఈ దినోత్సవాన్ని 2018 డిసెంబరు 3న ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ నిర్ణయించింది. ప్రజల శ్రేయస్సు, సమానత్వం, శాంతి, అభివృద్ధి వంటి మానవతా విలువల సాధనకు విద్య ముఖ్యమైన సాధనంగా నిలుస్తుందని ఈ దినోత్సవం చాటిచెబుతుంది. విద్య అంటే కేవలం పుస్తకాలు చదవడం లేదా పట్టాలు పొందడమే కాదు. ఇది వ్యక్తి జీవితానికి విలువలను, సామాజిక బాధ్యతలను, విజ్ఞానాన్ని అందించే సాధనం. విద్య వ్యక్తి వ్యక్తిత్వాన్ని మెరుగుపరచి సమాజంలో సాంకేతికత, ఆర్థిక, మరియు సామాజిక రంగాలలో దోహదం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. విద్యా లేమి పేదరికానికి కారణమైతే, విద్య అనేది దాని పరిష్కారానికి ప్రధాన మార్గం. లింగ వివక్ష లేకుండా బాలురు, బాలికలందరికీ సమాన విద్యా అవకాశాలు కల్పిస్తుంది. గౌరవం, సహనం, సహకారం వంటి విలువలను బోధించడంతో, అది శాంతియుత సమాజాల నిర్మాణానికి తోడ్పడుతుంది. అంతర్జాతీయ విద్యా దినోత్సవం పలు ప్రధాన లక్ష్యాలను ముందుకు తీసుకెళ్తుంది: పిల్లలు, యువతలు, పెద్దవారికి కూడా సమాన విద్యావకాశాలను కల్పించడం. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి విద్యను నాణ్యంగా మార్చడం. చిన్న వయస్సు నుంచే బాలికలకు కూడా సమాన విద్యను అందించేందుకు శ్రద్ధ చూపడం. విద్యా వ్యవస్థలను మెరుగుపరచి సమాజానికి సేవ చేయడంలో వాటి సామర్థ్యాన్ని పెంచడం. యునెస్కో నివేదికలు సూచించినట్లుగా, ఇంకా 244 మిలియన్ల మంది పిల్లలు, యువత ప్రాథమిక విద్యకు దూరంగా ఉన్నారు. ముఖ్యంగా పేద దేశాల్లో బాలికలు విద్యకు దూరమవుతున్నారు. పేదరికం, నిరుద్యోగం, మరియు సామాజిక అసమానతలు విద్య లేకపోవడం వల్ల మరింత పెరుగుతున్నాయి. అంతర్జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా అనేక సంస్థలు, పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు విశేష కార్యకలాపాలు నిర్వహిస్తాయి. విద్యకు సంబంధించిన సమస్యలపై మరియు పరిష్కార మార్గాలపై చర్చించ బడుతుంది. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా వారి ప్రతిభను ప్రదర్శిస్తారు. పేద పిల్లలకు విద్యా సామగ్రి పంపిణీ చేయడం, వారి కోసం శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుంది. విద్యా హక్కు గురించి ప్రజలలో అవగాహన పెంచే కార్యక్రమాలు నిర్వహిస్తారు. 2030 దిశగా లక్ష్యాలు :అందరికీ నాణ్యమైన విద్యను అందించడం. పేదరికం మరియు లింగ అసమానతలను తగ్గించడం. సాంకేతికత ద్వారా విద్య: ఇ-లెర్నింగ్ మరియు ఆన్?లైన్ విద్యా విధానాలను ప్రోత్సహించడం. విద్యా పునాదులను బలపరచడం ద్వారా సామాజిక సమస్యలను పరిష్కరించడం. అంతర్జాతీయ విద్యా దినోత్సవం విద్యకు ఉన్న విశేషమైన ప్రాముఖ్యతను గుర్తు చేస్తుంది. ఈ దినం మనకు ఒక గుర్తు - ప్రతి ఒక్కరికీ విద్య అందించే కర్తవ్యాన్ని గుర్తించడం. విద్య అనేది కేవలం వ్యక్తిగత అభివృద్ధికి మాత్రమే కాకుండా ప్రపంచ శ్రేయస్సుకు మార్గదర్శిగా నిలుస్తుంది. "విద్య అంధకారాన్ని తొలగించే దీపం, జ్ఞానాన్ని వెలిగించే కాంతి." అందుకే, ప్రతి ఒక్కరం విద్యకు ప్రాధాన్యం ఇచ్చి, ఆ వెలుగును ప్రపంచమంతా విస్తరించాలనే దిశగా ముందుకు సాగుదాం. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్ - 9440595494**

# అక్షరాల నిర్లక్ష్యం.. దక్కని వ్యవసాయం

ఖమ్మం: జిల్లాలో రుణాల జారీ విషయంలో బ్యాంకర్లు ప్రాధాన్య రంగాలను విస్మరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటి వరకు 57.88 శాతం లక్ష్యం చేరారు. విద్యార్థుల ఉన్నత చదువులు, వ్యవసాయ మౌలిక వసతుల కల్పనకు కేటాయించిన రుణాల్లో పావలా వంతూ ఇవ్వకపోవడం ఆందోళన కలిగిస్తోంది. మిగిలిన రంగాల్లో ముందంజలో ఉంటూ.. కీలక రంగాలను వదిలేయడం విచారకరం. ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు అంటే సుమారు 70 రోజుల్లో అన్ని రంగాల్లో లక్ష్యం చేరడం కష్టమేనని తెలుస్తోంది.

**ప్రాధాన్య రంగాలు.. లక్ష్యాలు**

జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొత్తం రూ.12,204.95 కోట్ల రుణాలు ఇవ్వాలని 31 బ్యాంకులకు లక్ష్యం నిర్దేశించారు. గత నెలాఖరులో అదనపు కలెక్టర్? శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన రెండో త్రైమాసిక సమీక్ష సమావేశం వరకు రూ.7,064.07 కోట్లు మాత్రమే ఇచ్చారు. ప్రాధాన్య రంగాల్లో పెద్దగా పురోగతి లేదు.

వ్యవసాయ ఆధారిత రుణాలు సగం వరకే పంపిణీ చేశారు. ఇందులో ఇన్?ఫ్రా రుణాలు 19 శాతమే ఉన్నాయి. వీటి వినియోగంపై అవగాహన లేక రైతులు లబ్ధి పొందటం లేదు.

విద్యారుణాలు రూ.97కోట్లు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశిస్తే..14 శాతమే పంపిణీ చేయటం విచారకరం. విద్యారుణం కోసం నేరుగా పీఎం విద్యాలక్ష్మి పోర్టర్?లో దరఖాస్తు చేసుకోవాలి. వాటిని బ్యాంకర్లు పరిశీలించి మంజూరు చేస్తారు. ఎన్ని అర్జీలు వచ్చాయి..ఎంతమందికి ఇచ్చారో సమాచారం లేదంటూ అదనపు కలెక్టర్? సమీక్షలో అధికారులు చేతులెత్తేయటం గమనార్హం. అమెరికాలో నెలకొన్న పరిస్థితుల వల్ల ఆ దేశం వెళ్లేవారు తగ్గారని, వీసాలు సకాలంలో దొరక్క లక్ష్యాన్ని చేరలేకపోయామని బ్యాంకర్లు చెబుతున్నారు. విద్యార్థులు, యువతకు అవగాహన కల్పిస్తే ప్రతిఫలం ఉంటుంది.

గృహ రుణాల్లో మాత్రం పురోగతి కనిపిస్తోంది. ఇళ్లు లేదా స్థలం తనఖా పెట్టుకోవడం, క్రెడిట్? స్కోర్, వేతనం ఆధారంగా ఈ రుణాలు ఇవ్వడానికి బ్యాంకర్లు ఆసక్తి చూపుతున్నారు. ఫలితంగా 153 శాతం ఇవ్వగలిగారు.

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించటానికి రూ.3వేల కోట్లు కేటాయించగా.. సగం పంపిణీ చేశారు. వివిధ కారణాలతో కొర్రీలు పెడుతూ దరఖాస్తులు తిరస్కరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఇతర రంగాల్లో 123 శాతం రుణాలు ఇవ్వటం, ప్రాధాన్య రంగాలను విస్మరించటం అధికారుల పర్యవేక్షణ లేమిని ఎత్తిచూపుతోంది.వచ్చే త్రైమాసిక సమావేశంలోపు ప్రాధాన్య రంగాల్లో నిర్దేశిత లక్ష్యాన్ని బ్యాంకర్లు చేరేలా చర్యలు తీసుకుంటామని లీడ్? బ్యాంక్? మేనేజర్ రవిప్రసాద్‌కు తెలిపారు.

# సొసైటీ సొమ్ము.. పోతేపోనీ లెమ్ము!

మెదక్: అన్నదాతలకు అండగా నిలిచే సహకార సంఘాల్లో అక్రమాలు జరుగుతున్నాయి. దీర్ఘకాలిక రుణాల పంపిణీ, ఎరువుల సరఫరా, ఇతర వ్యవహారాల్లో గుట్టుగా సాగిపోతోంది. నిజాలు నిగ్గుతేల్చి అక్రమార్కుల నుంచి సొమ్ము వసూలు చేయాల్సిన యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తోంది. విచారణ పేరిట ఏళ్లుగా కాలయాపన చేస్తూ, వారికే సహకరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

మెదక్? జిల్లా రామాయంపేట మండలం కోనాపూర్? సొసైటీలో అక్రమాలు జరిగాయని 2024 డిసెంబరులో నిర్ధారణ జరగగా ఇటీవల కార్యదర్శిని సస్పెండ్? చేశారు. సొమ్ము రికవరీ అతీగతీ లేదు. ఉమ్మడి జిల్లాలోని పలు సంఘాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

**వెలుగులోకి ఇలా..**

మెదక్? జిల్లాలోని ఆరు సంఘాల్లో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. రేగోడ్, మడూరు సంఘాల్లో విచారణ జరుగుతున్నా ఇప్పటికీ కొలిక్కి రాలేదు.

సిద్దిపేట జిల్లా నంగునూరు, దుబ్బాక సంఘాల్లోనూ ఇదే పరిస్థితి. దుబ్బాకలో సీఈఓను సస్పెండ్? చేసి మమ అనిపించారు.

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని పలు సంఘాల్లో భారీగా నిధులు దుర్వినియోగం అయినట్లు తేలింది. అయినా ఇంతవరకు చర్యలు శూన్యం.

చేతివాటం చూపుతూ..

రైతులకు చేయూత ఇవ్వాల్సిన సంఘాల్లో సిబ్బందితో పాటు పాలకవర్గాల సభ్యులు అక్రమాలకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులున్నాయి. సంఘాల ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరిట భారీగా దోపిడీకి పాల్పడుతున్నారనే విమర్శలున్నాయి. అక్రమార్కులపై ఉక్కుపాదం మోపకుంటే మరింత అవినీతి పెరిగి సహకార సంఘాలు కుదేలు కానున్నాయి.

నోటీసులతోనే సరి..

సంఘంలో అక్రమాలు జరిగితే ఆ నిధులను ఆరునెలల్లో రికవరీ చేయాలన్నది నిబంధన. ఉమ్మడి జిల్లాలో నోటీసులతోనే సరిపెడుతున్నారు. రామాయంపేట మండలం కోనాపూర్?లో రూ.1.05 కోట్లు దుర్వినియోగం జరిగిందని తేలింది. దుబ్బాకలో 2022లోనే రూ.40 లక్షల నిధులు స్వాహా చేసి నాలుగేళ్లు గడుస్తున్నా రికవరీ చేయలేదు. మెదక్? జిల్లా టేక్మాల్? సంఘంలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టలేదు.

| జిల్లా | సంఘాలు | సభ్యులు |
|---|---|---|
| సంగారెడ్డి | 53 | 2,13,507 |
| సిద్దిపేట | 21 | 1,21,180 |
| మెదక్? | 37 | 98,925 |

# నాలుగు పురాలు ఆమెకే..

మెదక్? అన్ని రంగాల్లో మహిళలకు అగ్రతాంబూలం ఇస్తున్నారు. ఇదే క్రమంలో రాజకీయాల్లో వారి ఆధిపత్యం పెరుగుతోంది. ఉన్నత విద్య అభ్యసించి, ప్రజలకు సేవ చేయాలనే తలంపుతో కొందరు, వారసత్వంగా మరికొందరు ముందుకు వస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు సై అంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్లు వారికే కేటాయించడంతో వారి ప్రాతినిధ్యం పెరిగింది. ప్రస్తుత పుర పోరులోనూ వీరి ఆధిపత్యం స్పష్టంగా కనిపించనుంది.

అధ్యక్ష స్థానాలతో పాటు..జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలైన మెదక్, నర్సాపూర్, తూప్రాన్, రామాయంపేట అధ్యక్ష స్థానాలు అతివలకే రిజర్వ్? కావడం గమనార్హం. వార్డు స్థానాల్లో 50 శాతం వారికే కేటాయించారు. నాలుగు పట్టణాల్లోని 75 వార్డుల్లో 37 చోట్ల అతివలే పోటీ చేయనున్నారు. మరోవైపు అన్?రిజర్వ్?తో పాటు ఆయా సామాజిక వర్గాలకు కేటాయించిన జనరల్? స్థానాల్లో పోటీ చేసే అవకాశం లేకపోలేదు.

ఇప్పటికే సిద్ధం..వార్డుల నుంచి అత్యధిక మంది మహిళలు పోటీకి సిద్ధమయ్యారు. మెదక్? ఛైర్?పర్సన్? స్థానం బీసీ మహిళకు, మిగిలిన మూడు మున్సిపాలిటీల అధ్యక్ష స్థానాలు జనరల్? మహిళకు కేటాయించిన విషయం విదితమే. దీంతో ఆయా రాజకీయ పార్టీల్లో తీవ్ర పోటీ నెలకొననుంది. జిల్లా కేంద్రం మెదక్?లో 25 ఏళ్ల అనంతరం అధ్యక్ష స్థానం మహిళలకు దక్కనుంది. 2000లో ప్రత్యక్షంగా నిర్వహించిన ఎన్నికల్లో ఛైర్మన్ స్థానం జనరల్ మహిళకు రిజర్వ్ చేయగా, తిరిగి ఈ సారి బీసీ మహిళకు కేటాయించారు.

# యాసంగి సాగు ఎలాగండి?



చందుర్తి : యాసంగి సీజన్‌లో భాగంగా వరి నాట్లు దాదాపు పూర్తి కావొచ్చాయి. చందుర్తి మండలంలో ఎక్కువ శాతం రైతులు వరిపై ఆధారపడి ఉన్నారు. మండలంలో కొన్ని చెరువులు ఇప్పటికే ఎండిపోయాయి. పరిస్థితి ఇప్పుడే ఇలా ఉంటే ముందు ఎలా ఉంటుందో అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

**విన్నవించినా ఫలితం సున్నా!**

చందుర్తి మండలం తిమ్మాపూర్, రామన్నపేట, నర్సింగాపూర్, ఆశిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో రైతులు సాగు నీటికి ఏటా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చందుర్తి రిజర్వాయర్ ఎడమ కాలువ ద్వారా అటవీని ఆనుకొని రామన్నపేట మీదుగా తిమ్మాపూర్? శివారులోని కొత్త చెరువు వరకు కాలువ ప్రతిపాదనలు ఉన్నాయి. కాలువ తవ్వకానికి భూసేకరణ జరగక పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. కొన్నేళ్లుగా రైతులను ఒప్పించి కచ్చ కాలువలను తవ్వించి తిమ్మాపూర్? కొత్త చెరువును నింపారు కానీ.. రామన్నపేట వద్ద కాలువకు పలుచోట్ల గండ్లు పడ్డాయి. మరమ్మతు చేసి చెరువులు నింపాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

**ప్రభుత్వ విప్ హామీ..**

జోగాపూర్‌పంపుహౌస్‌నుంచి వెళ్లే ప్రధాన కాలువకు లిఫ్ట్? ఏర్పాటు చేసి అక్కడి నుంచి తిమ్మాపూర్, ఆశిరెడ్డిపల్లి శివారులోని కొత్త చెరువును నింపాలనేది రైతుల ప్రతిపాదన. ఈ చెరువు నిండితే చుట్టూ నాలుగు గ్రామాల రైతులకు మేలు జరుగుతుంది. కొత్త చెరువు నింపేందుకు అధికారులతో ప్రణాళికలు చేసి శాశ్వత పరిష్కారం చూపుతానని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్? హామీ ఇచ్చారు. ఈ పనులు పూర్తయితే సాగుకు సమస్య ఉండదు.

**నిర్వహణ కరవై..**

ఎత్తిపోతల పథకంలో పంపుహౌస్‌ల నిర్మాణంతో పాటు మేజర్, మైనర్ కాలువల నిర్మాణానికి ఒప్పందం ఉండగా, భూసేకరణ, పరిహారం పంపిణీలో జాప్యంతో చందుర్తి, రుద్రంగి మండలాల్లో కాలువల పనులు అసంపూర్తిగా వదిలేశారు. అసంపూర్తి పనులు ఒకవైపు.. నిర్వహణ లేక మరోవైపు తూములు, డ్రాపులు మట్టితో కూరుకుపోయాయి. పూడిక, చెట్ల తొలగింపు లేక కాలువలు అధ్వానంగా మారాయి.

ప్రతిపాదనలు పంపాం - మయూరి, ఏఈఈ

కాలువల నిర్వహణను గుత్తేదారు మధ్యలోనే వదిలేయడాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఎల్లంపల్లి కాలువల మరమ్మతుకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైతే పనులు చేయిస్తాం.

# వన దేవతల దర్శనానికి దారులివిగో..



కొత్తగూడెం : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో సమ్మక్క, సారలమ్మ జాతర ఈనెల 28 నుంచి 31 వరకు జరగనుంది. ఖమ్మం, ఇల్లెందు, కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, భద్రాచలం, బూర్గంపాడు, సారపాక, సింగరేణి కార్మిక ప్రాంతాల నుంచి ఎక్కువ మంది జాతరకు హాజరవుతారు. ఉభయ జిల్లాల నుంచి లక్షలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారు. వన దేవతల క్షేత్రానికి వెళ్లే రోడ్లను మెరుగుపరిచేందుకు ఆర్అండ్‌బీ అధికారులు ఉపక్రమించారు. గుంతలమయంగా మారిన రహదారులకు మరమ్మతులు చేపడుతున్నారు.

**మేడారం చేరుకునేందుకు ఖమ్మం జిల్లా వాసులకు రెండు మార్గాలు**

1. ఖమ్మం-మహబూబాబాద్-నర్సంపేట-పస్రా మీదుగా సుమారు 200-250కి.మీ. ప్రయాణించి మేడారం చేరుకోవచ్చు. ఈ మార్గం గుండా రోడ్లు విశాలంగా ఉన్నాయి. ముఖ్యంగా ఆర్టీసీ బస్సుల ద్వారా మేడారం వెళ్లేవారు ఈ మార్గాన్ని ఎంచుకోవటం ఉత్తమం.
2. ఖమ్మం, వైరా నియోజకవర్గాల ప్రజలు ఇల్లెందు-గుండాల-కన్నాయిగూడెం-పస్రా మీదుగా సుమారు 180-200కి.మీ. ప్రయాణంతో మేడారం చేరుకోవచ్చు. ఇది అత్యంత దగ్గరే అయినా అటవీమార్గం. ప్రయాణ వసతులు తక్కువగా ఉంటాయి.

సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలు కొత్తగూడెం మీదుగా, మధిర నియోజకవర్గం వాసులు ఖమ్మం మీదుగా ఇల్లెందు చేరుకుని ఇదే మార్గంలో మేడారం వెళ్లొచ్చు.

ద్విచక్రవాహనాలు, కార్లలో ప్రయాణించేవారికి ఈ మార్గం అనువైనది. ఆర్టీసీ ప్రయాణికులకు తగినన్ని సర్వీసులు అందుబాటులో ఉండకపోవచ్చు.

భద్రాద్రి జిల్లా వాసులకు..


కొత్తగూడెం పరిసర ప్రాంతాలకు చెందినవారు అనిశెట్టిపల్లి-ఆళ్లపల్లి-గుండాల-పస్రా మీదుగా మేడారం వెళ్లేందుకు ప్రత్యామ్నాయ మార్గం ఉంది. ఈ రహదారి గుండా ఆర్టీసీ బస్సులు నడవవు. ప్రైవేటు వాహనదారులు వెళ్లవచ్చు.

మణుగూరు పరిసర ప్రాంతాల వారికి ఏటూరునాగారం-తాడ్వాయి మార్గం అత్యంత దగ్గరగా ఉంటుంది. ఇదికాకుండా ఏడూళ్లబయ్యారం, కరకగూడెం మీదుగా ప్రత్యామ్నాయ మార్గం ఉన్నా.. ఇరుకు రోడ్ల కారణంగా ప్రైవేటు, ద్విచక్రవాహనదారులు ఎక్కువగా వెళ్తుంటారు. అశ్వారావుపేట నియోజకవర్గం ప్రజలు కుక్కునూరు-భద్రాచలం-మంగపేట-ఏటూరునాగారం -తాడ్వాయి మీదుగా మేడారం చేరుకోవచ్చు. ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటాయి. ప్రత్యామ్నాయ మార్గమైన అశ్వారావుపేట-దమ్మపేట-ములకలపల్లి-పాల్వంచ-భద్రాచలం మీదుగా బస్సులు తక్కువగా నడుస్తాయి. పైగా దూరభారం ఎక్కువవుతుంది.

కొత్తగూడెం, భద్రాచలం నియోజకవర్గాల ప్రజలు మణుగూరు-మంగపేట-ఏటూరునాగారం-తాడ్వాయి మీదుగా 130-150కి.మీ. ప్రయాణించి మేడారం చేరుకోవచ్చు. జాతర సమయంలో కొత్తగూడెం, భద్రాచలం డిపోల నుంచి మేడారానికి ప్రత్యేక బస్సులు నడుపుతారు. పాల్వంచ, మణుగూరు వంటి ప్రధాన కేంద్రాల నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయి.

ఇల్లెందు నియోజకవర్గ ప్రజలకు గుండాల-కన్నాయిగూడెం-పస్రా మీదుగా మేడారం 120-130కి.మీ. దూరం వస్తుంది.

# గగనయానానికి భూ గ్రహణం



కొత్తగూడెం : రాష్ట్రంలో పారిశ్రామికంగా, ఆధ్యాత్మికంగా ప్రాధాన్యం కలిగిన జిల్లాల్లో భద్రాద్రి కొత్తగూడెం ఒకటి. ఇక్కడ బొగ్గు గనులు, పరిశ్రమలు ఉన్నాయి. భద్రాచలం రామయ్యను దర్శించుకోవటానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం విమానాశ్రయం కావాలనేది దశాబ్దాల కల. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం ఇక్కడ ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి సుముఖంగా ఉన్నప్పటికీ అనేక అవరోధాలతో అడుగు ముందుకు పడటం లేదు.

**పట్టాలెక్కని ప్రతిపాదనలు**

నిధులున్నా.. విమానాశ్రయ నిర్మాణానికి అనువైన స్థలం దొరక్కపోవటం సమస్యగా మారింది. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం విమానాశ్రయ నిర్మాణానికి కావాల్సిన భూములు భద్రాద్రి జిల్లాలో లభ్యమవటం లేదు. లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల, బంగారుచెలక.. చుంచుపల్లి-సుజాతనగర్, కొత్తగూడెం మండలాల్లో గుర్తించిన భూములను కేంద్ర బృందాలు పరిశీలించాయి. రెండుచోట్ల రన్?వే నిర్మాణానికి అవసరమైన సాంకేతిక ప్రమాణాలు లేవని తేల్చిచెప్పటంతో ఆ ప్రతిపాదనలు పట్టాలెక్కలేదు.

**అలైన్‌మెంట్‌ను మార్చితే..**

చుంచుపల్లి, సుజాతనగర్, కొత్తగూడెం మండలాల్లో గుర్తించిన 954 ఎకరాల భూముల్లో కొండలు, గాలివీచే దిశ విమానాశ్రయ నిర్మాణానికి అనువుగా లేవని కేంద్రబృందాలు స్పష్టం చేశాయి. కానీ అలైన్‌మెంట్‌ను మార్చటం ద్వారా ఈ ప్రాంతంలో విమానాశ్రయ నిర్మాణానికి అవకాశాలేమైనా మెరుగుపడతాయేమోనని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. భద్రాద్రి జిల్లాలో మరెక్కడా అనువైన స్థలాలు దొరక్కపోవటంతో ఇదే ప్రత్యామ్నాయ మార్గమని అంచనా వేస్తున్నారు.

ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి అనుకూలమైన భూముల కోసం అధికారులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యాప్తంగా జల్లెడ పడుతున్నా.. ఫలితం లేకుండా పోతోంది. ఇటీవల దుమ్ముగూడెం, టేకులపల్లి మండలాల్లో అధికారులు పర్యటించారు. కొండలు, గుట్టలు, ఇతర భౌగోళిక పరిస్థితులు విమానాశ్రయం నిర్మాణానికి అనువుగా లేకపోవటంతో కథ మళ్లీ మొదటికొచ్చింది.

ఇవే ప్రధాన సమస్యలు..

భద్రాద్రి జిల్లా.. గోదావరి పరీవాహక ప్రాంతంలో ఉండటంతో వరదలు సంభవించే ప్రదేశాల్లో విమానాశ్రయం నిర్మించేందుకు అవకాశం లేకుండా పోతోంది.

భద్రాద్రి జిల్లాలో మెజారిటీ భూభాగం రిజర్వ్? ఫారెస్ట్? కావటం వల్ల పెద్దమొత్తంలో భూములను సేకరించటం ప్రభుత్వానికి సవాలుగా మారుతోంది.

సింగరేణి గనులు సైతం విమానాశ్రయ ఏర్పాటుకు అవరోధంగా మారుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

కొండలు, గుట్టలు, వాతావరణ పరిస్థితులు, గాలివేగం వంటి అంశాలు ప్రతికూలంగా మారుతున్నాయి.

# ఆందోళన వీడు.. అప్రమత్తంగా మెలుగు

మెదక్ : వాతావరణంలో అసమతుల్యత.. చిన్నారుల్లో అనారోగ్య సమస్యలకు కారణమవుతోంది. వణికించే చలి అస్వస్థతకు గురి చేస్తోంది. జలుబు, దగ్గు, జ్వరం, ఆయాసం వంటి లక్షణాలతో సతమతం అవుతున్నారు. వారం రోజులుగా ఉమ్మడి మెదక్, వికారాబాద్? జిల్లాల్లోని పలు ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. 100లో 70 శాతం మేర జలుబు, దగ్గు, అనారోగ్య లక్షణాలతో ఆశ్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని మెదక్?కు చెందిన చిన్నపిల్లల వైద్యుడు డా. విజయ్‌కుమార్ సూచిస్తున్నారు. ఆయన సూచనలు ఇలా..ఆస్తమా..ఇదో రకమైన అలర్జీ. వాతావరణంలో మార్పు, కాలుష్యం, ఆహార అలవాట్లు ప్రభావం చూపుతాయి. రోగనిరోధకశక్తి తక్కువగా ఉన్న వారిపై ఎక్కువగా ప్రభావం పడుతుంది. 15 ఏళ్లలోపు వారు మిఠాయిలు, చాక్లెట్లు, పానీయాలకు దూరంగా ఉండాలి.

ఆరుబయట చలికి తిరగొద్దు. ఒకవేళ వెళ్లాల్సి వస్తే.. మాస్కు, ఉన్ని దుస్తులు ధరించాలి. ప్రాణాయామం, ధ్యానం వంటివి చేయాలి. శ్వాసకోశ సమస్యలతో బాధపడే వారు వైద్యుల సూచనలతో నెబ్యులైజర్? లేదా ఇన్‌హైలర్ వాడాలి.

**వాంతులు, విరేచనాలు..**

అపరిశుభ్ర వాతావరణంలో ఆహారం తీసుకోవడం, రోగ నిరోధకశక్తి తక్కువగా ఉండటంతో పలువురు వాంతులు, విరేచనాల బారినపడు



తున్నారు. పిల్లలు అధికంగా ఉంటున్నారు.

పిండి వంటలు తినే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి.

సాధారణ పరిస్థితుల్లో డబ్ల్యూహెచ్‌వో ఓఆర్ఎస్? తీసుకోవాలి. అందుబాటులో లేకపోతే నిమ్మరసం లేదంటే మజ్జిగలో ఉప్పు, చక్కెర వేసి మిశ్రమంగా తాగించాలి. తద్వారా డీహైడ్రేషన్? నుంచి కాపాడవచ్చు. జాగ్రత్తలు పాటిద్దాం..

మాస్కుధారణ, చేతుల శుభ్రత మరువొద్దు. తాజా ఆహారం, గోరువెచ్చని నీళ్లు తీసుకోవాలి.

ఇంట్లో ఒకరికి మించి పిల్లలు ఉంటే అనారోగ్య లక్షణాలు కలిగిన వారి నుంచి దూరాన్ని పాటించాలి. ః ఆరుబయట ఆహారం, జాతర జరిగే ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలి. జలుబుతో బాధపడిన వ్యక్తి ఐదేళ్లు దాటితే ఆవిరిపట్టాలి.

# కొనేచోట తళతళ.. ఇంటికొచ్చాక వెలవెల

నిర్మల్ : మీరెప్పుడైనా గమనించారా, మన కళ్లముందే అర్థం కాని మతలబు ఏదో చోటుచేసుకుంటోందని! మనల్ని విస్తుపోయేలా చేస్తోందని! అదేంటనుకుంటున్నారా.. కొనే సమయంలో ఎంతో నాణ్యతతో కనిపించే పండ్లు, కాయగూరల్లో చాలావరకు మనం ఇంటికి తీసుకెళ్లిన తర్వాత తక్కువ వ్యవధిలోనే పాడైపోతున్నాయి. కారణం తెలియక మనకు మనమే ఏదో సర్ది చెప్పుకొంటుంటాం. ఇది చాలామందికి ఎదురవుతున్న పరిస్థితి.

**రసాయనాలే కారణమా..**

పల్లె, పట్నం తేడాలేకుండా చాలాచోట్ల వీటి అమ్మకాలు పెరిగిపోయాయి. ఆటోలు, తోపుడుబండ్లపై చాలామంది వివిధ రకాల పండ్లను విక్రయిస్తున్నారు. ఇంకొందరు తాజా తాజా అంటూ ఆకుకూరలు, కాయగూరలను కుప్పలుగా పోసి అమ్ముతున్నారు. చూడగానే.. మనమూ బాగున్నాయనుకుంటాం. ఆరోగ్యానికి సంబంధించిన అంశం కదా అని ధరకు వెనుకాడకుండా కొనుగోలు చేసి తీసుకెళ్తాం. తీరా తీసుకెళ్లాక.. 24 గంటలు కూడా గడవకముందే అవి నాణ్యతను కోల్పోవడం గమనిస్తాం. ఫ్రిజ్?లో నిల్వచేసినా, ఇతర రక్షణ చర్యలు తీసుకున్నా.. చాలావరకు ఇదే తరహా పరిస్థితి ఎదురవుతోంది. అదే సమయంలో.. అమ్మకందారుల వద్ద మిగిలినవి మాత్రం అంతే నాణ్యతతో, అదేరకమైన తాజాదనంతో కనిపిస్తున్నాయి.

హైదరాబాద్, ఒంటిమామిడి, కర్నూలు, అనంతపూర్, గుత్తి, చింతామణి

బెంగళూరు మహారాష్ట్ర ప్రాంతంలో నాందేడ్ , పర్భని, జాల్నా, చిన్వాడా, అమరావతి, నాగ్‌పూర్

ఏడాదిలో నాలుగు నెలలు మినహాయిస్తే.. మిగతా 8 నెలల్లో ఈ ప్రాంతాల నుంచే వివిధ రకాల పండ్లు, కూరగాయలు దిగుమతి అవుతుంటాయి.

కాయగూరలు, పండ్లు దిగుమతయ్యే ప్రదేశాలను పరిశీలిస్తే..

కొంతమంది విక్రేతలు ప్రత్యేక రసాయనాలను ఉపయోగిస్తుండటం ఇందుకు కారణమని తెలుస్తోంది. నీళ్లు చల్లే డబ్బాలు, సీసాల్లో వీటిని కలిపి అప్పుడప్పుడూ కాయగూరలు, పండ్లపై చల్లుతుంటారు. చూసేవారికి ఎలాంటి అనుమానం రాదు. ఈ కారణంగానే అవి తాజాగా కనిపిస్తుంటాయి. మనం కొనుగోలు చేసి తీసుకెళ్లాక.. ఇంటివద్ద అలాంటివేవీ చల్లకపోవడంతో అవి వాడిపోవడమో, ఆరిపోవడమో జరుగుతోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు వ్యాపారులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజారోగ్యం దెబ్బతింటుందనే ఆలోచనను విస్మరిస్తుండటం గమనార్హం.

ఉమ్మడి జిల్లా పరిధిలో దాదాపు 30,700 ఎకరాల్లో వివిధ రకాల కాయగూరలు, పండ్లు సాగు చేస్తున్నారు.

నిత్యం ఉమ్మడి ఆదిలాబాద్ వ్యాప్తంగా సుమారు రూ. 1.90 కోట్ల మేర కూరగాయలు, పండ్ల వ్యాపారం జరుగుతోందని అంచనా. పండగలు, ఇతరత్రా వేడుకల సమయంలో ఇది రూ. 2 కోట్లకు పైగా చేరుతుంది.

కొంతమంది కూరగాయలకు క్లోరిన్, హైడ్రోజన్? పెరాక్సైడ్, ఆకుకూరలకు మలాకైట్? గ్రీన్, పండ్లకు కాల్షియం కార్బైడ్? వంటి రసాయనాలను వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇవి తాజాగా కనిపించేందుకు, పండ్లు త్వరగా పక్వానికి వచ్చేందుకు దోహదపడతాయి. వీటి వినియోగం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలు ఎక్కువ.బాగా కడిగి ఉపయోగించాలి

మార్కెట్?లో కొనుగోలు చేసే పండ్లు, కూరగాయలు ఏవైనా ఇంటి వద్ద బాగా శుభ్రం చేయాలి. ఆకుకూరలు, ఇతరత్రా వాటిని ఉప్పునీటిలో నాలుగైదు సార్లు కడగడం ఉత్తమం. పంట ఉత్పత్తులు పెరిగేందుకు రసాయనాలు, ఎరువుల వినియోగం బాగా పెరిగిన నేపథ్యంలో.. ఉపయోగించే సమయంలో వినియోగదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. సరిగా శుభ్రం చేయకపోతే సమస్యలు ఎదురవ్వచ్చు.

ఆలియా ఫాతిమా,ఉద్యానవన అధికారి, నిర్మల్

# ఎన్నికల వేళ.. కాసుల కళ

చొప్పదండి : పురపాలక సంఘాల్లోని మహిళా సంఘాలకు గతంలో తీసుకున్న రుణాల వడ్డీ డబ్బులను విడుదల చేస్తూ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఉత్తర్వులు జారీ చేసింది. 2023-24, 2024-25 సంవత్సరాల్లో పట్టణాల్లోని మహిళా సంఘాలు తీసుకున్న రుణాలకు సంబంధించిన ఈ వడ్డీ డబ్బులను తక్షణమే వారి ఖాతాల్లో జమ చేయాలని ఆదేశాలు ఇచ్చింది.

**ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ**

ఇప్పటికే నిధులు విడుదల కావడంతో ప్రజాప్రతినిధులు, అధికారులు పంపిణీ ప్రక్రియ మొదలుపెట్టారు. కరీంనగర్? నగరపాలక సంస్థ మినహా చొప్పదండి, హుజూరాబాద్, జమ్మికుంట పురపాలికలకు సంబంధించిన మహిళా సంఘాలకు ఈ డబ్బులు విడుదల చేశారు. ఈ మూడు పురపాలికల పరిధిలోని 920 సంఘాలకుగాను సుమారు రూ.3.44 కోట్లు విడుదలయ్యాయి. ఎన్నికల పుణ్యమా అని ఈ నిధులు విడుదల కావడంతో మహిళా సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం




చేస్తున్నారు.

**నిరీక్షణకు తెర...** గత రెండేళ్లుగా ఈ డబ్బుల కోసం మహిళా సంఘాల సభ్యులు ఎదురుచూస్తున్నారు. ఎప్పుడొస్తాయని అధికారులను పదేపదే అడిగే వారు. పురపాలక ఎన్నికల నేపథ్యంలో ఈ డబ్బులు విడుదల కావడంతో వాటిని త్వరితగతిన ఆయా సంఘాల సభ్యులకు పంపిణీ చేసేలా అధికారులు సమాయత్తమవుతున్నారు.

# గ్రేటర్ మాత్రమే పునర్విభజన

హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్‌ను బాహ్యవలయ రహదారి హద్దుగా విస్తరించి 3 కార్పొరేషన్లుగా పునర్విభజించనున్న రాష్ట్ర ప్రభుత్వానికి రెవెన్యూ జిల్లాల పునర్విభజన నిబంధనలు ప్రతిబంధకాలుగా నిలుస్తున్నాయి. 3 కార్పొరేషన్లలో ఒక కార్పొరేషన్ ఒక జిల్లాగా రూపకల్పన చేయాలని ఉన్నతాధికారులు యోచించారు. అయితే జనగణన ప్రక్రియను ప్రారంభిస్తున్న కేంద్ర ప్రభుత్వం.. జిల్లాల పునర్విభజనకు 2025 డిసెంబరు 31ను కటాఫ్? తేదీగా నిర్ణయించి అన్ని రాష్ట్రాలకు మార్గదర్శకాలను పంపించింది. గ్రేటర్ పునర్విభజనకు నోటిఫికేషన్ గతేడాది నవంబరులో బల్దియా అధికారులు విడుదల చేశారు. గ్రేటర్ హైదరాబాద్‌ను.. గ్రేటర్ హైదరాబాద్, సైబరాబా ద్, మల్కాజిగిరి కార్పొరేషన్లుగా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

**సరిహద్దులు మార్చకుండానే కొనసాగింపు**




గ్రేటర్ తరహాలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల సరిహద్దులను మార్చకుండానే పరిపాలన కొనసాగించాలని ప్రభుత్వం 3 జిల్లాల కలెక్టర్లకు మౌఖిక ఆదేశాలిచ్చింది. దీంతో రాజేంద్రనగర్? రెవెన్యూ డివిజన్‌లోని శంషాబాద్, రాజేంద్రనగర్ మండలాలు, కందుకూరు మండలంలోని బాలాపూర్ మండలం హైదరాబాద్? జిల్లాలో విలీనం కాలేదు. బేగంపేట, మారేడ్?పల్లి, తిరుమలగిరి మండలాలు మల్కాజిగిరి జిల్లాలో విలీనం కాలేదు. రంగారెడ్డి జిల్లాలోని సరూర్‌నగర్, హయత్‌నగర్ మండలం, ఇబ్రహీంపట్నంలోని ఔటర్ లోపలున్న ఆదిభట్ల, తుర్కయాంజాల్ డివిజన్లు కూడా విలీనం కాలేదు.

# గెలుపు గుర్రాల కోసం వేట

మెదక్: పురపోరును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ప్రధాన రాజకీయ పార్టీలు బలమైన అభ్యర్థులను బరిలోకి దించేందుకు కసరత్తు చేస్తున్నాయి. అంతర్గతంగా ప్రైవేటు ఏజెన్సీలతో సర్వే నిర్వహిస్తూ ఉమ్మడి జిల్లాలోని 19 బల్దియాల్లో ప్రధాన పార్టీలు గెలుపు గుర్రాల వేట మొదలెట్టాయి. వార్డుల వారీగా హస్తం అన్వేషణమెదక్ లోకసభ స్థానం పరిధి మంత్రి వివేక్‌వెంకటస్వామి, జహీరాబాద్ లోక్‌సభ స్థానం పరిధికి మంత్రి అజారుద్దీన్‌ను కాంగ్రెస్ అధిష్ఠానం ఇన్?ఛార్జులుగా నియమించింది. ఆశావహుల నుంచి డీసీసీల ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎంపీ సురేష్‌శెట్కార్‌వర్గాల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం ఖేడ్? బల్దియాను శెట్కార్? వర్గానికి వదిలిపెట్టాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఎమ్మెల్యే వర్గీయులు పోటీకి సై అంటున్నారు.జహీరాబాద్‌లో మూడు వర్గాలుగా విడిపోయి, ఎవరికి వారే తమకే పార్టీ టికెట్? అంటూ ప్రచారం చేసుకుంటున్నారు.

సమావేశాలు నిర్వహిస్తూ భాజపా

ఉమ్మడి జిల్లాలోని అన్ని వార్డుల్లో అభ్యర్థులను బరిలోకి దింపేందుకు భాజపా కసరత్తు చేస్తోంది. మెదక్, సిద్దిపేట జిల్లాలపై దృష్టిసారించి ఎంపీ రఘునందన్?రావు సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో 11 చోట్ల మెజారిటీ వార్డులను కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు గోదావరి ఆశావహుల నుంచి దరఖాస్తులను తీసుకుంటున్నారు. పటాన్?చెరులోని కొన్ని వార్డుల్లో టికెట్? ఆశించే వారి సంఖ్య భారీగా ఉంది.

పట్టున్న అభ్యర్థులకోసం గులాబీ కసరత్తు

భారాసలో మాజీ మంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలో వార్డుల వారీగా నలుగురు ఆశావహులతో జాబితా రూపొందించారు. ఇందులో ప్రజల మద్దతున్న వారిని గుర్తించేందుకు ప్రైవేటు ఏజెన్సీలతో సర్వే చేయిస్తున్నారు. మెదక్, రామాయంపేట, సంగారెడ్డి, సదాశివపేట బల్దియాలపై ప్రత్యేక దృష్టి సారించారు. పటాన్?చెరు నియోజకవర్గంలో అభ్యర్థుల ఎంపికపై సందిగ్ధత నెలకొంది. ఎమ్మెల్యే మహిపాల్?రెడ్డి ఇటీవల భారాస అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

# ఆధునిక విధానం.. ఆదిలోనే గ్రహణం



హైదరాబాద్: నగరం చుట్టూ ఉన్న రూ.వందల కోట్ల భూములను కాపాడుకునేందుకు హెచ్?ఎండీఏ ప్రతిపాదించిన జియోట్యాగ్? ప్రక్రియకు ఆదిలోనే హంసపాదు ఎదురైంది. గతంలో ప్రతిపాదించినప్పటికీ ఈ అత్యాధునిక సాంకేతిక విధానం ముందుకు సాగడం లేదు. నగరం చుట్టూ ఉన్న పలు విలువైన భూములకు గతంలో కంచెలు నిర్మించేందుకు హెచ్?ఎండీఏ సిద్ధమైంది. కొన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు కూడా. ఆక్రమణలు పకడ్బందీగా అడ్డుకునేందుకు జియోట్యాగ్ చేయాలని నిర్ణయించినప్పటికీ పూర్తి కాలేదు. 7 జిల్లాల పరిధిలో వందల ఎకరాల భూములున్నాయి. ఇప్పటికే కొన్నింటిని ఆన్‌లైన్ వేలం ద్వారా ఇదివరకే హెచ్?ఎండీఏ విక్రయించింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి పరిధిలో ఇంకా వేల కోట్ల విలువైన భూములున్నాయి. వీటి రక్షణ విషయంలో పకడ్బందీ చర్యలు లేక ఆక్రమణలపాల వుతున్నాయి. శంషాబాద్, మియాపూర్‌లో ఉన్న భూములే ఇందుకు ఉదాహరణ. గతంలో శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో హెచ్?ఎండీఏకు సంబంధించి 181 ఎకరాల భూముల్లో ఏకంగా 50 ఎకరాలు ఆక్రమించారు. చివరికి సుప్రీంకోర్టు కోర్టుకు వరకు వెళ్లి ఆక్రమణదారులను అడ్డుకున్నారు.

**ప్రతిపాదించిన భూములు ఎకరాల్లో..**

జవహర్‌నగర్.. 1300, ఆరుట్ల (సంగారెడ్డి).. 106, ఇంద్రకరణ్? గ్రామం (సంగారెడ్డి).. 140, కంది గ్రామం (పటాన్?చెరు).. 50, శంకరంపేట్? (సంగారెడ్డి).. 85, చిట్కుల్? (పటాన్?చెరు).. 50, బుధేరా (సంగారెడ్డి).. 90.

**సాంకేతికతతో..** ఈ నేపథ్యంలో ప్రతి భూమికి జియోట్యాగ్? చేయడం వల్ల అక్కడ ఎలాంటి నిర్మాణాలు జరిగినా గూగుల్? ఇమేజ్?లతో ఇట్టే తెలిసిపోతుంది. వెంటనే అధికారులకు నోటిఫికేషన్? ద్వారా సమాచారం అందుతుంది. స్థానిక అధికారులు అప్రమత్తమై అడ్డుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం నిఘా లేక ఎక్కడ ఆక్రమణలు జరిగినా కొన్నిరోజుల వరకు తెలియడం లేదు. వీటిని రక్షించుకోవడం తలకు మించిన భారం అవుతోంది. తగిన ఆధారాలు కోర్టు ముందు ఉంచి స్టే తొలిగించడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. జియోట్యాగ్? వల్ల ఇలాంటి ముప్పు తప్పుతుంది.

# వీటి ధరలు వింటే దడే!



ముత్తారం : ఒకవైపు కూరగాయల ధరలు, మరోవైపు మాంసాహార ధరలు పెరగడంతో మధ్య తరగతి కుటుంబాలు తీవ్ర నిరాశలో ఉన్నాయి. ఆరోగ్యానికి మేలు చేసే గుడ్డు తినలేని పరిస్థితి నెలకొంది. కోడి మాంసం ధర విపరీతంగా పెరిగి సామాన్యుడిని బెంబేలెత్తిస్తున్నాయి.

**60 శాతం పెరిగిన గుడ్డు ధర**

కొద్ది రోజుల కిందటివరకు రిటైల్ మార్కెట్‌లో రూ.5గా ఉన్న కోడిగుడ్డు ధర.. ప్రస్తుతం రూ.8కి చేరింది. దీంతో 30 గుడ్ల ట్రే ధర రూ.150 నుంచి రూ.240కి పెరిగింది. ఇది గతంతో పోలిస్తే సుమారు 60 శాతం ధర పెరుగుదల కన్పిస్తోంది. మారుమూల గ్రామాల్లో కొన్నిచోట్ల గుడ్డును రూ.9 లకు విక్రయిస్తున్న పరిస్థితి నెలకొంది.

**కిలో రూ.320**

కోడిగుడ్ల ఉత్పత్తి తగ్గడమే ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని ఫారం నిర్వాహకులు చెబుతున్నారు. చలికాలంలో కోళ్ల ఫారాల్లో గుడ్ల ఉత్పత్తి సాధారణంగా తగ్గుతుంది. ఈసారి మాత్రం ఉత్పత్తి పడిపోయింది. ఫలితంగా గుడ్లకు డిమాండ్ పెరిగి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. సంక్రాంతి ముగిసి మేడారం శ్రీ సమ్మక్క, సారలమ్మ జాతర సమీపిస్తున్న వేళ కోడిమాంసం ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. ఇప్పటికే చికెన్ ధరలు కిలోకు రూ.320 ఉంది. జాతర నాటికి రూ.350 దాటే అవకాశముందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

**తగ్గిన అమ్మకాలు**

మేక, గొర్రెల ధరలు అధికంగా ఉండటంతో.. మాంసాహారం కోసం కోళ్లపై ఆధారపడే పేద, మధ్యతరగతివారు ఇప్పుడు చికెన్? కొనాలంటేనే ఆందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొంది. కోడిమాంసం, గుడ్డు ధరలు ఆకాశాన్ని అంటడంతో వినియోగదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధరలు పెరగడంతో గుడ్ల అమ్మకాలు గణనీయంగా తగ్గాయని వ్యాపారులు చెబుతున్నారు. గతంలో రోజువారీ కూలీలు విరివిగా గుడ్లు కొనుగోలు చేసేవారని.. ప్రస్తుతం ఇతర ప్రత్యామ్నాయాలను వెతుక్కుంటున్నారని చెబుతున్నారు.

# సెటిల్‌మెంట్లు.. బెదిరింపులు



మొన్నటి వరకు ప్రజాప్రతినిధులకు తమ వంతు సాయం చేస్తూ వచ్చిన కొంతమంది యువకులు ప్రస్తుతం కరీంనగర్?లో 'భాయ్'లుగా చెలామణి అవుతున్నారు. చిన్న చిన్న సెటిల్‌మెంట్లు చేసుకునే స్థాయి నుంచి దాడులు చేసే వరకు ఎదిగారు. కేసులు నమోదు చేసిన పోలీసులతోనే సన్నిహితంగా ఉంటూ పలుకుబడిని ప్రదర్శిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపణలున్నాయి. వారి బలం.. నేతల బలగంతో ఆగడాలు కొనసాగిస్తున్నారు.

**ఒకఒంటరిగా వచ్చి.. జట్టుగా ఏర్పడి..**

కేసులు, అనేక వ్యవహారాల సెటిల్‌మెంట్లను పరిష్కరించి వచ్చే డబ్బులతో జల్సాలు చేస్తూ.. విదేశాల్లో విహార యాత్రలకు వెళ్తున్నారు. లగ్జరీ లైఫ్? కోసం కొత్త కార్లు కొనుగోలు చేస్తూ హుందాతనాన్ని ప్రదర్శిస్తున్నారు. చిన్న కేసులతో మొదలైన చీకటి వ్యవహారం రౌడీషీటర్ల వరకు చేరుతుంది.

ముందు ఒంటరిగా వచ్చి ముఠాగా ఏర్పడి దందాలు కొనసాగిస్తున్నారు.

ఇతర జిల్లాలకు చెందిన కొందరు రౌడీషీటర్లు రియల్? ఎస్టేట్ వ్యాపారం పేరుతో కరీంనగర్‌లో చెలామణి అవుతున్నారు. కేసులైతే స్థానిక పోలీసు అధికారులతో చర్చించి వారికి ముట్టజెప్పిన తర్వాతే వారి కార్యక్రమాలను ప్రారంభిస్తున్నారు. వారు సమస్యలను పరిష్కరిస్తునట్లుగా వీడియోలు తీసి, పది మందికి తెలిసేలా సామాజిక మాధ్యమంలో వదులుతున్నారు.

2023 నుంచి 2025 వరకు మూడేళ్లలో 600 మందిపై పోలీసులు రౌడీషీట్లు తెరిచారు. మూడేళ్లలో మరో 1030 మందిని అనుమానితులుగా గుర్తించారు. కరీంనగర్‌తోపాటు శివారు ప్రాంతాల్లోని భవనాలను అద్దెకు తీసుకొని దందా కొనసాగిస్తున్నారు. కొన్ని ప్రాంతాలను అడ్డాలుగా ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ విషయాలు కొందరు బాధితులు స్థానిక పోలీసుల దృష్టికి వెళ్లినా వారు పట్టనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

**అన్ని వ్యవహారాల్లో తలదూర్చుతూ..**

భూ వ్యవహారాలతోపాటు ఇతర అంశాల్లో తలదూర్చుతున్నారు. ఆ వ్యవహారాలను పరిష్కరించి డబ్బులు దండుకోవడం.. లేదంటే బెదిరింపులకు పాల్పడటం చేస్తున్నారు. కొంతమంది 'భాయ్?'గా చెలామణి అవుతూ ఇదే తమ వృత్తిగా మార్చుకుంటున్నారు. ఆదిలోనే అదుపు చేయకుంటే ప్రమాదకరంగా మారే అవకాశముందని బాధితులు పేర్కొంటున్నారు.

స్థానిక ప్రజాప్రతినిధులకు అండగా ఉంటూ.. వారు చెప్పిన వ్యవహారాలను తెరవెనుక ఉండి నడిపించే కొందరు ఇష్టం వచ్చినట్లు బెదిరింపులకు పాల్పడుతున్నారు. అడ్డు చెప్పే వారిని బెదిరించడం లాంటివి చేస్తున్నారు. చిన్న చిన్న వ్యవహారాల్లో తలదూర్చి కేసులు అయినా సరే 'అన్న' ఉన్నాడనే ధీమాతో ఏమైనా చేయడానికైనా తెగిస్తున్నారు. దాడులకు పాల్పడి కొన్నాళ్లు అజ్ఞాత జీవితం గడిపి.. మళ్లీ రంగంలోకి దిగుతున్నారు.

# జలమండలికి బకాయిల భారం

రాబడి, వ్యయాల మధ్య తీవ్రమైన అంతరంతో సతమతమవుతున్న జలమండలికి మొండి బకాయిలు సమస్యగా మారాయి. అభివృద్ధి పనులకు నిధుల కొరతతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. దీనికి తోడు ఏళ్లయినా వసూలు కాని రూ.కోట్ల బకాయిలు భారంగా మారాయి. బకాయిల వసూళ్లకు జలమండలి చేస్తున్న ప్రయత్నాలు కొలిక్కి రాకపోగా.. అవి అంతకంతకూ పెరుగుతున్నాయి. జలమండలికి రావాల్సిన బకాయిలు రూ.4800 కోట్లకుపైగా ఉండటంతో వీటిని ఎలా రాబట్టుకోవాలని జలమండలి తర్జనభర్జన పడుతోంది. వడ్డీ రాయితీ ఇచ్చి చెల్లింపులకు ప్రత్యేక గడువు ఇచ్చినా నామమాత్రంగా కూడా వసూలు కావడంలేదు. ప్రతినెలా రాబడి, వ్యయం మధ్య రూ.130 కోట్ల దాకా అంతరం ఉండటంతో కొత్తగా అభివృద్ధి పనులకు రుణాలు లేదా ప్రభుత్వంపై ఆధారపడాల్సి వస్తోంది. నీటి సరఫరా లేదా మురుగునీటి వ్యవస్థకు సంబంధించిన అభివృద్ధి పనులకు నిధులకు జలమండలి ఇబ్బంది పడుతోంది. బల్క్? కనెక్షన్లు, కాలనీల నుంచే రూ.1500 కోట్లు బకాయిలు ఉండగా గృహ, వాణిజ్య కనెక్షన్ల నుంచి రూ.1000 కోట్లకు పైగా వసూలు కావాల్సి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల నుంచి భారీగా బకాయిలు వసూలు కావాల్సి ఉంది. ఈ రెండు విభాగాల నుంచి రూ.1800 కోట్లకుపైగా బకాయిలు ఉన్నాయి. వాటిని చెల్లించాలని కేంద్ర, రాష్ట్ర సంస్థలకు లేఖలు రాస్తున్నా ప్రయోజనం ఉండటంలేదని జలమండలి అధికారులు పేర్కొంటున్నారు.

# ఇలా వదిలేస్తే 'పుట్టవా.. కుట్టవా?'

హైదరాబాద్ : గుర్రపుడెక్క.. చెరువంతా ఆక్రమించి దోమలు పెరిగేందుకు కారణమవుతోంది. నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటోంది. జలచరాలు అంతరించిపోయి దోమలు గుడ్లు పెట్టేందుకు అనువైన వాతావరణం ఏర్పడుతోంది. ఫలితంగా దోమలు పెరిగి పరిసర ప్రాంతాల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. కంటి మీద కునుకు ఉండట్లేదు. ఏడాదిగా తొలగించే పనులు బల్దియా చేపట్టకపోవడంతో తటాకాలన్నీ గుర్రపుడెక్కతో నిండిపోయాయి. రూ.100 కోట్లతో సుందరీకరించిన దుర్గంచెరువు కూడా గుర్రపుడెక్కతో నిండిపోయిందంటే నిర్వహణ ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**ఏమిటీ గుర్రపుడెక్క**

గుర్రపుడెక్క నీటిలో తేలియాడే తీగజాతి కలుపు మొక్క. మురుగునీటిలో వేగంగా పెరుగుతుంది. నీటిపై ఆకుపచ్చని తివాచీలా విస్తరిస్తుంది. దోమలు పెరుగుతాయి. ఇంతటి సమస్యాత్మకమైన ఈ కలుపు మొక్కను పలు సంస్థలు సంపదగా మార్చుతున్నాయి. తాళ్లు, బుట్టలు అల్లేందుకు, సేంద్రియ ఎరువు తయారీకి ఉపయోగిస్తుండగా బల్దియా కళ్లప్పగించి చూస్తోంది.



**మొక్కుబడిగా యంత్రాలు**

ఈ గుర్రపుడెక్కను తొలగించేందుకు జీహెచ్?ఎంసీ గతంలో 2 రకాల వ్యూహాలను అమలు చేసేది. 1-5 ఎకరాల్లోపు విస్తీర్ణం, తక్కువ లోతున్న చెరువుల్లో సిబ్బందితో ఆకును తొలగించేది. లోతైన చెరువుల్లో ఫ్లోటింగ్ ట్రాష్ కలెక్టర్లతో (ఎఫ్‌టీసీ) పనులు చేయించేది. ఏడాదిగా పనులు జరగడం లేదు. జోన్?కు 1 చొప్పున అద్దెకు తీసుకున్న 6 ఎఫ్?టీసీల్లో 3 మాత్రమే పనిచేస్తున్నాయి.

**90 శాతం చెరువుల్లో సమస్య**

హైటెక్‌సిటీలోని దుర్గం చెరువు, సికింద్రాబాద్ బోయినపల్లిలోని హస్మత్‌పేట లేక్, కూకట్‌పల్లిలోని ఐడీఎల్ చెరువు, మూసాపేటలోని మైసమ్మకుంట, కైత్లాపూర్‌లోని కాముని చెరువు, ప్రగతినగర్?లోని అంబీర్ చెరువు, కూకట్‌పల్లిలోని పరికి చెరువు, హైదర్?నగర్?లోని ఆలి తలాబ్ చెరువు.. ఇలా చెప్పుకొంటూపోతే 185 తటాకాల్లో 90 శాతం గుర్రపుడెక్కతో నిండి ఉన్నాయి.

గతేడాది నమోదైన డెంగీ కేసులు.. 1,977

దోమల నియంత్రణకు ఏటా బల్దియా ఖర్చు.. రూ.20 కోట్లు

ఎంటమాలజీ విభాగంలో అధికారులు, సిబ్బంది సంఖ్య.. 2,250

# చిన్న తప్పిదం.. భవిత అంధకారం!

తూప్రాన్ :తూప్రాన్‌కు చెందిన ఓ యువకుడు గంజాయి సేవించే స్నేహితులతో కలిశాడు. సరఫరా చేయడం మొదలు పెట్టాడు. లాభాలు రావడంతో ఇతర రాష్ట్రాల ముఠా సభ్యులతో చేతులు కలిపి క్రయవిక్రయాలు చేయడం ప్రారంభించాడు. నిఘా పెట్టిన పోలీసులు మూడు నెలల క్రితం పట్టుకొని ఆ కేసులో సంబంధం ఉన్న నలుగురు యువకులను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ముగ్గురు ఉన్నత చదువులు చదివి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తుండగా చెడుదారిన వెళ్లి జైలు పాలయ్యారు.

తూప్రాన్‌తో పాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన 8 మంది యువకులు ఓ హోటల్‌లో మద్యం తాగి యువకులతో గొడవపడ్డారు. తాగిన మైకంలో దాడి చేశారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదయ్యాయి. హోటల్ నిర్వాహకులు తూప్రాన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా 8 మందిపై కేసు నమోదు చేశారు. వీరిలో ఇద్దరు ఇంజినీరింగ్, మరో ముగ్గురు డిగ్రీ చదివిన వారున్నారు. ఇద్దరు విదేశాలకు వెళ్లి చదవాలని భావించినా కేసులతో వారి కల నెరవేరలేదు.

ఇటీవల తూప్రాన్ ప్రాంతానికి చెందిన ఆరుగురు యువకులు ఆన్?లైన్? గేమ్?లతో పరిచయమై రెండు నెలల క్రితం హైదరాబాద్?కు ద్విచక్ర వాహనాలపై వెళ్లారు. వివిధ ప్రాంతాల్లో సాయంత్రం సమయంలో ఫుటుగా తాగారు. తిరిగి వస్తుండగా మేడ్చల్? శివారులో ముగ్గురు యువకులు డ్రింకెన్? డ్రైవ్?లో పోలీసులకు పట్టుబడ్డారు. ఇందులో ఒక యువకుడు రెండోసారి పట్టుబడటం గమనార్హం.

తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపం.. చిన్న తప్పిదాలతో యువకులు వారి బంగారు భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తున్నారు. ఉమ్మడి మెదక్? జిల్లాలోని ప్రధాన పట్టణాలు, గ్రామాల్లో యువకులు చెడు అలవాట్లకు దగ్గరై పోలీసు కేసుల్లో ఇరుక్కుంటున్నారు. కొందరు క్షణికావేశంలో, మరికొంత మంది మద్యం మత్తులో గొడవల్లో తలదూర్చి దాడులకు పాల్పడుతున్నట్లు పోలీసుల గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇంకా పలువురు యువకులు గంజాయి సేవించడం అలవాటుగా చేసుకొని వ్యాపారులుగా మారి కేసుల్లో ఇరుక్కొని కటకటాలపాలయ్యారు.

కేసులతో ఉద్యోగాలకు దూరమవుతున్న యువత నరేందర్‌గౌడ్, డీఎస్పీ, తూప్రాన్‌యువకులు చెడు అలవాట్లకు బానిసై క్షణికావేశంలో తప్పులు చేస్తున్నారు. గంజాయి తాగినా, విక్రయించినా శిక్షలు కఠినంగా ఉన్నాయి. చిన్నారుల పోర్న్? వీడియోలు చూసినా ప్రత్యేక నిఘా పెడుతున్నాం. కేసుల్లో దొరికితే జైలుకు పంపిస్తున్నాం. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారి వివరాలను ఆన్‌లైన్‌లో వేలిముద్రలతో నమోదు చేస్తున్నాం. దేశంలో ఎక్కడ కేసుల్లో



ఇరుకున్నా ఈ వివరాలు బహిర్గతమవుతాయి. తల్లిదండ్రుల పర్యవేక్షణ లేక ఈ పరిస్థితి ఏర్పడుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్? ఉద్యోగాలకు దరఖాస్తు చేసిన సమయంలో అభ్యర్థుల క్రిమినల్? వివరాలు ఆరా తీస్తున్నారు. ఆ సమయంలో ఉద్యోగాలకు దూరమయ్యే అవకాశం ఉంది.

పటిష్ఠ నిఘా..ఇటీవలి కాలంలో ఉన్నత చదువులు చదివిన యువకులు ఒక చోట చేరి చిన్నారుల పోర్న్? వీడియోలు చూసిన వారిని పోలీసులు గుర్తించి కేసులు నమోదు చేసి రిమాండుకు పంపారు. మెదక్? జిల్లాలో ఆరు నెలల వ్యవధిలో 5 కేసుల్లో 12 మందికి పైగా యువకులను పోలీసులు రిమాండ్? చేశారు. ప్రధానంగా చదువుకునే యువకులు ఉద్యోగాలు లేక ఖాళీగా ఉంటున్న వారే ఇంట్లో నుంచి బయటకు వచ్చి ఇలాంటి తప్పులు చేస్తున్నట్లు పోలీసులు అంచనాకు వచ్చారు. ఉమ్మడి జిల్లాలో అన్ని కేసుల్లో కలిపి యేటా సుమారు 500 మంది వరకు ఉంటారని అంచనా. తల్లిదండ్రులు, సంరక్షకులు తమ పిల్లలపై ఎప్పటికప్పుడు నిఘా పెడితేనే ప్రయోజకులుగా మారే అవకాశం ఉంది.

# ఆక్రమించి సింగారం

హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలో సింగారం చెరువును చదును చేస్తున్న విషయాన్ని ఈనెల 28న 'సింగారం చెరువును చెర పడుతున్నారు' శీర్షికన వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. చెరువును ధ్వంసం చేసినందుకు, అక్రమంగా ప్రవేశించినందుకు కేసులు నమోదు చేశారు. పట్టాదారు సూర్యప్రకాశరావుకు నోటీసు జారీ చేయాలని నిర్ణయించారు. ఆయన అందుబాటులో లేరని పోలీసులు తెలిపారు. శిఖం పట్టా భూమార్పిడికి ప్రభుత్వంలో ఎవరూ సహకరించారనే విషయంపై సీఎంఓ నివేదిక కోరింది.

**ఉన్నతాధికారుల ఒత్తిడి**

మొయినాబాద్ మండలం నజీబ్‌నగర్ పరిధిలో సర్వేనంబరు 3, 4లో నూకారపు సూర్యప్రకాశరావుకు భూములున్నాయి. దీనిలో సింగారం చెరువు కూడా ఉంది. 80 ఎకరాల చెరువు విస్తీర్ణానికి శిఖం పట్టా ఉంది. ఈ భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేయకూడదు. కట్ట తెంపి చదును చేసి చెరువును పూడ్చటం ప్రారంభించారు. సమాచారం అందుకున్న సాగునీటి అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సంయుక్త తనిఖీ చేశారు. 15 రోజుల కిందట పట్టాదారు సమక్షంలో విచారణ జరిపి ఎఫ్‌టీఎల్ పరిధిలో 80 ఎకరాలకుగాను 73.14 ఎకరాలు, మిగిలిన బఫర్‌జోన్ కింద ఉందని నోటీసు జారీ చేసి పనులు నిలిపివేశారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపారు. ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో పనులు యధావిధిగా కొనసాగాయి. దాదాపు 819



మీటర్ల పొడవు ఉన్న కట్టను చదును చేశారు.

**20 షెడ్లలో పౌల్ట్రీఫారాలు**

సర్వేనంబరు 3, 4లో 80 ఎకరాల్లో ఎలాంటి నిర్మాణాలు చేయకూడదు. ఈభూములను తనఖా పెట్టి బ్యాంకుల్లో రుణాలు పొంది చెల్లించకపోవడంతో వీటిపై ఇంజక్షన్ ఆర్డర్లు జారీ అయ్యాయి. ఈ భూముల్లో దాదాపు 20 షెడ్లలో పౌల్ట్రీఫారాలు నిర్మించారు. నిబంధనలు ఉల్లంఘించారు.

**రూ.40 లక్షలతో పునర్నిర్మాణం**

ధ్వంసం చేసిన కట్టను నీటిపారుదల శాఖ అధికారులు రూ.40 లక్షలతో పునర్నిర్మిస్తున్నారు. పదిరోజుల్లో పూర్తి చేసేలా గుత్తకు ఇచ్చారు. ఎస్ఈ రాజేందర్, డీఈఈ వెంకటరమణ, ఏఈ భరత్‌కుమార్ వర్క్ఇన్‌స్పెక్టర్ నర్సింహులు, ఎంఆర్ఓ గౌతంకుమార్ పరిశీలించారు.

# విశాల నగరం.. సేవలు గగనం!

హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ విశాల నగరంగా ఆవిర్భవించింది. అరకొర సిబ్బందితో కొనసాగుతున్న పుర, నగరపాలికలు జీహెచ్ఎంసీలో విలీనమయ్యాయి. ప్రస్తుతం ఆయా స్థానిక సంస్థల పరిధిలోసేవలు అందించడం బల్దియాకు కష్టంగా మారింది.

**విస్తీర్ణం మూడు రెట్లకుపైగా..**

పాత జీహెచ్ఎంసీ 650 చ.కి.మీ పరిధిలో ఉండేది. 27 పట్టణ స్థానిక సంస్థ(యూఎల్‌బీ)ల విలీనంతో విస్తీర్ణం 2,053 చ.కి.మీటర్లకు పెరిగింది. విలీన ప్రాంతాల్లో 7.5 లక్షల నిర్మాణాలు, 34 లక్షల జనాభా ఉన్నట్లు అంచనా.

**అంతటా అదే పరిస్థితి**

పారిశుద్ధ్య విభాగంలో సూపర్‌వైజర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్మికులు సరిపోను లేరు. పాత జీహెచ్ఎంసీ పరిధిలోనూ కార్మికుల కొరత ఉంది. 1,500 మందిని నియమించుకునేందుకు ప్రభుత్వం ఏడాది కిందట అనుమతి ఇచ్చినా.. అధికారులు చర్యలు తీసుకోలేదు.

నిర్మాణ అనుమతులు జారీ చేసే టౌన్‌ప్లానింగ్ విభాగం తీవ్రమైన సిబ్బంది కొరతను ఎదుర్కొంటోంది. మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందే.. ఇన్‌ఛార్జి సహాయ ప్రణాళికాధికారులుగా పని చేస్తున్నారు. సర్కిల్‌లో ఓ సహాయ ప్రణాళికాధికారి(ఏసీపీ), ఎస్ఓ(సెక్షన్ ఆఫీసర్), ఇద్దరు చైన్‌మెన్లు ఉండాలి. ప్రస్తుతం 20 ఏసీపీలు, సుమారు 100 మంది టీపీఓ, ఎస్ఓ స్థాయి అధికారులు అవసరముందని అంచనా.

కాలనీల్లో రోడ్లు నిర్మించాలన్నా.. వరద నాలాలపై వంతెనలు కట్టాలన్నా.. సర్కిల్ ఒకరి చొప్పున ఉండే కార్యనిర్వాహక ఇంజినీరు (ఈఈ) ద్వారా టెండరు పిలిచి.. గుత్తేదారును ఎంపిక చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం పలు శివారు సర్కిళ్లలో ఈఈలు లేరు. ప్రధాన నగరంలోని ఇంజినీర్లకు ఇన్‌ఛార్జి బాధ్యతలు కూడా ఇవ్వలేదు. ఫలితంగా.. గ్రామాల్లో రహదారుల నిర్మాణం, ఇతరత్రా పనులు నిలిచిపోతున్నాయి. ప్రస్తుతం జీహెచ్ఎంసీ వద్ద వంద మంది మాత్రమే వార్డు ఇంజినీర్లు ఉన్నారు.

విలీన ప్రాంతాల్లోని మున్సిపల్ అధికారులు, సిబ్బంది: 8,000

పాత జీహెచ్ఎంసీ పరిధిలో..: 22,000

# ఎన్నాళ్లీ సమస్య?

హైదరాబాద్: బృహత్ నగరంలో ఏ కాలనీలో చూసినా మురుగు కనిపిస్తోంది. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పరిశుభ్ర నగరంగా ఏడు నక్షత్రాల(సెవెన్‌స్టార్) గుర్తింపు పొందినా.. మురుగు నిర్వహణ అధ్వానంగా మారింది. ప్రస్తుతం శివారు మున్సిపాలిటీలను విలీనం చేసుకుని దేశంలోనే అగ్రస్థాయి నగరంగా ప్రాధాన్యం సంతరించుకున్నా.. అధికారుల అలసత్వం కారణంగా కంపు వీడడం లేదు. యూజీడీ(అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) లీకేజీలపై ఫిర్యాదులు చేస్తే.. అధికార యంత్రాంగం పట్టించుకోవటం లేదనే విమర్శలు ఉన్నాయి. అధికారుల నివాస ప్రాంతాల్లోనే మురుగు రోడ్లపై పారుతోందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. పరిష్కారం కాని ఫిర్యాదులు 25 శాతం

మురుగు వ్యవస్థ(యూజీడీ)ను జలమండలి నిర్వహిస్తోంది. వచ్చే ఫిర్యాదుల్లో కనీసం 25 శాతం కూడా పరిష్కరించడం లేదు. ఒకవేళ పరిష్కరించినా మూణ్నాళ్ల ముచ్చటే. నగరంలో ప్రస్తుతం జనాభా 1.34 కోట్లకు చేరుకుంది. శివారు మున్సిపాలిటీలను మినహాయిస్తే.. కోటి వరకు ఉంది. నగరంలో 10 వేల కిలోమీటర్ల పొడవైన యూజీడీ నిర్మించారు. వాటిలో 8 వేల కిలోమీటర్లు రెండు, మూడు దశాబ్దాల కిందటవే. కొత్తగా ఏర్పాటవుతున్న గేటెడ్ కమ్యూనిటీలు, బహుళ అంతస్తుల కాలనీల్లో వారే యూజీడీ ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రతి ఇంటి కనెక్షన్ ద్వారా వచ్చిన మురుగు యూజీడీ ద్వారా మురుగు శుద్ధి కేంద్రం(ఎస్‌టీపీ)కి చేరుతుంది. అక్కడ ఆ నీటిని శుభ్రపరిచి మూసీ నదిలోకి వదులుతారు. ఇలాంటి ఎస్‌టీపీలు 50 మాత్రమే ఉన్నాయి. ఇవీ లెక్కలుజలమండలి లెక్క ప్రకారం రోజూ నగరంలో 1950 ఎంఎల్‌డీల మురుగు వెలువడుతోంది. ప్రస్తుతం పెరిగిన జనాభా అవసరాల ప్రకారం ఇది 2,500 ఎంఎల్‌డీ వరకు ఉంటుందని అంచనా. నగరంలో ఉన్న 45 ఎస్‌టీపీల ద్వారా రోజుకు 1878 మిలియన్ లీటర్ల మురుగు శుభ్రపరుస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. వాస్తవ లెక్కల ప్రకారం ఇంకా 30 శాతం మురుగును శుభ్రపరచడం లేదు. ఇదంతా యూజీడీల్లో పేరుకుపోతోంది. పేరుకుపోయిన మురుగుతో ప్రవాహం సాఫీగా సాగక.. మ్యాన్‌హోళ్ల ద్వారా పైకి చిమ్ముతోంది. రోడ్లే మురుగు కాలువలు అవుతున్నాయి. ఇళ్లలోని ప్లాస్టిక్ కవర్లు, వంట వ్యర్థాలు యూజీడీలోనే వేస్తుండటంతో సమస్య మరింత జటిలమవుతోంది.

# శ్రీరాంహిల్స్ తొలి హౌసింగ్ సొసైటీ



ఖమ్మం : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొట్టమొదటి హౌసింగ్ సొసైటీ కాలనీ ఏదో తెలుసా? ఖమ్మం నగరంలోని 'శ్రీరాంహిల్స్'. హౌసింగ్ బోర్డుగా కూడా దీన్ని పిలుస్తుంటారు. పచ్చని చెట్లు, విశాల రోడ్లతో కనిపించే ఈ కాలనీలో నగరానికి చెందిన పలువురు ప్రముఖులు, ఉన్నతోద్యోగులు, వ్యాపారులు నివసిస్తున్నారు. కాలనీ ఆవిర్భావం మొదలు నిర్వహణ వరకూ పలు విశేషాలున్నాయి.

శ్రీరాంహిల్స్ కాలనీ నిర్మాణానికి 2007, జులై 7న శంకుస్థాపన చేశారు. ధంసలాపురం సర్వే నం.49లో సుమారు 42 ఎకరాల ప్రభుత్వ భూమిలో గృహనిర్మాణ శాఖ(హౌసింగ్ బోర్డు) ఆధ్వర్యంలో నిర్మాణాల ప్రతిపాదన చేపట్టారు. టెండరు పద్ధతిలో ఐవీఆర్‌సీఎల్ సంస్థ దక్కించుకుని సుప్రభాత్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థకు పనులు అప్పగించారు. 150, 200, 256, 260, 300, 477 చ.గజాల స్థలాల్లో ఆరు రకాలుగా మొత్తం 367 ఇళ్లు నిర్మించారు. 2010 నుంచి దశల వారీగా ఇళ్ల అప్పగింత ప్రారంభమై 2012 నాటికి పూర్తయ్యింది. వందలాది కుటుంబాలు నివసించే శ్రీరాంహిల్స్‌లో కాలనీ సహకార సంఘం కార్యాలయం ఉంది. నీటి కరవు లేకుండా ఐదు బోర్లు వేశారు. దూరాన ఉన్న ధంసలాపురం పెద్ద చెరువు నుంచి దాత సహకారంతో బోరు, పైపులైను వేయించారు. కాలనీలో గుట్టపై 6లక్షల లీటర్ల సామర్థ్యంగల సంపు నిర్మించి ఇళ్లకు నీటిని సరఫరా చేస్తున్నారు. మిషన్ భగీరథ నీరూ కాలనీ వాసులకు అందుతున్నాయి.రెండు ప్రధాన, 22 అంతర్గత రహదారులు.. అన్నీ బీటీ రోడ్లే. ఎక్కడా మురుగు కనిపించకుండా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించారు. ఎస్‌టీపీ ట్యాంకు నిర్మించి మురుగు నుంచి శుద్ధి చేసిన 2లక్షల లీటర్ల నీటితో పార్కులు, వీధుల్లో చెట్లకు నీరందిస్తున్నారు. వర్షపు నీటి నిర్వహణకు అండర్ గ్రౌండ్ నిర్మాణం చేపట్టారు. 14 నియంత్రికల సాయంతో భూగర్భ విద్యుత్తు లైను కేబుల్ వేసి విద్యుత్తు సరఫరా చేస్తున్నారు. కాలనీలో నాలుగు పార్కులు నిర్వహి స్తున్నారు. దాతల సహకారంతో సీతారామ కళాప్రాంగణాన్ని నిర్మించి దైవ, సాంస్కృతిక కార్యక్రమాలకు వినియోగి స్తున్నారు. కాలనీ నివాసులతో ప్రతి రెండేళ్లకోసారి కమిటీని ఎన్నుకుం టున్నారు. ఇప్పటివరకున్న తొమ్మిది కమిటీలూ ఏకగ్రీవంగానే ఎన్నికవడం విశేషం.

# వారి 'కాంక్షలు' వేరే..



కొత్తగూడెం : సైబర్ నేరగాళ్లు సాంకేతికతను ఉపయోగిస్తూ రెచ్చిపోతున్నారు. ఏదోరీతిన మోసం చేయడమే పనిగా పెట్టుకుని ప్రజల సొత్తును కాజేయడమే లక్ష్యంగా సాగిపోతున్నారు. స్మార్ట్‌ఫోన్లు ఉపయోగిస్తున్న వారే వారి వలలో చిక్కుకుని రూ.లక్షలు చేజార్చుకుంటున్నారు. నిన్నమొన్నటి వరకు యాప్‌లు, ఉద్యోగాలు, బ్యాంకుల పేరిట నేరాలకు పాల్పడిన కేటుగాళ్లు ఇప్పుడు పండుగలు, పబ్బాలను వేదికగా చేసుకునేందుకు సిద్ధమయ్యారని పోలీసులు హెచ్చరిస్తున్నారు. కొత్త సంవత్సరం ప్రవేశించనున్న నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు తప్పుడు (మ్యూల్) ఖాతాలను ప్రారంభిస్తున్నారు. దీని ఆధారంగా 'నూతన సంవత్సర శుభాకాంక్షలు' పేరుతో గాలం వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఫోన్‌లో కొత్త ఏడాది విషెస్ తెలుపుతూ మెసేజ్‌లు ఇస్తారు. పొరబాటున దాన్ని ఓపెన్ చేస్తే బ్యాంకు ఖాతా దగ్గరి నుంచి మొదలుకుని వ్యక్తిగత సమాచారం వరకు హాక్ చేసే కొత్త ట్రిక్కులతో సైబర్ నేరగాళ్లు ముందుకు రాబోతున్నట్లు పోలీసులు హెచ్చరిస్తుండటం గమనార్హం. 'హ్యాపీ న్యూ ఇయర్' అంటూ వచ్చే ఫేక్ మెసేజ్‌లలో 'డాట్ ఏపీకే' పదం కన్పిస్తే ఎట్టి పరిస్థితుల్లో ఓపెన్ చేయొద్దని అధికారులు స్పష్టం చేస్తున్నారు. నూతన సంవత్సరాన్ని చేదు జ్ఞాపకాలతో ప్రారంభించకుండా అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే ప్రచార బోర్డులు అందుబాటులో ఉంచారు.

**సంబంధం లేకున్నా...**

సంబంధమే లేకుండా సైబర్ నేరాల్లో అమాయకులు భాగస్వాములవుతున్నారు. గుర్తు తెలియని వ్యక్తుల ఖాతాల నుంచి తమ ఖాతాల్లోకి డబ్బులు రావడం వల్ల అలాంటి వారి బ్యాంకు ఖాతాల్లోని నగదును అధికారులు హోల్డ్‌లో పెడుతున్నారు. ఫలితంగా తమ డబ్బును పొందేందుకు బ్యాంకులు, సైబర్‌క్రైమ్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వస్తోంది.న్యూగొల్లగూడేనికి చెందిన ఓ మహిళ ఖాతాకు 2022లో రూ.350 ఎవరో గుర్తు తెలియని ఖాతా నుంచి జమ అయ్యాయి. అది సైబర్ నేరగాడు చేసిన నిర్వాకం కావడం వల్ల ఆమె ఖాతాలో జమ అయిన డ్వాక్రా డబ్బులు రూ.1,50,000 బ్యాంకు అధికారులు హోల్డ్‌లో పెట్టారు. సైబర్ క్రైమ్ అధికారులను ఆశ్రయించడంతో వారం రోజుల తరువాత సమస్య పరిష్కారమైంది. కొత్త ఏడాదిలో సైబర్ నేరాల నియంత్రణే లక్ష్యంగా పలు కార్యక్రమాలు రూపకల్పన చేస్తున్నట్టు ఎస్పీ బి.రోహిత్‌రాజు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

2025లో సైబర్ నేరాల వివరాలు


జిల్లాలో నమోదైన కేసులు: 196

కోల్పోయిన నగదు: రూ.8 కోట్లు

అధికారులు ఫ్రీజ్ చేసిన నగదు: రూ.1.45 కోట్లు

బాధితులకు అందచేసిన మొత్తం: రూ.22.63 లక్షలు

# రైతు వేదిక.. భద్రత లేదా ఇక



పాల్వంచ : జిల్లాలో రైతులకు, వ్యవసాయాధికారులకు అనుసంధానంగా మారిన రైతు వేదికలకు రక్షణ కరవైంది. చాలాచోట్ల ఊరికి దూరంగా, శివారు ప్రాంతాల్లో ఉండటంతో దొంగల బెడద ఎక్కువైంది. నిఘా నేత్రాలు లేకపోవడంతో వాటిల్లో విలువైన సొత్తు అపహరణకు గురవుతోంది.

**విషయమేంటి?**

జిల్లాలో 67 రైతు వేదికలున్నాయి. వీటిల్లో ప్రస్తుతం 58 వేదికల్లో రైతు నేస్తం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో రాష్ట్ర స్థాయి అధికారులు, రైతులతో ముఖాముఖి మాట్లాడి సాగులో సందేహాలను నివృత్తి చేస్తున్నారు. దృశ్యమాధ్యమ రూపంలో అన్నదాతలతో మాట్లాడేందుకు వీలుగా 62 అంగుళాల టీవీ, స్పీకర్లు, ఇన్వర్టర్లు, కంప్యూటర్లు అందుబాటులో ఉంచారు. ఇవీ ఆయా క్లస్టర్ ఏఈవోల నియంత్రణలో ఉంటాయి.

**ఎందుకు ఇలా...?**

1. రైతు వేదికలు ఊరుకు దూరంగా విసిరేసినట్లు ఉండటంతో పర్యవేక్షణ కరవవుతోంది.
2. ఎక్కడా సీసీ కెమెరాలు లేవు. దీంతో రాత్రిళ్లు దొంగలు సునాయాసంగా చోరీకి పాల్పడుతున్నారు. విచారణపై దృష్టి సారించకపోవటంతో వారికి అడ్డేలేకుండా పోతోంది.
3. రూ.3లక్షల వ్యయంతో ఎలక్ట్రానిక్స్ వస్తువులకు ఏర్పాటు చేస్తున్నారు. కానీ రూ.వేలు ఖరీదు చేసే నిఘా నేత్రాల ఏర్పాటును విస్మరిస్తున్నారు.

**మచ్చుకు కొన్ని..**

నవంబరు 11న పాల్వంచ మండలం పాండురంగాపురం రైతు వేదికలో రూ.2లక్షల టీవీ చోరీకి గురైంది. అంతకు ముందు ఆగస్టులో స్పీకర్, ఇన్వర్టర్ అపహరణకు గురైంది. నెలలు గడుస్తున్నా విచారణ కొలిక్కి రాలేదు. పోలీసులు ఇంటి దొంగ పనేనని తేల్చినా, జిల్లా వ్యవసాయాధికారులు రెండుసార్లు విచారణ చేసినా ఎవరు చోరీ చేశారో గుర్తించలేదు. ఇల్లెందు మండలం చల్లసముద్రంలో టీవీ అపహరణకు గురికాగా పక్కన ఓ ఇంట్లో అమర్చిన సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుణ్ని గుర్తించారు.

జూలూరుపాడు మండలం పడమటి నర్సాపురంలో కంప్యూటర్ అపహరణకు గురైంది. ఇప్పటికీ ఆచూకీ లేదు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. చోరీ ఘటనపై పోలీసులకు ఫిర్యాదులు చేసి విచారణ చేయిస్తున్నాం.

బాబు, జిల్లా వ్యవసాయాధికారి

# రద్దీ ఛార్జీలతో కాలుష్యం కట్టడి


హైదరాబాద్: రోజూ తిరిగే 85 లక్షల వాహనాలు, నిత్యం కొత్తగా రోడ్డెక్కుతున్న వాహనాలతో నగర రహదారులు కిక్కిరిసిపోతున్నాయి. అవసరమున్నా లేకున్నా వాహనాలు రోడ్డెక్కిస్తుండటంతో నగరవాసులు ఏటా 85 గంటల పాటు ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నారని ఓ సంస్థ అధ్యయనంలో వెల్లడైంది. ప్రజా రవాణాను వినియోగించడమే ఏకైక పరిష్కార మార్గమని నిపుణులు సూచిస్తున్నారు. వ్యక్తిగత వాహనాలు వీడి ఆర్టీసీ, మెట్రోలో ప్రయాణించాలంటే లండన్ తరహాలో నగరంలో 'రద్దీ పన్ను' (కంజెషన్ టాక్స్) విధించాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బెంగళూరులో ఈ విధానం అమలుపై చర్చ జరుగుతోంది.

**ఏమిటీ కంజెషన్ టాక్స్..**

ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోకి వాహనాలు వెళ్లేందుకు విధించే రోజువారీ ఫీజు లేదా టోల్ ఇది. వ్యక్తిగత, ప్రైవేటు వాహనాలను వినియోగించకుండా,మెట్రో బస్సులు ఉపయోగించేలా ప్రోత్సహించేందుకు లండన్‌లో ఈ విధానాన్ని అవలంబిస్తున్నారు. జోన్ బౌండరీలో, లోపల ఆటోమెటిక్ నంబరు ప్లేట్ రికగ్నిషన్ (ఏఎన్‌పీఆర్) కెమెరాలు ఉంటాయి. ఇవి వాహనం నంబరు ప్లేట్‌ను ఆటోమెటిక్‌గా గుర్తించి ఫొటో తీస్తాయి. ట్రాన్స్‌పోర్ట్ ఆఫ్ లండన్ వ్యవస్థ అన్నీ నంబరు ప్లేట్లను పరిశీలించి జోన్‌లోకి వచ్చిన వాహనాలు ఛార్జీ చెల్లించాయా లేదా పరిశీలిస్తాయి. మినహాయింపు ఇచ్చిన ఈవీ వాహనాలు ముందుగానే రిజిస్టర్ చేసుకుంటే మినహాయింపు వర్తిస్తుంది. 2003 నుంచి దీనిని అమలు చేస్తుండటంతో 30 శాతం వరకు ట్రాఫిక్ తగ్గింది. సెంట్రల్ లండన్ జోన్‌లో వ్యక్తిగత వాహనాలతో వెళ్లేవారికి రోజుకు 15 పౌండ్ల చొప్పున ఛార్జీ విధిస్తున్నారు. సింగపూర్, స్టాక్‌హోమ్, న్యూయార్క్‌లోనూ ఈ విధానం అమలవుతోంది.

**బెంగళూరులో ప్రతిపాదనలు**

ట్రాఫిక్ సమస్య ప్రధానంగా ఉన్న బెంగళూరులోనూ కంజెషన్ ఛార్జీలు




విధించాలన్న ప్రతిపాదనలున్నాయి. 2025 సెప్టెంబర్‌లో కర్ణాటక ప్రభుత్వం 90 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఈ ప్రతిపాదన అమలుపై చర్చించింది. ఔటర్ రింగ్‌రోడ్డుపై రద్దీ వేళల్లో ఒక్కరే ఉన్న (సింగిల్ ఆక్యుపెంట్) కార్లకు ఛార్జీ విధించాలని అందులో పేర్కొంది. ఫాస్టాగ్ ద్వారా ఆటోమెటిక్‌గా ఛార్జీలు వసూలు చేసేలా, కార్‌పూలింగ్‌కు మినహాయింపు ఇవ్వాలని యోచిస్తున్నారు.

**1000 మంది ప్రయాణికులకు..**

మెట్రో రైలులో 1000 మంది ప్రయాణించొచ్చు. అదే బస్సులో 40 నుంచి 50, కారులో నలుగురు, ద్విచక్ర వాహనంలో ఇద్దరు వెళ్లొచ్చు. ఇదే 1000 మంది ప్రయాణించడానికి 20 నుంచి 30 బస్సులు, 250 కార్లు, 500 ద్విచక్ర వాహనాలు అవసరమవుతాయి. ఈ వాహనాలన్నీ రోడ్లపై చేరటంతో వేగం తగ్గుతోంది. కాలుష్య ఉద్గారాలు పెరుగుతున్నాయి.

**భాగ్యనగరంలో రద్దీ ప్రాంతాలు..**

గచ్చిబౌలి, పంజాగుట్ట, బేగంపేట, కూకట్‌పల్లి, మాదాపూర్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, కొండాపూర్, మెహిదీపట్నం, అత్తాపూర్, టోలిచౌకి, దిల్‌సుఖ్‌నగర్, నార్సింగి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, లింగంపల్లి.

# అక్రమాల స్టాంప్

నల్గొండ : అధిక ధరలకు నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్ల విక్రయాలు ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో జోరుగా సాగుతున్నాయి.

**ఎందుకు ఇవి..**

ఆస్తుల రిజిస్ట్రేషన్, బ్యాంక్ సంబంధిత లావాదేవీలు, స్థిరాస్తి ఒప్పంద పత్రాలు, విద్యార్థుల ఉపకార వేతనాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు, అఫిడవిట్ తయారీ తదితర అవసరాలకు.


**గతంలో ఇలా..** గతంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోని కౌంటర్లలోనే డబ్బులు ఇచ్చి నేరుగా నాన్‌జ్యుడీషియల్ స్టాంప్ పేపర్లు తీసుకునే అవకాశం ఉండగా.. ప్రస్తుతం ఆ విధానం అమల్లో లేదు. ప్రభుత్వం దాదాపు మూడేళ్ల క్రితం ఆన్‌లైన్‌లో బుక్ చేసుకొని తీసుకునే విధానాన్ని చేపట్టింది.

ఎక్కెడక్కడంటే..

నల్గొండ, మిర్యాలగూడ, దేవరకొండ, చండూరు, నకిరేకల్, నిడమనూరు, సూర్యాపేట, హుజూర్‌నగర్, కోదాడ, బీబీనగర్, భువనగిరి, మోత్కూరు, యాదగిరిగుట్ట, చౌటుప్పల్

**దందా ఇలా..**

మార్కెట్లో లభ్యమయ్యే రూ.20 నాన్‌జ్యుడీషియల్ స్టాంప్ పేపర్‌కు రూ.40 నుంచి రూ.50 వరకు, రూ.50 స్టాంప్ పేపర్‌కు రూ.80–100, రూ.100 స్టాంప్ పేపర్‌కు రూ.150–180 వరకు విక్రయిస్తూ అక్రమాలకు



పాల్పడుతున్నారు.

వాస్తవానికి ప్రభుత్వం ఇచ్చే 5 శాతం కమీషన్ తీసుకొని వెండర్లు విక్రయాలు చేపట్టాల్సి ఉంది.

మహారాష్ట్ర, నాసిక్ ప్రాంతంలో స్టాంపు పేపర్ల తయారీ చేస్తుండగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ప్రభుత్వమే గుత్తేదారుల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఈ పత్రాలు ఆయా జిల్లాలోని కార్యాలయాలకు వచ్చిన సమయంలో కొందరు ఉద్యోగులు ముందు గానే 'ఆయా స్టాంప్ వెండర్ల'కు సమాచారం ఇచ్చి పెద్దమొత్తంలో స్టాంప్ పత్రాలు కొనుగోలు చేయించి 'కృత్రిమ కొరత' సృష్టిస్తున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

–నగేశ్, సబ్ రిజిస్ట్రార్, నల్గొండ

స్టాంప్ వెండర్ల దగ్గర నుంచి కాకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి నేరుగా కొనుగోలు చేయవచ్చు. స్టాంప్ పత్రాలు సరిపడా ఉన్నాయి. మా సిబ్బందితో ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేశాం. బయట స్టాంప్ వెండర్ల దగ్గర కూడా ఉన్న ధరతోనే కొనుగోలు చేయాలి. మా సిబ్బంది ఎవరైనా వెండర్లకు సహకరించినట్లు ఫిర్యాదు, సాక్ష్యాలు సమర్పిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.నాన్‌జ్యుడీషియల్ స్టాంప్ పేపర్లు

# తేలిన గుంతలు.. తొలగాలి గంతలు!

విశాఖ : విశాఖ నగరంలో రహదార్లు మళ్లీ యథాస్థితికి చేరుకున్నాయి. వైకాపా హయాంలో వాటిని పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం గతేడాది మరమ్మతులు చేపట్టింది. ఏడాది తిరక్కముందే అవి మళ్లీ అధ్వానంగా మారాయి. ఇటీవల భాగస్వామ్య సదస్సు సమయంలో ప్రధాన రహదారులను అధికారులు సుందరంగా తీర్చిదిద్దారు. నడక మార్గాలను పునరుద్ధరించి రంగులు వేశారు. త్వరలో జరగనున్న ఐఎఫ్?ఆర్? (ఇంటర్నేషనల్? ఫ్లీట రివ్యూ) కోసం మళ్లీ రహదారులకు మెరుగులు దిద్దనున్నారు. ఇంత వరకు బాగున్నా అంతర్గత దారులను పట్టించుకోకపోవడంపై విమర్శలొస్తున్నాయి.

**ఏళ్ల తరబడి సాగుతున్న ప్రాజెక్టులు:** నగరంలో 24 గంటల నీటి సరఫరా, భూగర్భ మురుగునీటి వ్యవస్థ, భూగర్భ విద్యుత్తు కేబుళ్ల ప్రాజెక్టు పనులు ఐదారేళ్లుగా కొనసాగుతున్నాయి. ఎప్పుడు ఎక్కడ గోతులు తీస్తారో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. పనులు పూర్తయిన తర్వాత రహదారిని పునరుద్ధరించాల్సి ఉన్నా గుత్తేదారులు నెలల తరబడి అలాగే వదిలేస్తున్నారు. ఇంజినీరింగ్? అధికారులు దృష్టి సారించకపోవడంతో ఎవరికి నచ్చినట్లు వారు తవ్వుకుంటూ వెళ్లిపోతున్నారు.

**ఎవరికీ పట్టని చోదకుల పాట్లు:** పెందుర్తి నుంచి గోపాలపట్నం వరకు



తాటిపూడి పైపులైనుతోపాటు, 24 గంటల నీటి సరఫరా పనుల కోసం తవ్వేయడంతో రహదారులు దారుణంగా మారాయి. సీతమ్మధార, హెచ్?బీకాలనీ, మాధవధార, మురళీనగర్ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి. ఆరిలోవ ప్రధాన రహదారిలో యూజీడీ కనెక్షన్ల కోసం ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. మల్కాపురం, గాజువాక, మధురవాడ, కొమ్మాది, మారికవలసలో అంతర్గత దారులు గోతులమయంగా మారాయి. తగరపువలస, భీమిలిలోనూ ఇదే దుస్థితి నెలకొంది. ఈ కారణంగా వాహనాలు మరమ్మతులకు గురవడంతోపాటు వెన్ను నొప్పులతో బాధపడుతున్నామని చోదకులు వాపోతున్నారు. 'ఈ ఏడాది రహదారుల పునరుద్ధరణకు అధిక ప్రాధాన్యమిస్తామ'ని ఓ ఇంజినీరింగ్ అధికారి తెలిపారు.

**బీఆర్టీఎస్ సర్వీస్ రోడ్లు ఛిద్రం**నగరంలో బీఆర్టీఎస్ నుంచి వీధులు, ప్రధాన రహదారిని అనుసం ధానించే రహదారులు ఛిద్రమై ఉన్నాయి. గతేడాది పూడ్చిన గుంతల నుంచి రాళ్లు బయటకు వచ్చి ప్రమాదకరంగా మారాయి. మధ్య దారి కొంత బాగున్నా..సర్వీసు రోడ్లు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. దీంతో ద్విచక్రవాహన చోదకులు రాత్రుళ్లు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు.

# గట్టు జారుతోంది.. గుండె అదురుతోంది!

పాయకరావుపేట : కడలి అలల ఉద్ధృతికి తీరం కరిగిపోతుంది. పాయరావుపేట మండలం తీర గ్రామాల్లోని రాజవరం, గజపతినగరంలో భూమి కోత అధికంగా ఉంది. అన్నవరం నుంచి వస్తున్న పంపా నది ఇక్కడే బంగాళాఖాతంలో ఏటిమొగ వద్ద కలుస్తుంది. దీంతో ఈ ప్రాంతం చిన్నసైజు ద్వీపాన్ని తలపిస్తుంది. చుట్టూ నీరు ఉండగా మధ్యలో ఇసుక తిన్నెలతో భూమి ఉంటుంది. ఈ ప్రాంతంలో అలల తీవ్రత ఎక్కువే. తరచూ పంపాలోకి సముద్రపు నీరు వస్తుంది. నీటి ఒరవడితో ఈ ప్రాంతంలోని షెల్టర్ భూములు ఏటిలో కలిసిపోతు



న్నాయి. ఇసుకతో కూడిన భూమి కావడంతో కెరటాల తాకిడికి కొట్టుకుపోతోంది. ఇక్కడ పెంచిన సరుగుడు తోటలు.. కోత కారణంగా సముద్రంలోకి చేరుతున్నాయి.

వెంకటనగరం, రాజానగరం ప్రాంతాల్లోనూ తీరం కోత బారిన పడుతోంది. జీడితోటలు నేలకొరుగుతున్నాయి. గతంతో పోలిస్తే ఈ ప్రాంతంలో సముద్రం బాగా ముందుకు చొచ్చుకువచ్చింది.

గజపతినగరం నుంచి తీరానికి వెళ్లే గ్రావెల్‌రోడ్డు అలల తాకిడికి కోతకు గురయింది. ఈ సమస్యను దక్కన్? పరిశ్రమ యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లారు. రోడ్డు కోతకు గురికాకుండా సిమెంట్? స్తంభాలు వేశారు. కోత కారణంగా పడవలు వేటకు వెళ్లేందుకు వీలుండటం లేదని మత్స్యకారులు చెబుతున్నారు.

# కొరమీను.. రుచికి మించి లాభం

కలిదిండి: వేగంగా లాభాలు తెచ్చిపెట్టి.. అంతకంటే వేగంగా నష్టాల్లో ముంచేసే రొయ్యల సాగు కంటే అధిక లాభాలు తెచ్చే చేపల పెంపకంపైనే రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ క్రమంలోనే తెల్ల చేపలకు ప్రత్యామ్నాయ రకాల సాగుపై ఇప్పుడిప్పుడే ఉమ్మడి జిల్లాల రైతులు దృష్టి సారిస్తున్నారు.తెలంగాణలో అత్యధికంగా సాగవుతున్న కొరమీను పెంపకాన్ని ఉమ్మడి జిల్లాలో విస్తరించేందుకు మత్స్యశాఖ అధికారులు కృషి చేస్తున్నారు. ప్రస్తుతం రెండు జిల్లాల్లో 1.10 లక్షల ఎకరాల్లో తెల్ల చేపలు సాగవుతున్నాయి. దీనితో పోల్చితే కొరమీను మరింత లాభం తెచ్చిపెడుతుందని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. తెల్ల చేపలు వాతావరణంలోని మార్పులను తట్టుకోలేవు. తగినంత ఆక్సిజన్? అందకపోతే.. మృత్యువాత పడతాయి. నీరు కలుషితమైనా.. వాతావరణంలో ఎలాంటి మార్పులనైనా.. ఆక్సిజన్? సమస్య తలెత్తినా.. తట్టుకునే శక్తి కొరమీనుకు ఉంటుంది. మేతలో ఎలాంటి నిబంధనలు ఉండవు. ఎలాంటి ఆహారాన్నైనా తింటుంది. దీనికి స్థానిక మార్కెట్లో చాలా డిమాండ్? ఉండటంతో కిలో ధర రూ. 250- రూ. 300 వరకు పలుకుతోంది. తెల్ల చేప పిల్లలు ఎకరాకు గరిష్ఠంగా 3 వేలు మాత్రమే వేయాలి. కొరమీను సాగులో తక్కువ సాంద్రతలో 10-20 వేలు, ఎక్కువ సాంద్రతలో 20-30 వేలు వరకు వేయొచ్చు. నాటు రకం కొరమీను పిల్లలు 40 శాతం, వియత్నాం రకం 80 శాతం వరకు బతుకుతాయి.సరైన ప్రత్యామ్నాయం కొరమీను తెల్ల చేపలకు సరైన ప్రత్యామ్నాయంగా చెప్పొచ్చు.

# రాచపల్లి భూములపై అక్రమార్కుల కన్ను



మాకవరపాలెం : భూముల ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ముఖ్యంగా కూడళ్లకు సమీపంలోని భూములకు వాణిజ్య విలువ అధికంగా ఉంటోంది. దీంతో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలపై అక్రమార్కుల కన్నుపడుతోంది. మాకవరపాలెం మండలం తామరం రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 118లో సుమారు 4.10 ఎకరాల భూమి ఉంది. ఇందులో మూడు ఎకరాలకు గతంలో రెవెన్యూ అధికారులు బీసీలకు 'డీ' పట్టాలిచ్చారు. ఈ భూములను అనుభవించడమే తప్ప విక్రయించేందుకు లబ్ధిదారులకు హక్కులేదు. పట్టాలు తీసుకున్న వారు ఇవేమీ పట్టించుకోకుండా భూములను విక్రయించారు. వాటిని కొనుగోలు చేసిన వారూ వేరొకరికి అమ్మేశారు. ఇలా మూడుసార్లు చేతులు మారాయి. మిగిలిన 1.1 ఎకరాలు చాలా రోజులుగా ఖాళీగా ఉండటంతో కొందరు తోటలు పెంచుతున్నారు. రాచపల్లి కూడలికి సమీపంలో నర్సీపట్నం - అనకాపల్లి రహదారిని ఆనుకుని ఈ భూమి ఉంది. ఇక్కడ ప్రస్తుతం ఎకరా రూ. 5 కోట్లకు పైగా ధర పలుకుతోంది. దీంతో ఏదో రకంగా ఇక్కడి ప్రభుత్వ భూమికి పట్టాలు పుట్టించాలని అక్రమార్కులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఇంతలో దళారులు రంగప్రవేశం చేసి తాము పట్టా ఇప్పిస్తామంటూ రూ. 50 లక్షలకు ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా స్థానిక రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకునేందుకు భారీగానే ప్రలోభాలు చూపించారు. పలు కారణాలతో వారి నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో కొద్దిరోజులు మిన్నకుండిపోయారు. దీంతో అటువైపు నుంచి నరుక్కురావాలని భావించి నేరుగా ఉన్నతాధికారుల ద్వారా స్థానిక రెవెన్యూ అధికారులపై ఒత్తిడి పెంచేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

తామరం భూ ఆక్రమణ యత్నాలపై తహసీల్దారు వెంకటరమణను సంప్రదించగా.. సర్వే నంబరు 118లో 1.10 ఎకరాల భూమికి పట్టా ఇవ్వాలంటూ ఓ వ్యక్తి తనను సంప్రదించాడని తెలిపారు. అది ప్రభుత్వ భూమి కావడంతో తాను తిరస్కరించినట్లు చెప్పారు. ఆ ప్రాంతంలో డీ పట్టా భూమి కొనుగోలు చేస్తే పట్టా రద్దు చేయడంతో పాటు భూమి స్వాధీనం చేసుకుంటామని చెప్పారు.

# అదివో.. అల్లదివో!



నక్కపల్లి : కలియుగ దైవం ఉపమాక వెంకన్న ఆలయంలో నిత్యాన్నదానం ఏర్పాటుకు ముహూర్తం కుదిరినట్టే కనిపిస్తోంది. అనుబంధ ఆలయాల్లో అన్నదాన కార్యక్రమం ఏర్పాటుపై తితిదే ఈఓ స్పష్టత ఇవ్వడంతో త్వరలోనే భక్తులకు వెంకన్న అన్నప్రసాదం భాగ్యం దక్కనుంది.సుమారు 1600ఏళ్ల చరిత్ర కలిగిన ఉపమాక స్వామివారిని ఉత్తరాంధ్ర వాసులు తమ ఇలవేల్పుగా భావిస్తారు. తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత వంగలపూడి అనిత ఈ ఆలయాన్ని సీఎం చంద్రబాబు ద్వారా తితిదేలోకి విలీనం చేయించారు. అప్పటి నుంచి ఆలయానికి ప్రాభవం పెరిగినా, అయిదేళ్ల పాలనలో సరైన అభివృద్ధికి నోచుకోలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రిగా అనిత ఆలయంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. గతంలో చేసిన వినతిమేరకు ఇటీవల ఉపమాక ఆలయ అభివృద్ధికి తితిదే భారీగా నిధులు కేటాయించింది. గతేడాది తిరుమలలో జరిగిన వార్షిక బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తితిదే అనుబంధ ఆలయాలన్నింటిలోనూ అన్నదానం అమలు చేయాలని ఆదేశించారు. అప్పటినుంచి దీనిపై కసరత్తు జరుగుతోంది. ఈ క్రమంలో తితిదే ఛైర్మన్? బి.ఆర్?. నాయుడు, కార్యనిర్వహణాధికారి అనిల్?కుమార్? సింఘాల్? పలు సమావేశాల్లో వీటికి తుది రూపు తెచ్చే ప్రయత్నం చేశారు. తాజాగా మార్చి నెలాఖరు నుంచి అనుబంధ ఆలయాల్లో రెండు పూటలా అన్నదానం అమలు చేస్తామని ఈఓ ప్రకటించడంతో ఈ ప్రాంత భక్తులకు ఆనందాన్నిచ్చింది. అన్నదానం అమలుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకునేలా సంబంధిత త్వరలోనే ఇక్కడకు అధికారుల బృందం రానున్నట్లు సమాచారం. ప్రస్తుతం స్వామివారి దర్శనార్థం అనేక జిల్లాలనుంచి శని, ఆదివారాల్లో అధిక సంఖ్యలో భక్తులు వస్తున్నారు. నిత్యాన్నదానం అమలులోకి వస్తే నిత్యం భక్తుల తాకిడి మరింత పెరిగే అవకాశం ఉంది. మరోవైపు ఆలయం వద్ద డార్మిటరీ, వసతి ఇతర సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడంతోపాటు ఆలయం వద్ద తిరుమల లడ్డూ ప్రసాదాలను కనీసం వారాంతాల్లోనైనా విక్రయించే ఏర్పాట్లు చేస్తే ని ద్వారా భక్తుల సంఖ్య మరింత పెరుగుతుంది.

# అక్కడే.. మృత్యువు మాటేసింది!

అనకాపల్లి : గత మూడేళ్లలో ప్రమాదాలు ఇలా.

బ్లాక్ స్పాట్లు : 26

జరిగిన ప్రమాదాలు: 340

మృతి చెందిన వారు : 171

క్షతగాత్రులు: 312

ఒకసారి, రెండుసార్లు కాదు.. పదేపదే అదేచోట ప్రమాదం జరుగుతోంది అంటే అక్కడ మృత్యువు మాటేసిందని అర్థం. అక్కడ రక్షణ చర్యలు తీసుకోవడం తక్షణ అవసరం. జిల్లా పరిధిలో జాతీయ రహదారిపై కొన్నిచోట్ల తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. వీటిని బ్లాక్‌స్పాట్లుగా గుర్తించారు తప్ప కనీస చర్యలు చేపట్టడం లేదు. ఫలితంగా 16వ నంబరు జాతీయ రహదారి రక్తమోడుతూనే ఉంది. విలువైన నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోతూనే ఉన్నాయి.

**ఆయా మండలాల్లో ప్రమాదకర కూడళ్లు**

పాయకరావుపేట : నామవరం, తాండవ, సిరిపురం

ఎలమంచిలి : పోతురెడ్డిపాలెం, పాలపర్తి, రేగిపాలెం, కొక్కిరాపల్లి

నక్కపల్లి : ఉద్దండపురం, గొడిచర్ల, ఒడ్డిమెట్ట, నక్కపల్లి ఓల్డ్? బంక్?

ఎస్.రాయవరం : అడ్డురోడ్డు, ధర్మవరం, పెనుగొల్లు బస్టాప్?

కశింకోట : తాళ్లపాలెం, బయ్యవరం, కశింకోట, ఉగ్గినిపాలెం, గొబ్బూరు, పిసినికాడ కూడలి

పరవాడ : లంకెలపాలెం

సబ్బవరం : ఇరువాడ, చెన్నయ్యపాలెం

ఇవీ ప్రమాదాలకు ప్రధాన కారణాలు

జాతీయ రహదారి కూడళ్లు, బ్లాక్ స్పాట్ల దగ్గర లైటింగ్? లేకపోవడం

కూడళ్లలో బ్లింకర్లు పెట్టకపోవడం, రహదారి విస్తరించకపోవడం

జాతీయ రహదారి దాటే క్రమంలో ఎదురుగా వస్తున్న వాహన వేగాన్ని అంచనా వేయకపోవడం.

మలుపులు తిరిగిన దగ్గర రోడ్డు గుంతలు మరమ్మతులు చేయకపోవడంతో బైకులు అదుపుతప్పి పడిపోవడం

హోటళ్లు, రెస్టారెంట్లు జాతీయ రహదారి అంచువరకు ఉండటం

రహదారిపైనే వాహనాలు నిలపడం



ఏమీ మారలేదు... అనకాపల్లి ఎస్పీగా గౌతమి సాలి ఉన్నప్పుడు జాతీయ రహదారి పొడవునా.. ఎక్కడెక్కడ బ్లాక్?స్పాట్లు ఉన్నాయో గుర్తించారు. ఆయా ప్రదేశాల్లోనే ఎందుకు అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయో అని రవాణాశాఖ అధికారులతో కలిసి స్వయంగా పరిశీలించారు. బ్లాక్ స్పాట్లలో లోపాలను గుర్తించి.. వీటిని సవరించాలని జాతీయ రహదారి (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులకు సూచించారు. కానీ.. ఒక్క దగ్గర కూడా ఆయా లోపాలను ఇప్పటికీ సవరించలేదు.

**భద్రత చర్యలు చేపడతాం..** - తుహిన్ సిన్హా, ఎస్పీ, అనకాపల్లి

జిల్లా పరిధిలోని గ్రామీణ ప్రాంతాలను ఆనుకొని జాతీయ రహదారి వెళ్తోంది. ఆయా గ్రామాల పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. రోడ్డు వెంట ప్రమాదకర మలుపులు, లైట్లు లేకపోవడం, బ్లాక్? స్పాట్లు గుర్తిస్తున్నాం. హెచ్చరిక బోర్డులు, బ్లింకర్లు ఏర్పాటు చేస్తున్నాం. మత్తులో వాహనాలు నడిపేవారిని గుర్తించేందుకు తనిఖీలు చేస్తున్నాం. తెల్లవారు జామున వెళ్లేవారితో ముఖం కడిగిస్తున్నాం. హైవే మొబైల్స్? ద్వారా ట్రాఫిక్‌ని పర్యక్షిస్తున్నాం.

# రైతు మెచ్చేలా రీసర్వే

కర్నూలు : గత ప్రభుత్వ హయాంలో హడావుడిగా చేసిన రీసర్వే కారణంగా భూ యజమానులు నేటికీ అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం మారినా.. వైకాపా పాపాలు నేటికీ అన్నదాతలను వెంటాడుతూనే ఉన్నాయి. భూమి విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, సర్వే నంబర్లు గల్లంతవడం, పట్టా పొలాలు ప్రభుత్వ భూములుగా నమోదవడం, రైతుల పేర్లు, ఫొటోల్లో తప్పులు.. ఎక్కువమంది రైతులకు ఉమ్మడి ఎల్పీఎం నంబర్లు ఇవ్వడంతో.. తప్పులను సరిదిద్దాలని బాధితులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో ఇకపై చేయబోయే రీసర్వేలో కూటమి ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. ఇక నుంచి రీసర్వే ప్రారంభం నుంచి ముగింపు వరకు అన్ని దశల్లోనూ రైతులదే కీలక పాత్ర. రైతు అభిప్రాయానికి పెద్దపీట వేసింది. ఈమేరకు విధివిధానాల్లో మార్పులు చేస్తూ రెవెన్యూశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది.

**ఇకపై ఇలా చేస్తారు**

గ్రామస్థాయిలో వెబ్‌ల్యాండ్‌లో పేర్కొన్న డేటా ఆధారంగా రైతుల ఫోన్ నంబర్లకు రీసర్వే మెసేజ్‌లు పంపిస్తారు. నోటీసుల జారీ నుంచి భూముల కొలతలు వేయడం, రైతుల నుంచి వచ్చే అభ్యంతరాలను పరిష్కరించడానికి 90 రోజుల కాల వ్యవధిని నిర్దేశించారు.

**94 గ్రామాల్లో నాలుగో విడత**



కర్నూలు జిల్లాలోని 41 గ్రామాల్లో, నంద్యాల జిల్లాలోని 53 గ్రామాల్లో ప్రస్తుతం నాలుగో విడత రీసర్వే సాగుతోంది.గ్రామస్థాయిలో సర్వే అనంతరం భూములకు ల్యాండ్ పార్సిల్ మ్యాప్‌లు, వాటికి నంబర్లు కేటాయించడం, మ్యాప్‌లలో భూ విస్తీర్ణంలో చోటుచేసుకునే తప్పులను సరిచేసే బాధ్యతను విలేజ్ సర్వేయర్, వీఆర్వోలకు అప్పగించారు. భూముల కొలతలు వేసిన తర్వాత సర్వేయర్లు రూపొందించిన డేటా పరిశీలన, నిర్ధారణ, గ్రామ సభ నిర్వహణకు 12 రోజుల కాలవ్యవధిని నిర్దేశించారు. భూముల సర్వే అనంతరం పట్టా భూముల రికార్డును ఆర్డీవో స్థాయిలో ఆమోదించాలని ఆదేశించారు. ఆఖరున జాయింట్? కలెక్టర్? ఆమోదం కోసం దస్త్రాలను పంపాల్సిన అవసరం లేదని రెవెన్యూ శాఖ స్పష్టత ఇచ్చింది. ప్రభుత్వ భూముల రికార్డులను ఆమోదించే బాధ్యతను మాత్రమే జాయింట్? కలెక్టర్?కు అప్పగించారు.

సర్వే పూర్తయిన తర్వాత సర్వే- సరిహద్దుల చట్టం ప్రకారం 13 నోటిఫికేషన్? జారీచేసే బాధ్యతను జేసీకి అప్పగించారు. ముసాయిదా రికార్డును గ్రామసభలో చర్చించి ఆమోదించేందుకు 15 రోజుల వ్యవధి ఇచ్చారు. రైతుల నుంచి వచ్చే అభ్యంతరాలను వెంటనే పరిష్కరించాలి. ఆ తర్వాతే భూమి హక్కుల (ఆర్?వోఆర్?) తుది రికార్డును జిల్లా గెజిట్‌లోని ఫారం-4లో ప్రచురిస్తారు.

**వీఆర్వో, విలేజ్ సర్వేయర్లకు లాగిన్లు**

రీ-సర్వే నూతన విధివిధానాలు, మార్గదర్శకాల అమలు కోసం వెబ్?ల్యాండ్? 1.0లో ఆన్‌లైన్ లాగిన్‌లు వీఆర్వో, సర్వేయర్లకు ఇచ్చారు. గ్రామ సర్వేయర్‌కు ఇచ్చిన లాగిన్‌లో కొత్తగా రిమార్క్స్ అనే అంశాన్ని చేర్చారు. దీంతో పాటు మ్యుటేషన్? అవసరం, మ్యుటేషన్ అవసరం లేదు, సాదా బైనామా అవసరం అనే కాలమ్‌లను కూడా చేర్చారు. ఆయా అంశాలను వారు ప్రస్తావించే అవకాశం కల్పించారు.వీఆర్వోకు ఇచ్చిన లాగిన్ ద్వారా మ్యుటేషన్, కరెక్షన్? (భూమి రకం, స్వభావం), అక్షర దోషాల అంశాలను నివేదించే అవకాశం కల్పించారు.పట్టా భూమిని శ్మశానంగా మార్చారు

\- అంజనయ్య, ఆలూరు

ఆలూరు మండల కేంద్రంలో సర్వే నంబరు 535లో మాకు 2 ఎకరాల పట్టా భూవి మా పూర్వీకుల నుంచి సంక్రమించింది. శ్మశానవాటిక స్థలమని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

# పట్టణాలకు అమృత్ ఘడియలు

నంద్యాల : పట్టణాల్లో ఒక మనిషికి నిత్యం 135 లీటర్ల మేరకు ఇవ్వాలి.. వంద లీటర్లు ఇవ్వడం లేదు.. అది కూడా 60 శాతం మందికే అందుతోంది. ప్రస్తుత కొరత, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఇంటికి మంచినీళ్లు ఇచ్చేలా 'కూటమి' ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. 'అమృత?' 2.0 కింద ఉమ్మడి జిల్లాలో ఐదు మున్సిపాలిటీల పరిధిలో పనులు చేపట్టేందుకు గత నెలలో పిలిచిన టెండర్లకు ఆమోదముద్ర పడింది. మరికొద్ది రోజుల్లో ప్రారంభించేందుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. 2028లోగా పనులు పూర్తి చేసేలా గడువు విధించారు.

**వదిలేసిన గత వైకాపా ప్రభుత్వం**

వాస్తవానికి 2014-19లోనే ఆయా పనులు కొలిక్కి వచ్చాయి. ఏఐఐబీ నిధులకు రాష్ట్ర ప్రభుత్వం విధిగా తన వాటా మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఈ పనులకు ఏదో ఒక కొర్రీ పెడుతూ వచ్చింది. ఇదే సమయంలో మ్యాచింగ్? గ్రాంట్? ఇవ్వడంలోనూ నిర్లక్ష్యం చేసింది.

గత వైకాపా సర్కారు తన వాటా నిధులు ఇవ్వకపోవడంతో ఆరేళ్లుగా పనులు ఆగిపోయాయి. ఫలితంగా అంచనాలు భారీగా పెరిగిపోయాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అంచనాలు సవరించడంతోపాటు కొత్తగా ప్రణాళికలు రూపొందించింది. ఇప్పటి ధరలను పరిగణనలోకి తీసుకుని అంచనాలు సిద్ధం చేసింది. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో 30 శాతం వరకు అంచనాలు పెరగడం గమనార్హం.

**రూ. 683.76 కోట్లతో..**

కర్నూలు నగరపాలక సంస్థ, ఆదోని, నంద్యాల, డోన్, బేతంచెర్ల మున్సిపాలిటీల్లో మంచినీటి పనులకు రూ. 683.76 కోట్లు కేటాయించారు. ఏఐఐబీ (ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ఇన్వెస్ట్?మెంటు బ్యాంకు) నిధులు సమకూర్చనుంది. నిధులతో ఆయా మున్సిపాలిటీల్లో తాగునీటి పైపులైన్లు, ట్యాంకులు, నీటి నిల్వ, మురుగు నీటి శుద్ధి ప్లాంట్లు వంటి పనులు చేపట్టనున్నారు. ప్రజారోగ్య శాఖ ఆధ్వర్యంలో పనులు జరగనున్నాయి.

**కాల్వల నుంచి తరలించేలా**అమృత్? 2.0 కింద ఎంపిక చేసిన పట్టణాలకు సమీపంలోని సాగునీటి కాల్వల నుంచి తీసుకొచ్చేలా ప్రణాళిక రూపొందించారు. కర్నూలు నగరపాలక సంస్థకు హెచ్?ఎన్?ఎస్?ఎస్? (హంద్రీ) నుంచి, ఆదోని పట్టణానికి ఎల్లెల్సీ (తుంగభద్ర) నుంచి నీటిని తీసుకోనున్నారు. నంద్యాల పురపాలక సంఘానికి అవసరమైన నీటిని వెలుగోడు రిజర్వాయరు నుంచి, డోన్, బేతంచెర్ల మున్సిపాలిటీలకు గోరుకల్లు రిజర్వాయరు నుంచి తీసుకోనున్నారు. పైపులైన్ల ద్వారా నీటి నిల్వ కేంద్రాలకు తరలిస్తారు.

# వాట్సప్‌లో ఈ-చలానా!

కలకడ : ప్రభుత్వ సేవలన్నీ ఒక్క క్లిక్?తో చరవాణిలోనే పొందవచ్చు. దీని కోసం వాట్సప్? గవర్నెన్స్? అందుబాటులోకి వచ్చింది. తాజాగా పోలీసు సేవలనూ చేర్చారు. మీ వాహనంపై ఉన్న ఈ-చలాన్ల వివరాలూ తెలుసుకోవచ్చు. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లోనే చెల్లింపులూ చేయవచ్చు. వాట్సప్ సేవల కోసం ప్రభుత్వం 9552300 009 నంబరును అందుబాటులోకి తెచ్చింది. ముందుగా ఈ నంబరు ఫోన్‌లో సేవ్ చేసుకోవాలి. వాట్సాప్‌లో హాయ్ అని మేసేజ్ చేస్తే మన మిత్ర వాట్సప్ గవర్నెన్స్ వస్తుంది. టీఈ అని టైప్? చేస్తే తెలుగు భాషలోకి మారుతుంది. కింద భాగంలో ఉన్న సేవను ఎంచుకోండి ఆప్షన్‌ను క్లిక్ చేసి పోలీసు సేవలు ఎంపిక చేసుకుంటే... అందులో ఎఫ్ఐఆర్ స్థితి, ఈ-చలాన్? ఆప్షన్లు కనిపిస్తాయి. ఈ-చలాన్? ఎంచుకొని వాహనం నంబరు నమోదు చేసి క్లిక్? చేయాలి. మీ వాహనం రిజిస్ట్రేషన్? నంబరుపై ఉన్న ఈ-చలాన్?లు కనిపిస్తాయి. ఆ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనే చెల్లించి రసీదు పొందవచ్చు. ఒకవేళ చలాన్?లు లేకపోతే.. నో చలానాస్ ఫౌండ్ అని వస్తుంది.

**చెల్లింపులు ఇలా..**

నిబంధనలు ఉల్లంఘించిన వాహన చోదకులపై రవాణా శాఖ కూడా చలాన్‌లు విధిస్తోంది. వీటిని ప్రత్యేకంగా పరివాహన్? సేవ అనే వెబ్‌సైట్‌లో చూడొచ్చు. దీని కోసం http://parivahan.gov.in వెబ్‌సైట్ లోకి వెళ్లి ఈ-చలాన్ పేమెంట్‌ను క్లిక్ చేయండి. మీ వాహనం నంబరు నమోదు చేసి, క్లిక్ చేస్తే మీ వాహనంపై ఉన్న ఈ-చలాన్?లు వరుసగా కనిపిస్తాయి. ఇక్కడ రవాణా శాఖ చలాన్లతో పాటు పోలీసు శాఖ నమోదు చేసిన చలాన్లూ కనిపిస్తాయి. అక్కడ పేమెంట్? ఆప్షన్? కూడా ఉంటుంది. దాన్ని క్లిక్ చేసి ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు.

# బొప్పాయి.. గొప్పోయి

రైల్వేకోడూరు : బొప్పాయి పంట ఇక్కడి రైతులకు కాసులు కురిపిస్తోంది. మొదటి, రెండో, మూడో కోతల అనంతరం తోటల్లో మిగిలిపోయిన పచ్చికాయలను వ్యాపారులు కొనుగోలు చేసి పీలింగ్? (కాయలపై తొక్క తీసేసి, ఒప్పులుగా తరగడం) చేసి ఉప్పు నీటి తొట్టెల్లో వారం నుంచి పది రోజుల పాటు నానబెడతారు. బాగా ఊరిన అనంతరం వాటిని తమిళనాడు, మహారాష్ట్ర, బెంగళూరు, నాగపూర్, జైపూర్, అహ్మదాబాద్, కేరళ, జనగాం వంటి ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.




**ఆహార పదార్థాలుగా**

ఉప్పు నీటిలో నానబెట్టిన బొప్పాయి ఒప్పులను పరిశ్రమల్లో చిన్నచిన్న ముక్కలుగా తరిగి రంగులు, చక్కెరతో కలిపి చెర్రీ చిప్స్? తయారు చేస్తారు. ఐస్?క్రీంలు, బ్రెడ్డు, కేకులవంటి తినుబండారాలపై వాటిని వినియోగిస్తారు. ఇవి కిలో రూ.100 వరకు పలుకుతోంది. ప్రస్తుతం కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి పచ్చి కాయలను సేకరిస్తున్నట్లు వ్యాపారులు తెలిపారు.

**రోజుకు 30 లారీల ఎగుమతి** మండల పరిధిలోని శాంతినగర్, మైసూరువారిపల్లె, అనంతరాజుపేట ప్రాంతాల్లో బొప్పాయి పీలింగ్? పరిశ్రమలు ఉన్నాయి. ఈ సీజన్? జూన్, జులై నుంచి నాలుగు నెలలపాటు ఉంటుంది. ప్రతి రోజు సుమారు 30 లారీల సరకును ఎగుమతి చేస్తున్నారు. ఒక్కో లారీలో సరాసరి 30 టన్నుల సరకు నింపుతారు. ప్రస్తుతం టన్ను రూ.7,500 చొప్పున విక్రయిస్తున్నారు. రోజుకు సుమారు రూ.67 లక్షల వ్యాపారం జరుగుతుంది. నెలకు రూ.20 కోట్లకు పైగా వ్యాపారం నమోదవుతోంది.

# రోజూ పాతికవేల పైనే..

నక్కపల్లి : సంక్రాంతి పండగ నేపథ్యంలో చెన్నై-కోల్?కతా 16వ నంబరు జాతీయ రహదారిపై వాహనాల రద్దీ భారీగా పెరిగింది. సాధారణ రోజులను మించి గడిచిన పదకొండు రోజుల్లో రెండున్నర లక్షలకు పైగా కార్లు, బస్సులు, ఇతర భారీ వాహనాలు పరుగులు తీశాయి. పండగ సందర్భంగా దాదాపు పది రోజుల పాటు విశాఖ-విజయవాడ మార్గాల్లో రద్దీ కొనసాగింది. పాఠశాలలకు ముందునుంచే సెలవులు ఇవ్వడంతో ఈనెల తొమ్మిది నుంచే ప్రయాణాలు మొదలయ్యాయి. చాలామంది సొంత కార్లలో వెళ్లగా మిగిలిన వారు ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల్లో రాకపోకలు సాగించారు. ఈనెల 9 నుంచి 19 వరకు 11 రోజుల్లో దాదాపు




2.75 లక్షలకుపైగా వాహనాలు పరుగులు తీశాయి. తద్వారా రోజుకు సగటున 25వేల వాహనాలు రెండు మార్గాల్లోనూ వెళ్లాయి. దీనికి ఆటోలు, ద్విచక్ర వాహనాలు అదనం. వీటి సంఖ్య మరో నాలుగైదు వేల వరకు ఉంటుందని అంచనా. సాధారణ రోజుల్లో జాతీయ రహదారిపై రోజుకు సగటున 20 వేల వరకు వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ముఖ్యంగా 10, 11, 12, 13, 17, 18, 19 తేదీల్లో భారీ ఎత్తున రాకపోకలు జరిగాయి. ముందు జాగ్రత్తగా పోలీసులు తగు చర్యలు చేపట్టడంతో ట్రాఫిక్? ఇబ్బందులు, రోడ్డు ప్రమాదాలు తగ్గాయి. గతేడాది పండగ పది రోజుల్లో 2.3 లక్షలు వెళ్లగా, ఈసారి ఆ సంఖ్య భారీగా పెరిగింది.

# మృత్యు కూడళ్లు!



అనంతపురం: అతివేగం, చోదకుల నిర్లక్ష్యం, కొరవడిన అధికారుల పర్యవేక్షణ వెరసి జిల్లాలోని జాతీయ రహదారులపై మృత్యు ఘంటికలు మోగిస్తున్నాయి. ఉమ్మడి అనంత ప్రగతిలో ముఖ్య భూమిక పోషిస్తున్న రహదారులు రక్తసిక్తమవుతున్నాయి. ఎన్‌హెచ్-44, 67, 42, 544డీ మార్గాల్లో నిత్యం ఎక్కడో ఒక చోట దుర్ఘటనలు సంభవిస్తూనే ఉన్నాయి. ఈ మార్గాల్లో ఎక్కువగా ప్రమాదాలు జరిగే 34 బ్లాక్‌స్పాట్‌లను అధికారులు గుర్తించారు. బ్లాక్ స్పాట్లలో ప్రమాదాల నివారణకు అధికారుల ప్రతిపాదనలు కార్యరూపం దాల్చడం లేదు.

**నగర పరిధిలో అధికం..**

హైదరాబాద్?-బెంగళూరు జాతీయ రహదారిపై 14 బ్లాక్‌స్పాట్‌లను గుర్తించారు. అనంత నగర పరిధిలోని ఆయా ప్రాంతాల్లో గడిచిన మూడేళ్లలో 20 ప్రమాదాలు జరగ్గా 12 మంది మృత్యువాత పడ్డారు. కూడళ్ల వద్ద కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. సర్వీసు రోడ్ల నుంచి జాతీయ రహదారి పైకి వచ్చే క్రమంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. తపోవనం, గార్లదిన్నె, రాప్తాడు కూడళ్ల వద్ద అండర్‌పాస్‌లు నిర్మించాలనే డిమాండ్? చాలాకాలంగా ఉంది.

**ఇష్టారాజ్యంగా పార్కింగ్?**

గుంతకల్లు-తాడిపత్రి మార్గం (ఎన్‌హెచ్-67)లో సరకు రవాణా వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. గుత్తి నుంచి తాడిపత్రి మధ్యలో కూడళ్ల వద్ద లారీలను రోడ్డు పక్కనే నిలిపేస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సరైన సిగ్నల్ వ్యవస్థ, సూచిక బోర్డులు లేకపోవడంతో మూడేళ్లలో 24 ప్రమాదాలు జరగ్గా, 12 మంది చనిపోయారు.

చాలాచోట్ల సర్వీస్ రోడ్లు లేకపోవడంతో స్థానిక వాహనదారులు వ్యతిరేక దిశలో ప్రయాణం సాగిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. స్థానిక ఆటోలు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని.. నియంత్రించలేక ప్రమాదాలకు కారణమవుతున్నారు. పోలీసులు జాతీయ రహదారిపై నిబంధనలను అతిక్రమించినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. సంబంధిత అధికారులతోపాటు పోలీసులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**జాతీయ రహదారుల్లో గుర్తించిన బ్లాక్?స్పాట్?లు**

ఎన్‌హెచ్ 44 (హైదరాబాద్ - బెంగళూరు): డీమార్ట్, తపోవనం, శిల్పారామం, సోమలదొడ్డి, వడియంపేట, రాప్తాడు జంక్షన్, రామినేపల్లి, హంపాపురం, వన్నెదొడ్డి, పామిడి, రామరాజుపల్లి

ఎన్‌హెచ్ 42 (బళ్లారి-కదిరి): పాల్తూరు, ఉరవకొండ, చిన్నముష్టూరు, పంగల్‌రోడ్డు, ముదిగుబ్బ, పట్నం

ఎన్‌హెచ్ 67 (బళ్లారి-తాడిపత్రి): కొత్తపేట, టి.కొత్తపల్లి క్రాస్, వంగనూరు, అర్జాస్ స్టీల్‌ప్లాంట్, చుక్కలూరు, రాయలచెరువు

ఎన్‌హెచ్ 544డీ (అనంతపురం-తాడిపత్రి): ఎర్రగుంటపల్లి, వెంకటరెడ్డిపల్లి

# బకెట్ వేడినీళ్లు.. రూ.30



తిరుపతి : రుయా, ప్రసూతి ప్రభుత్వ ఆసుపత్రి, చిన్న పిల్లల విభాగాలలో వేడినీళ్ల సరఫరా లేక బాలింతలు, చిన్నారులు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు. చలి వణికిస్తుండటంతో వేడినీళ్లు తప్పనిసరి. కొన్నిచోట్ల పరికరాలు ఉన్నా నిర్వహణ లేక పని చేయడం లేదు. దీంతో బయట దుకాణాల వద్ద కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. పాల ధరకు సమానంగా వేడినీళ్లను విక్రయిస్తున్నారు.

**రోగుల నరకయాతన**

రోగులు చలికి నరకయాతన అనుభవిస్తున్నారు. రుయా పడకల సామర్థ్యం 1100. ఇక్కడ కేవలం 80 పడకల సామర్థ్యం ఉన్న పోస్ట్? ఆపరేటివ్? వార్డు, ఏ క్లాస్? గదుల వార్డుల్లోనే వేడినీళ్లు వస్తున్నాయి. చిన్నారులు, నవజాత శిశువులు, వృద్ధులు ఉండే వార్డుల్లో ఈ పరిస్థితి లేదు. మేల్? సర్జరీ వార్డులోని రెండు వాష్?రూమ్?లో గీజర్లు పనిచేయడం లేదు. క్షయ రోగులకు వేడినీళ్లు తప్పనిసరి.. అయినా అందడం లేదు. ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో లేబర్ రూమ్ మినహా మిగిలిన వార్డులో ఇదే పరిస్థితి.


**ఉన్నా నిరుపయోగం**

కరోనా సమయంలో రోగుల కోసం సుమారు 500 గీజర్లు ఏర్పాటు చేశారు. నిర్వహణ లేకపోవడంతో ప్రస్తుతం 100 మాత్రమే ఉన్నాయి. ఇందులోనూ కొన్ని పని చేయడం లేదు. మరికొన్ని పని చేస్తున్నా సకాలంలో ఆన్‌చేసి నీటిని పట్టుకోమని రోగులకు చెప్పే దిక్కులేదు. దీంతో పనిచేసేవీ నిరుపయోగంగా మారాయి. దీంతో బయట చిన్న బకెట్?కు రూ.30ల చొప్పున చెల్లించి వేడినీటిని కొనుగోలు చేస్తున్నారు. ఇదూ అదనుగా దుకాణదారులూ అడ్డగోలుగా దోచుకుంటున్నారు. బాటిల్ అయితే రూ.10లు తీసుకుంటున్నారు.

**బాధ్యులను నియమిస్తాం..-డాక్టర్ రాధ, సూపరింటెండెంట్, రుయా**

ఇటీవల పాడైన గీజర్లు, ఎలక్ట్రికల్ పరికరాలకు మరమ్మతులు చేయించాం. గీజర్ల ఆపరేటింగ్? వ్యవస్థ సరిలేనందున ఇబ్బందులు వస్తున్నాయి. త్వరలో బాధ్యులను నియమించి పర్యవేక్షిస్తాం.

# ప్రణాళికాబద్ధంగా.. ఎల్ఆర్ఎస్ పక్కదారి



తిరుపతి : నగరపాలికల్లో ప్రభుత్వ పథకాలు బుట్ట దాఖలవుతున్నాయి. తెరవెనుక కొందరు అధికారులు, సిబ్బంది ఇచ్చే అభయం అక్రమార్కులకు వరంగా మారుతుండగా ప్రభుత్వానికి పెద్దఎత్తున గండిపడుతోంది. తాజా ఎల్ఆర్ఎస్ అమలులో ఇదే జరుగుతోంది. మరో రెండురోజుల్లో గడువు ముగుస్తున్నా.. పెద్దగా స్పందన లేకపోవడం విమర్శలకు తావిస్తోంది.

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ(తుడా), నగరపాలిక పరిధిలో అనధికారిక లేఅవుట్లు కుప్పలుతెప్పలుగా ఉన్నాయి. ప్లాట్ల యజమానులు క్రమబద్ధీకరణకు సిద్ధంగా ఉన్నా.. తుడా ప్రణాళిక విభాగం సిబ్బంది నిబంధనల పేరుతో ఎల్ఆర్ఎస్ ఊసెత్తనీయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. విభాగం దిగువస్థాయి సిబ్బందిని సంప్రదించి మామూళ్ల గురించి స్పష్టత వచ్చాకే దరఖాస్తు సమర్పించాలనే షరతు విధిస్తున్నారు.

**ప్రచార ఊసేదీ?**ఎల్ఆర్ఎస్‌పై విస్తృత అవగాహన కల్పించాలని ప్రభుత్వం ఆదేశించినా.. ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో తుడా విఫలమైంది. తిరుపతి, శివారు మండలాలతోపాటు రేణిగుంట, శ్రీకాళహస్తి, నాయుడుపేట, గూడూరు, సూళ్లూరుపేట, పుత్తూరు, వడమాలపేట, వెంకటగిరి ప్రాంతాలు జాతీయ రహదారులను ఆనుకుని ఉండడం, పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతో అనధికారిక లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. రెవెన్యూ, తుడా, స్థానిక సంస్థలు ఏదశలోనూ వాటిని అడ్డుకున్న దాఖలాలు లేవు.

**అనేక లాభాలు ఉన్నా..**

ఎల్ఆర్ఎస్ తాజా నిబంధనల మేరకు 2025 జూన్? 30కి ముందు అనధికారిక లేఅవుట్లలో కొనుగోలు చేసి రిజిస్టర్? అయిన ప్లాట్లను ఈ పథకంలో క్రమబద్ధీకరించుకోవచ్చు. గతంలో ఉన్న 14 శాతం ఓపెన్? స్పేస్? ఛార్జీల్లో ఇప్పుడు 50 శాతం రాయితీ ఉంది. తద్వారా చట్టబద్ధమైన భవన నిర్మాణానికి అనుమతులు సులువుగా పొందొచ్చు. క్రయవిక్రయాలు, యాజమాన్య హక్కులకు సంబంధించి సమస్యలే ఉత్పన్నం కావు.

# కదిరి కథ.. వేమన చెబుతారు!

కదిరి : కదిరి, పరిసర ప్రాంతాలు అధ్యాత్మిక, పర్యాటక, సందర్శన స్థలాల గురించి వేమన చెబితే ఎలా ఉంటుంది.. ఇదెలా సాధ్యం అనిపిస్తోందా? ఏఐతో సాధ్యమే మరి. కదిరి పర్యాటక ప్రాంతమని తెలియజెప్పేందుకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్? కృషి చేస్తున్నారు. ఇందుకు అమెరికాలోని మిత్రుడు విశ్వనాథరెడ్డి ద్వారా ఏఐ యాప్?ను రూపొందింప జేశారు. దీని సాయంతో వేమన సాహిత్యంతోపాటు ఆధ్యాత్మిక కేంద్రమైన కదిరి, పరిసర యోగివేమన స్మారక కేంద్రం, తిమ్మమ్మమర్రిమానులపై ప్రచారానికి ఓ వాహనాన్ని ఎంచుకున్నారు. దీన్ని తిప్పేందుకు షెడ్యూల్? ప్రకటించాల్సి ఉంది. వాహనం 90 రోజులపాటు పాఠశాలలకు వెళ్తుంది. ఒకసారి 20మంది విద్యార్థులు 20 నిమిషాల నిడివితో కూడిన ఏఐ యోగివేమన చెప్పే కథను వినేలా రూపకల్పన చేశారు. ఇందులో ఏవైనా సందేహాలు వస్తే ఏఐ వేమన నివృత్తి చేస్తారు. త్వరలోనే వాహనాన్ని ప్రారంభించి అందుబాటులోకి తీసుకురానున్నారు. తిరుపతి దర్శనంతో వెనక్కు వెళ్లే తమిళనాడు ప్రజలను కదిరి వైపు తీసుకొచ్చేలా ప్రయోగాత్మకంగా చేయనున్నారు.

# పోయింది ప్రాభవం.. తేవాలి వైభవం

చిత్తూరు : గంగాధరనెల్లూరు మండలం మహదేవమంగళంలో 1962లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో 306 ఎకరాల్లో ఏర్పాటు చేసిన విత్తనాభివృద్ధి క్షేత్రం మూడు దశాబ్దాల క్రితం వచ్చిన కరవుతో తన ప్రాభావాన్ని కోల్పోయింది. ఒకప్పుడు లక్షలాది మందికి విత్తనాలు సరఫరా చేసిన ఈ కేంద్రం ప్రస్తుతం మూతపడింది. దీనికి పూర్వవైభవం తీసుకురావాల్సిన అవసరం ఉంది.

**20 రకాలకుపైగా విత్తనాలు**

ఇక్కడ ప్రధానంగా నాణ్యమైన విత్తనాల అభివృద్ధిపై పరిశోధనలు చేసేవారు. వరి, రాగి, కంది, పెసలు, జొన్నలు, సజ్జలు, వేరుసెనగ.. ఇలా 20 రకాలకుపైగా పంటలను క్షేత్రంలో పండించేవారు. కోతకు వచ్చిన తర్వాత ఎండబెట్టి గోదాములో నిల్వ చేసి సంచుల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లాలకు పంపిణీ చేసేవారు. తక్కువ ధరకే నాణ్యమైన విత్తనాలు లభిస్తుండటంతో అన్నదాతల నుంచి ఆదరణ లభించేది.

**కరవు వచ్చిందని బదిలీ చేసి**

ఈ క్షేత్రంలో మామిడి, టేకు, కొబ్బరి మొక్కలకు సంబంధించి నూతన వంగడాలను కూడా సృష్టించారు. 1990వ దశకంలో కరవు విలయ తాండవం చేసింది. దాంతో భూగర్భ జలమట్టం పడిపోయింది. 300 అడుగులకుపైగా బోర్లు వేసినా నీరు రాలేదు. దీన్ని సాకుగా చూపి ఉద్యోగులు, సిబ్బందిని వివిధ ప్రాంతాలకు బదిలీ చేశారు. అనంతరం పరిస్థితులు మెరుగుపడినా విత్తనాభివృద్ధి క్షేత్రంలో పరిశోధనల గురించి మరచిపోయారు. ఈ స్థలం నిరుపయోగంగా ఉందని 400 కేవీ విద్యుత్తు



ఉప కేంద్రానికి 60 ఎకరాలు కేటాయించారు. కొంతకాలం క్రితం పోలీసుల నివాస గృహాలకు మరికొంత స్థలం బదిలీ చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రస్తుతం క్షేత్రంలో వాచ్‌మెన్ ఒక్కరే ఉన్నారు. **తలమానికంగా ఇండో- ఇజ్రాయెల్ ప్రాజెక్టు**

మహదేవమంగళం తరహాలోనే కుప్పం మండలం పెద్దబంగారునత్తంలో ఉద్యాన రైతుల ఆదాయాన్ని పెంపొందించాలని ఇండో- ఇజ్రాయెల్? సాంకేతికతతో సెంటర్ ఆఫ్ఎక్సలెన్స్ (సీవోఈ) స్థాపించారు. 2019 జనవరిలో ప్రారంభమైన ఈ కేంద్రంలో పూలు, కూరగాయల మొక్కలకు అంటుకట్టి నాణ్యమైన మొక్కలను మన రాష్ట్రంతోపాటు తమిళనాడు, కర్ణాటకకు సరఫరా చేస్తున్నారు. వీటి ద్వారా అధిక దిగుబడులు వస్తున్నాయి. రాయితీపై మొక్కల పంపిణీ చేపడుతున్నా సీవోఈ లాభాల్లోనే నడుస్తోంది. మహదేవమంగళం క్షేత్రానికి పూర్వ వైభవం తీసుకువస్తే లక్షలాది మందికి ఉపయోగకరంగా ఉంటుంది.

# సులువుగా.. సొంతంగా.. లోతుగా

ఉరవకొండ : కృత్రిమ మేధ (ఏఐ)కు సంబంధించిన కోర్సులపై యువత ప్రత్యేక దృష్టి సారిస్తోంది. సాధారణ చదువులతోపాటు ఏఐపై శిక్షణ పొందడానికి ఆసక్తి చూపుతోంది. ప్రధాన మంత్రి ఉషా కార్యక్రమం కింద ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆయా విభాగాల్లో చదువుతున్న 164 మంది యువతులకు ఏఐ మీద గత నెలలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. మహిళా సాధికారిత నేపథ్యంలో అమ్మాయిలకు ఈ శిక్షణ నిర్వహించారు. గుంతకల్లులోని ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సహకారం అందించింది. ఇది ప్రిన్సిపల్? పర్యవేక్షణలో..కార్యక్రమ సమన్వయకర్తగా అధ్యాపకుడు డాక్టర్? అయ్యన్న, బృంద సమన్వయకర్తలుగా అధ్యాపకులు సుధాకర్, నాగేంద్ర, సీతారాంగుప్తా వ్యవహరించారు.

శిక్షణలో యువతులకు ఎక్స్ఎల్ఆర్ కంపెనీ ప్రతినిధులు జనరేటివ్ ఏఐ టూల్స్, ప్రాంప్ట్? ఇంజినీరింగ్?-హ్యాండ్స్?పై తర్ఫీదు ఇచ్చారు. వారు వెబ్?సైటు డిజైనింగ్, కాన్సెప్ట్, యాడింగు టు ప్రొఫైల్?తోపాటు తమకిష్టమైన సబ్జెక్టుల్లో లోతుగా అధ్యయనం చేయడం ఎలా అన్న అంశాలను నేర్పారు. పోటీ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ఏఐతో మాదిరి ప్రశ్నలను తయారు చేసుకోవడం, ప్రాజెక్టులను సిద్ధం చేసుకోవడంపై అవగాహన కల్పించారు. వారిలో సాంకేతిక నైపుణ్యాలు పెంపొందడానికి, భవిష్యత్తు ఉపాధి అవకాశాలను సిద్ధం కావడానికి దోహద పడింది. శిక్షణను సద్వినియోగం చేసుకున్న వారు సొంతంగా ఏఐను ఉపయోగించుకుంటున్నారు.

**వెబ్?సైట్ డిజైనింగ్?పై అవగాహన**



నేను ఏఐ శిక్షణలో భాగంగా వెబ్‌సైటు డిజైనింగ్?తోపాటు ప్రాజెక్టును రూపొందించుకోవడంపై అవగాహన పొందాను. ఏఐను ఉపయోగించి, ఏ అంశంలోనైనా తగిన కృత్రిమ జ్ఞానాన్ని అప్పటికప్పుడు పొందడానికి అవకాశం ఉందని తెలిసింది.

**బల్కిస్‌భాను, బీఏసీస కెమిస్ట్రీ**

కచ్చితమైన అంశంతోఏఐలో మనం రాణించాలంటే కచ్చితమైన భాషలో సముచితమైన ఇన్‌పుట్‌ను అందిస్తే దానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని రాబట్టుకోవడానికి అవకాశం ఉంది. అది శిక్షణలో నేర్చుకున్నాను. ఏఐలోని అంశాలన్నీ ప్రాంప్ట్ ఇంజినీరింగు ద్వారా తెలిశాయి. పవర్‌పాయింట్ ప్రజంటేషన్ మీద స్పష్టత వచ్చింది.

సాయిజోత్స్న, బీకాం

చురకలు




# 'దయా'లసిస్ చూపాలి

ఆళ్లగడ్డ : ఉయ్యాలవాడ మండలం మాయలూరుకు చెందిన ఓ వ్యక్తి మూత్రపిండాలు దెబ్బతిన్నాయి. డయాలసిస్ చేయించుకునేందుకు 108లో నంద్యాల వెళ్లేవారు. గతేడాది చివరి నుంచి సేవలు రద్దవడంతో ఇబ్బందులు పడుతున్నారు. తన భార్యను వెంట తీసుకెళ్లాల్సి వస్తోంది. మాయలూరు నుంచి కోవెలకుంట్లకు చేరుకుని 30 కి.మీ. దూరంలో ఉన్న నంద్యాల వెళ్లాల్సి వస్తోంది.

మూత్రపిండాల పనితీరు మందగించి డయాలసిస్ (రక్త శుద్ధి) చేసుకునే రోగులకు గతంలో 108 ద్వారా ఉచిత రవాణా సేవలందేవి. గతేడాది నవంబరు నుంచి బాధితులకు ఈ సేవలు అందడం లేదు. ఫలితంగా రోగులే వ్యయప్రయాసలకోర్చి డయాలసిస్ కేంద్రాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.

**పదుల సంఖ్యలో బాధితులు**



ఉమ్మడి కర్నూలు జిల్లాలో కర్నూలు సర్వజన ఆసుపత్రి, ఆదోని, నంద్యాల ప్రభుత్వ వైద్యాలయాల్లో డయాలసిస్ కేంద్రాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 108 వాహనాలు 54 వరకు ఉన్నాయి. ప్రతిరోజూ సుమారు 30 నుంచి 40 మంది బాధితులు రక్త శుద్ధి చేయించుకుంటుంటారు. 108 అందుబాటులో ఉంటే వాహనంలో ఆక్సిజన్ అందించి రోగికి సాంత్వన చేకూర్చి తీసుకెళ్తుంటారు. ప్రస్తుతం సేవలు ఆగిపోవడంతో రోగుల పరిస్థితి దయనీయంగా మారింది.

**ఇబ్బందులు తొలగించాలి**

ఉచిత ప్రయాణ సౌకర్యం ఆగిపోవడంతో రోగులు నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రభుత్వం బాధితులకు ప్రతి నెలా రూ.10 వేలు అందజేస్తోంది. ఇది మందులకే సరిపోతోంది. ఈ పరిస్థితుల్లో డయాలసిస్ కోసం జిల్లా ఆసుపత్రులకు వెళ్లడం కష్టంగా మారుతోంది. కూటమి ప్రభుత్వం స్పందించి 108 వాహనాలను బాధితులకు అందుబాటులోకి తీసుకొస్తే వారి ఇబ్బందులు తొలగుతాయి.

# కదిలే రైలును కమ్మేసిన నిప్పు

అనకాపల్లి : 'టాటా–ఎర్నాకుళం' ఎక్స్‌ప్రెస్‌లో అగ్నికీలలు రేగి రెండు బోగీలు దగ్ధమైన ఘటన సంచలనం కలిగించింది. ఈ రైలులోని బీ1, ఎం2 బోగీలకు నిప్పంటుకోవడం గమనించి హుటాహుటిన రైలులోని ప్రయాణికులందరినీ కిందకు దించేశారు. ఓపక్క వణికించే చలి.. మరోపక్క ఏం జరుగుతోందో.. ఎప్పటికి తిరిగి బయలుదేరతామో తెలియని అయోమయ పరిస్థితులతో ప్రయాణికులంతా బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. నష్టం మరింత పెరగకుండా నివారించడం, యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు అందించడంలో యంత్రాంగం సఫలమైంది. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే రైల్వే, అగ్నిమాపక, పోలీస్, రెవెన్యూ అధికారులు సకాలంలో స్పందించారు. విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ మోహిత్ సొనాకియా, ప్రత్యేక రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి, రైల్వే డీఐజీ బి.సత్యఏసుబాబు, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, కలెక్టర్ విజయ్‌కృష్ణన్ దగ్గరుండి సహాయక చర్యలు పర్యవేక్షించారు. అగ్నిమాపక సిబ్బంది ఆగమేఘాలపై తరలివచ్చారు. ఎలమంచిలి నుంచి శకటం వెనువెంటనే చేరుకుంది. దీనికితోడు అనకాపల్లి నుంచి రెండు, నక్కపల్లి నుంచి ఒకటి చొప్పున అగ్నిమాపక వాహనాలు రప్పించారు. వీరంతా దాదాపు రెండుగంటలపాటు నిర్విరామంగా శ్రమించి ఎట్టకేలకు మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

పోలీసులు : సుమారు రెండు వేలమంది ప్రయాణికులతో స్టేషన్ ఆవరణ కిక్కిరిసింది. స్థానిక సీఐ ధనుంజయరావు సహాయక చర్యలకు ఆటంకం లేకుండా ప్రయాణికులు అందరినీ బయటకు పంపించారు. ఎవరైనా గాయపడితే వెంటనే వైద్యసేవలందించేలా అంబులెన్స్‌లు రప్పించారు.

రైల్వే: రైలు నుంచి పూర్తిగా కాలిపోయిన బోగీలతోపాటు పాక్షికంగా కాలిపోయిన బోగీలను తప్పించారు. ఆ బోగీల్లో ప్రయాణికులను తరలించడానికి మూడు పల్లెవెలుగు బస్సులను రప్పించారు. అందులో వీరిని సామర్లకోట తరలించారు. మిగిలిన ప్రయాణికులను ఎక్కించుకుని రైలు బయలుదేరింది. ఇంత పెద్ద ప్రమాదం జరిగినా రైళ్ల రాకపోకలకు పెద్దగా ఆలస్యం కాకుండా పక్కట్రాక్‌పై నుంచి రాకపోకలు జరిగేలా ఏర్పాట్లు చేశారు. 3.20 గంటలకు తొలిగా తిరుపతి–బిలాస్‌పూర్ రైలు ఎలమంచిలి స్టేషన్‌కు చేరుకుని తిరిగి పయనమైంది.

**సమగ్ర విచారణ చేస్తున్నాం**

సత్య ఏసుబాబు, డీఐజీ, రైల్వే

ఎలమంచిలి స్టేషన్‌కు కొన్ని నిమిషాల్లో రైలు చేరుతుండగా.. సిబ్బంది మంటలను గుర్తించి స్టేషన్‌లో నిలుపుదల చేశారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలికి చేరుకుని ప్రమాదాన్ని తగ్గించారు. మంటలు చెలరేగడానికి కారణాలపై సమగ్ర విచారణ తర్వాత వివరాలు వెల్లడిస్తాం.

**టీటీఈ నిద్ర లేపారు**

సూర్యప్రకాష్, విశాఖపట్నం

సేలం వెళ్లడానికి దువ్వాడలో రైలు ఎక్కాను. రైలు అప్పటికే బాగా ఆలస్యంగా రావడంతో ఎక్కిన వెంటనే పడుకున్నాను. బి1 లో ప్రయాణిస్తున్న నన్ను టీటీ వచ్చి రైలు కాలిపోతోంది, అత్యవసరంగా దిగిపోవాలని చెప్పారు. అప్పటికే బోగీలో మంటలు పెద్దగా వస్తున్నాయి. తలదగ్గరపెట్టుకున్న హ్యాండ్ బ్యాగ్ మాత్రమే తీసుకుని సీటుకింద ఉన్న లగేజి వదిలేసి బయటకు పరుగు తీశాను. నావెనుక చాలామంది కంగారుగా దిగారు. చిన్నతొక్కిసలాట జరిగింది. టీటీఈ సకాలంలో లేపడంతో ప్రాణాలతో బయటపడ్డాం.

**కట్టుబట్టలే మిగిలాయి...**

మస్తగిరి బిస్వాజ్, టాటానగర్భార్య, ఇద్దరు పిల్లలతో టాటానగర్ నుంచి ఎర్నాకుళం బయలుదేరాం. అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయాం. దుస్తులు, డబ్బులు టికెట్లు అన్ని బ్యాగ్‌లో ఉన్నాయి. బోగీలో మంటలు వస్తున్నాయని కోచ్ బాయ్ కంగారుగా వచ్చి చెప్పాడు. ఇద్దరం చెరో బిడ్డను పట్టుకుని పరుగుపరుగున కిందికి దిగాం. తక్కువ సమయంలో మంటలు వ్యాపించాయి. కట్టుబట్టలు తప్ప ఏమీ మిగల్లేదు. చేతిలో రూపాయి లేదు. టికెట్లు, ఆధార్ కార్డులు, బ్యాగ్‌లో పెట్టిన ఫోన్ కాలిపోయాయి. భార్య బిడ్డలను స్టేషన్ బయట దించి మళ్లీ బోగీ వద్దకు వెళ్లాను. బ్యాగులు తెచ్చుకుందామని చూసినా బోగీ ఎక్కడుందో కనిపించనంత దట్టంగా పొగ వ్యాపించింది. ప్రాణాలు పోతాయని సాహసం చేయలేదు.

**అరుపులు విని లేచాను...** ఎస్.కె.రెహమాన్ ఎం1 బోగీలో ప్రయాణికుడు. పశ్చిమబెంగాల్లో ఉంటున్న నేను పాల్ఘాట్ వెళ్లడానికి ఈ రైలు ఎక్కాను. బయలుదేరిన దగ్గర నుంచే ఆలస్యంగా నడుస్తోంది. దువ్వాడలో భోజనంచేసి పడుకున్నాను. గాఢ నిద్రలో ఉండగా బోగీలో ఒక్కసారిగా అరుపులు, కేకలు వినిపించడంతో ఉలిక్కిపడి లేచాను. అప్పటికే ఒకవైపు నుంచి బోగీలో మంటలు వస్తున్నాయి. దట్టంగా ఉన్న పొగతో దిగడానికి కూడా దారి సరిగా కనిపించలేదు. చాలా ఇబ్బంది పడ్డాం. మరో పదినిమిషాలు లోపల ఉంటే అదోరకమైన వాసనతో వచ్చే ఆ పొగకి అక్కడే చనిపోయే వాళ్లం.

# మేమింతే... మారమంతే




తాడేపల్లిగూడెం : రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అవినీతి పెచ్చుమీరుతోందనడానికి ఈ ఉదంతాలే నిదర్శనం. జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై మూడేళ్లలో 357 ఫిర్యాదులు వచ్చాయంటే అక్రమార్కుల హవా ఏ స్థాయిలో ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మొగల్తూరు, ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సిబ్బందిపై చర్యలు తీసుకొని అనిశా సోదాలు చేస్తున్నా వసూళ్ల పర్వం ఆగడం లేదు. సమస్యలు పరిష్కారం కావడం లేదు.

**ఇదే అవకాశమని..** సామాన్యులకు ఇబ్బందులు లేకుండా వారసత్వ ఆస్తిని కుటుంబ సభ్యుల పేరిట నామమాత్రపు ఖర్చుతో రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కూటమి ప్రభుత్వం కల్పించింది. ఇదే అదనుగా కొందరు వసూళ్లకు తెరతీశారు. లేనిపోని కొర్రీలు సృష్టిస్తూ ఆస్తి విలువ ఆధారంగా ఒక్కో డాక్యుమెంటుకు రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారు.

**ప్రైవేటు వ్యక్తుల హవా**

తాడేపల్లిగూడెం, నరసాపురం, పెనుగొండ తదితర సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల్లో ప్రైవేటు వ్యక్తుల హవా కొనసాగుతోందని, చేతులు తడిపితే గానీ పనులు కావడం లేదనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. భీమవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఓ అధికారిపై పలు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఆస్తి విలువను బట్టి రిజిస్ట్రేషన్ విలువలో రెండు శాతం వరకు డిమాండ్ చేయడంతో పంచాయితీ ఎమ్మెల్యే వరకు వెళ్లింది. దీనిపై జిల్లా ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్ మాట్లాడుతూ రెండు రోజులకోసారి సబ్ రిజిస్ట్రార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నామని.. ఫిర్యాదులపై తక్షణం విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. లేఅవుట్ వేసిన 266.6 చదరపు గజాల మా స్థలాన్ని వేరొకరు వారి కుటుంబ సభ్యుల పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, న్యాయం చేయాలని 2022లో జిల్లా రిజిస్ట్రారు కార్యాలయంలో ఫిర్యాదు చేశాను. 2023లో మళ్లీ ఫిర్యాదు చేయగా పరిశీలిస్తున్నామన్నారు. ఇటీవల వెళ్లి అడగ్గా మీ దరఖాస్తు కనిపించడం లేదు, మళ్లీ ఫిర్యాదు చేయాలన్నారు.

జోగి నర్సింహులు, పాలకొల్లు

నా భార్య ఇటీవల కాలం చేసింది. ఆమె నుంచి సంక్రమించిన ఆస్తిని కుమార్తె, కుమారుడు పేరిట రాసేందుకు రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లగా రూ.35 వేలు వసూలు చేశారు.

కూనపురెడ్డి వీరవెంకట విజయరంగారావు, నరసాపురం

పెదకాకాని మండలం నంబూరు గ్రామంలో వేర్వేరు సర్వే నంబర్లలో 0.56 సెంట్లు, 0.49 1/2 సెంట్లు 45 ఏళ్లుగా అనుభవంలో ఉన్న వ్యవసాయ భూమిని నిబంధనలకు వ్యతిరేకంగా ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వేరొకరి పేరుమీద నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేశారు.

తమ్మా శివరామిరెడ్డి, గుంటూరు జిల్లా

# సాగు.. 'కాడి'న పడక



నంద్యాల : రబీ సీజన్‌లో పంటల సాగు అంతంత మాత్రంగానే ఉంది. మూడు నెలలవుతున్నా పురోగతి కానరావడం లేదు. తుంగభద్ర జలాశయం నుంచి నీరు వదలడం లేదని జలవనరుల శాఖ అధికారులు తేల్చి చెప్పడంతో కర్నూలు జిల్లా పరిధిలో పలువురు రైతులు వరి సాగుకు వెనుకడుగు వేస్తున్నారు. గతంలో రబీ సీజన్‌లో వేరుసెనగ విత్తన కాయలను రాయితీపై ఇచ్చేవారు.. ఈసారి ఇవ్వకపోవడంతో సాగుపై ప్రభావం చూపింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రబీలో 2.81 లక్షల హెక్టార్ల సాధారణ సాగు కాగా ఇప్పటివరకు 1.96 లక్షల హెక్టార్లలోనే వివిధ పంటలు సాగయ్యాయి. 83,315 హెక్టార్లలో రైతులు సాగు చేపట్టలేదు. ఖరీఫ్‌లో అతివృష్టి, అనావృష్టితో పంటలు దెబ్బతినడం.. పెట్టుబడులు పెరిగిపోవడం.. గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో 'కాడి' గాడిన పడలేదు.

**28,737 హెక్టార్లలో విత్తు పడక..**

రబీ పంట కాలం మరో నెలలో ముగియనుంది. వర్షాధారం కింద సాగుకు అవకాశం లేకుండా పోయింది.. ఉమ్మడి జిల్లాలో పప్పుశనగ ప్రధానంగా సాగవుతుంది. ఈ సీజన్‌లో కర్నూలులో 38,239, నంద్యాలలో 52,518 కలిపి మొత్తం 90,757 హెక్టార్లలోనే సాగైంది. 1.19 లక్షల హెక్టార్ల సాధారణ సాగు కాగా.. 28,737 హెక్టార్లలో విత్తు పడకపోవడం గమనార్హం.

గతంలో 1.70 లక్షల హెక్టార్లలో పప్పుశనగ సాగవగా.. ఈసారి దారుణంగా పడిపోవడం గమనార్హం.

**సాధారణంకన్నా పడిపోయి..**

రబీలో రెండో ప్రధాన పంట జొన్న. కర్నూలులో 4,017, నంద్యాలలో 27,534 హెక్టార్లలో కలిపి ఉమ్మడి జిల్లాలో 31,551 హెక్టార్లలో సాగవుతోంది. నంద్యాలలో 94 శాతం మేర సాగు చేయగా.. కర్నూలులో 41 శాతం మాత్రమే రైతులు పంట వేశారు.

వరి సాగు సైతం అంతంతమాత్రంగానే ఉంది. నంద్యాల జిల్లాలో 29,084 హెక్టార్ల సాధారణ సాగు కాగా కేవలం 10,891 హెక్టార్లలో మాత్రమే నాటారు. కర్నూలులో సాధారణ సాగు 4,314 హెక్టార్లకు గాను కేవలం 40 హెక్టార్లలో మాత్రమే సాగవుతోంది.

రబీ సీజన్‌లో రాయితీపై వేరుసెనగ విత్తనాలు ఇవ్వలేదు. ఈ ప్రభావం సాగుపై పడింది. కర్నూలులో 15,499 హెక్టార్లు సాధారణం కాగా.. బోరు బావుల కింద కేవలం 2,642 (17 శాతం), నంద్యాలలో 3,058 హెక్టార్లు సాధారణం కాగా కేవలం 1,455 హెక్టార్లలో మాత్రమే విత్తు పడింది.

**మొక్కజొన్నపై మక్కువ**

ఉమ్మడి జిల్లాలో మొక్కజొన్న సాగు అనూహ్యంగా పెరిగింది. సాధారణానికి మించడం విశేషం. ఉమ్మడి జిల్లాలో 18,590 హెక్టార్ల సాధారణ సాగుకు గాను కర్నూలు 7,426, నంద్యాల 22,936 కలిపి ఉమ్మడి జిల్లాలో 30,362 హెక్టార్లలో సాగవుతుండటం విశేషం. ఖరీఫ్‌లో గిట్టుబాటు ధరలు రాక పోయినా చాలామంది రైతులు రబీలో అత్యధికంగా సాగు చేయడం విశేషం.

# మర ఆడించి.. విలువ జోడించి



ఎమ్మిగనూరు : ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం అమ్మితే రైతులకు గిట్టుబాటు కావడం లేదు. అదే బియ్యంగా మార్చి విక్రయిస్తే అధిక ఆదాయం వస్తుంది. ఈ విధానంతో దళారుల బెడద, వ్యాపారుల మోసాల బారిన పడకుండా తప్పించుకోవచ్చు. దీనినే పలువురు రైతులు గత కొన్నేళ్లుగా అనుసరిస్తూ అదనపు ఆదాయం పొందుతున్నారు. కల్తీ లేని బియ్యం కొనేందుకు వినియోగదారులు సైతం అధిక ధర చెల్లించేందుకు వెనకాడటం లేదు. విలువ ఆధారిత ఉత్పత్తులతో అదనపు ఆదాయం లభిస్తోంది.

**దళారుల బెడద దూరం**

బియ్యంగా మార్చి విక్రయించడం ద్వారా దళారుల బెడద ఉండదు. తూకాల్లో మోసం, కొందరు వ్యాపారులు డబ్బు ఎగ్గొట్టడం వంటివి ఉండవు. పశ్చిమ ప్రాంతంలోని గుడేకల్, నదీ తీర ప్రాంతాలైన గురుజాల, నాగలదిన్నె, కాచాపురం తదితర గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు కొన్నేళ్లుగా ఈ విధానాన్ని అనుసరించి ఆదాయం పొందుతున్నారు.

**రూ.20 వేల అదనపు ఆదాయం**

ఈ ఏడాది అధిక వర్షాలతో ఎకరాకు 20 క్వింటాళ్ల వరి ధాన్యం వచ్చింది. క్వింటా రూ.2 వేల నుంచి రూ.2,100 వరకు పలుకుతోంది. ఈ లెక్కన రూ.42 వేలు వస్తుంది. మర ఆడిస్తే క్వింటాకు 68–70 కిలోల బియ్యం వస్తుంది. ఎకరాకు 14 క్వింటాళ్ల బియ్యం వస్తుంది. మార్కెట్లో క్వింటా రూ.4 వేలు అమ్ముడుపోతోంది. రైతులు నేరుగా అమ్ముతుండటంతో పలువురు క్వింటా రూ.500 అధిక ధర చెల్లించి తీసుకుంటున్నారు. మర ఆడించడంతో రూ.63 వేలు వస్తుంది. విలువ ఆధారిత ఉత్పత్తితో ఎకరాకు రూ.20 వేల వరకు అదనపు ఆదాయం పొందుతున్నారు. **ఐదేళ్లుగా అమ్ముతున్నా**

రెండు ఎకరాల్లో వరి సాగు చేయగా 60 బస్తాల దిగుబడి వచ్చింది. క్వింటా రూ.2,100కు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఐదేళ్లుగా మర ఆడించి అమ్ముతున్నా. వినియోగదారులు బియ్యం క్వింటాకు రూ.500 వరకు అధికంగా చెల్లించి తీసుకుంటున్నారు. యేసేపు, హాలహర్వి, నందవరం మండలం

# ఆచితూచి ఎంపిక.. నైపుణ్యాలే ప్రాతిపదిక..!

విశాఖపట్నం: జిల్లాలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రాంగణ నియామకాల సందడి మొదలైంది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యాలకే కంపెనీలు పెద్దపీట వేస్తున్నాయి. ఇంజినీరింగ్ చివరి ఏడాదిలో ఉండగానే విద్యార్థులను ఎంపిక చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రాంగణ నియామకాల సమయంలో విద్యార్థులు తమ నైపుణ్యాల గురించి కంపెనీల ప్రతినిధులకు తప్పని సరిగా వివరించాలని నిపుణులు చెబుతున్నారు.

**అన్నింటినీ ప్రస్తావిస్తేనే..:** విద్యార్థులు రెజ్యూమ్ తయారు చేసుకోవడంపై వివిధ కళాశాలల్లో శిక్షణ ఇస్తున్నారు. అందులో విద్యార్హత, చేపట్టిన ప్రాజెక్టులు, ఇతర నైపుణ్యాలను ప్రస్తావించాలి. నేర్చుకున్న అంశాలనే నిజాయతీగా అందులో పేర్కొనాలి. ఇంటర్వ్యూ సమయంలో ఆయా అంశాల గురించి కంపెనీ ప్రతినిధులు అడిగినప్పుడు తడబడకుండా సమాధానం చెప్పగలగాలి.

**ప్రారంభం నుంచే దృష్టి పెట్టాలి**

విద్యార్థులు మొదటి ఏడాది నుంచే వర్క్‌షాప్‌లకు హాజరుకావాలి. సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు పెంచుకుంటే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. లేకుంటే

ప్రశ్నలు అడిగినప్పుడు తడబడే అవకాశముంది.

కొన్ని కళాశాలలు పాఠ్య ప్రణాళికలో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ తప్పనిసరి చేశాయి. పరిశ్రమల్లో పనిచేసే సమయంలో కోడింగ్, ఇతర అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

కొన్ని కళాశాలల్లో అధ్యాపకులు, పూర్వ విద్యార్థుల సహకారంతో 3–2, 4–1 సెమిస్టర్లలో మాక్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. ఒక్కో విద్యార్థికి 10 నుంచి 15 నిమిషాలు కేటాయించి ప్రశ్నలు అడుగుతున్నారు. చెప్పిన సమాధానాలు పరిశీలించి, విద్యార్థులు చేసిన



పొరపాట్లు, సరిదిద్దుకోవాల్సిన అంశాలను వివరిస్తున్నారు.

ఇంటర్వ్యూలో మార్కులు ఒక్కటే ప్రాతిపదిక కాదు. నైపుణ్యాలు, సాఫ్ట్‌స్కిల్స్, ఇతర అంశాలనూ పరిశీలిస్తారు. ఇంటర్వ్యూలో కొంతైనా ఇంగ్లిషులో మాట్లాడాలి. మొదటి ఏడాది నుంచే ఇంగ్లిషులో మాట్లాడటం సాధన చేస్తే కమ్యూనికేషన్ నైపుణ్యాలు పెరుగుతాయి. ఇంటర్వ్యూకు వెళ్లేటప్పుడు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి.

జిల్లాలో ఇంజినీరింగ్ కళాశాలలు: 22

ఏటా ఉత్తీర్ణులయ్యే విద్యార్థులు: 20 వేలకు పైగా..

ఏదో ఒక నైపుణ్యం అవసరం: మాక్ ఇంటర్వ్యూలతో విద్యార్థుల్లో మార్పు కనిపిస్తోంది. ఆత్మవిశ్వాసం పెరగడానికి ఇంటర్న్‌షిప్స్ ఉపయోగపడతాయి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు పోటీ ఎక్కువైంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఏదో ఒక నైపుణ్యం సాధించాలి. ప్రస్తుతం ఆన్‌లైన్ చదువులు పెరిగాయి. ఆన్‌లైన్‌లో చదివినప్పుడు బట్టీ పట్టకుండా సబ్జెక్టును అర్థం చేసుకోవాలి.

డి.సరిత, జీవీపీ కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగ డీన్

# కావాలి.. రూ.58 కోట్లు!

నర్సీపట్నం : సాగునీటి వనరులన్నీ సక్రమంగా ఉంటే పొలాలకు సమృద్ధిగా నీరు అందుతుంది. తద్వారా పంట దిగుబడులు పెరుగుతాయి. అవి మరమ్మతులకు గురై ఏళ్ల తరబడి శాశ్వత మరమ్మతుకు నోచుకోకపోతే ఎప్పుడు గండిపడుతుందో... పొలాలను ముంచెత్తి ఎక్కడ నష్టపోతామని రైతులు బెంగ పడుతుంటారు. వ్యవసాయం ప్రాధాన్యాంశంగా సకాలంలో నిధుల విడుదల చేస్తేనే ఆయకట్టుకు మేలు జరుగుతుంది. జలవనరులశాఖ నర్సీపట్నం డివిజన్‌లోని నాలుగు నియోజకవర్గాల్లో చెరువులు, ఆనకట్టలు, కాలువలు, జలాశయాల కింద 1,23,676 ఎకరాల ఆయకట్టు ఉంది. మొంథా తుపాను సమయంలో సాగునీటి కట్టడాలు పలుచోట్ల దెబ్బతిన్నాయి. కాలువలకు గండ్లు పడ్డాయి. మొత్తంగా మరమ్మతులకు రూ.58 కోట్లు అవసరమని అంచనా.

ఇవిగో ఉదాహరణలు..

నర్సీపట్నం నియోజకవర్గం గొలుగొండ మండలంలోని రావణాపల్లి జలాశయం ప్రధాన గట్టు నాలుగు నెలల క్రితం రెండు అడుగుల మేర కుంగిపోయింది. తాత్కాలికంగా ఇసుకబస్తాలు వేసి నీటి లేకుండా చుశారు. శాశ్వత మరమ్మతుకు రూ.2.20 కోట్లు అవసరం. గట్టు పటిష్ఠ పర్చకపోతే గండి పడే ప్రమాదం ఉంది. ఏడాదిన్నర క్రితం రావణాపల్లి మదుం కోతకు గురైంది. ఇప్పటికీ ఇసుక బస్తాలే దిక్కు.

మాకవరపాలెం మండలంలో జాగారం గెడ్డకు గండిపడి పొలాలు ముంపునకు గురయ్యాయి. రక్షణ గోడకు రూ.40 లక్షలు అవసరం.

ఎలమంచిలి నియోజకవర్గం రాంబిల్లి మండలం రజాల గ్రామం సమీపంలో శారదానది కుడి వరదగట్టు అక్టోబరు నెలాఖరులో 140 మీటర్ల మేర కొట్టుకుపోయింది. వ్యవసాయ భూములు మునిగిపోయాయి. చేపల చెరువులకు నష్టం జరిగింది. శాశ్వత మరమ్మతులకు రూ. 2 కోట్లు అవసరమని అంచనా. ఇదే మండలం కొత్తూరు వద్ద ఏడుముళ్ల డ్యాం ఎగువ భాగంలో శారదానది కుడిగట్టు 120మీటర్ల మేర దెబ్బతింది. మరమ్మతుకు రూ. 1.6 కోట్లు అవసరమని అంచనా వేశారు.

చోడవరం నియోజకవర్గం రావికమతం మండలం చీమలపాడు వద్ద అక్విడక్ట్ రాతికట్టు జారిపోయింది. మరమ్మతుకు రూ.30 లక్షలు కావాలి.

పాయకరావుపేట నియోజకవర్గంలో ముతా ఆనకట్ట, భూమి ఆనకట్ట గేట్లు పనిచేయడం లేదు. ఎస్.రాయవరం మండలం సోముదేవుపల్లి వద్ద వరాహ నది గట్టు 200 మీటర్లు కోతకు గురైంది. మరమ్మతుకు రూ.10 కోట్లు కావాలి. ప్రతిపాదన దస్త్రం ఆర్థికశాఖ అనుమతి కోసం చూస్తోంది.

నాణ్యంగా పనులు... ఏప్రిల్ మొదటి వారంలో నిధులిస్తే పనులన్నీ నాణ్యతగా చేయడానికి వీలుంటుంది. రానున్న ఖరీఫ్ పంట కాలానికి సాగునీటి వనరులన్నీ సిద్ధం చేసుకోవచ్చు. తాండవ ప్రాజెక్టు కాలువలకు అత్యవసరంగా రూ.12 కోట్లు అవసరం. ఈ విషయం సభాపతి అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకువెళ్లాం.

కరక సత్యనారాయణ, తాండవ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్

నిధుల కోసం నివేదిక పంపాం.. క్షేత్ర పరిశీలన చేసి 261 చోట్ల శాశ్వత మరమ్మతులు అవసరమని గుర్తించాం. ఇందుకోసం రూ.58 కోట్లు ఖర్చవుతాయని అంచనా వేశాం. నవంబరులో ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారుల ఆమోదానికి పంపాం. నిధులు విడుదల కాగానే పనులు చేపడతాం. వచ్చే ఏడాది ఖరీఫ్‌కి ఆయకట్టుకు ఇబ్బంది లేకుండా చూడాలన్నదే ఆశయం.

వెలమల బాలసూర్యం, ఈఈ, జలవనరులశాఖ

## సహనం వహించు.. ప్రశాంతంగా స్వామిని దర్శించు..!

సింహాచలం : ముక్కోటి ఏకాదశికి సింహాచలం క్షేత్రంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణం, ధ్వజస్తంభం, ఉత్తర గోపురం, ఉత్తర ద్వారాలకు పుష్పాలంకరణ చేశారు. ఉత్తర ద్వార దర్శనానికి వేలాది మంది భక్తులు రానుండటంతో పటిష్ఠ ఏర్పాట్లు చేసినట్లు అధికార యంత్రాంగం చెబుతోంది. ఇటీవల సింహాచలం ఆలయం రద్దీగా మారుతోంది. ఈ నేపథ్యంలో క్యూలైన్లలో తోపులాటలు, రద్దీకి ఆస్కారం లేకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి దర్శనాలు కల్పించేలా చూడాలని నిపుణులు చెబుతున్నారు.

ఉత్తర ద్వార దర్శనానికి కేవలం ఆన్‌లైన్‌లో టికెట్లు కొనుగోలు చేసిన భక్తులను మాత్రమే అనుమతిస్తున్నారు. టికెట్లు దొరకని వారి పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉచిత క్యూలైన్‌లో, ఉచిత ప్రసాదం పంపిణీ వద్ద, ప్రసాదం పంపిణీ కేంద్రాల వద్ద రద్దీ పెరిగే అవకాశం ఉంది. గత ఘటనలను దృష్టిలో పెట్టుకుని తగినంత సిబ్బందిని ఏర్పాటు చేసి తోపులాటలు జరగకుండా చర్యలు తీసుకోవాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పోలీసు సిబ్బంది పరిమితంగా ఉండటంతో సెక్యూరిటీ గార్డులు, సిబ్బందిని సమకూర్చాలని ఇప్పటికే



పోలీసులు కోరారు.


**భక్తులు సహనంతో ఉండాలి..:** ఉత్తర ద్వార దర్శనానికి వచ్చే భక్తులు సహనం, సమన్వయంతో ఉండాలని పోలీసులు, ఆలయ అధికారులు కోరుతున్నారు. మెరుగైన దర్శనం కల్పించడానికి ఏర్పాట్లు చేశామని తోపులాటలు, తగాదాలకు తావు లేకుండా ప్రశాంతంగా ఉండాలని సూచించారు. ఇబ్బందులు ఎదురైతే సమీపంలోని సిబ్బందికి తెలియజేస్తే వెంటనే పరిష్కరిస్తారని పేర్కొన్నారు.

**ట్రాఫిక్ నియంత్రణే కీలకం**

సింహగిరిపై తగినంత పార్కింగ్ స్థలం లేకపోవడంతో వాహనాల రద్దీ భక్తులను ఇబ్బంది పెడుతోంది. ఉత్తర ద్వార దర్శనం వేళ వేలాదిగా వాహనాలు వస్తాయి. దీనికి తోడు ప్రముఖుల తాకిడి ఉంటుంది. ఈ నేపథ్యంలో కొండపైకి వాహనాల రాకపోకలు, పార్కింగ్ సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉంది. భక్తుల కోసం కొండ కింద నుంచి పైకి 20 ఆర్టీసీ బస్సులను నడపనున్నట్లు సింహాచలం డిపో మేనేజర్ శరత్‌బాబు తెలిపారు.

## అతి త్వరలో ఆరంభం

అనకాపల్లి : అడ్డురోడ్డు కూడలిని రెవెన్యూ డివిజన్‌గా ప్రభుత్వం ఖరారు చేయడంతో నూతన ఏడాది ఆరంభం నుంచే పరిపాలన మొదలు పెట్టేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన జిల్లాల, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు, మార్పుచేర్పులకు సంబంధించి అమరావతిలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో తుది ఆమోదం లభించడంతో నక్కపల్లి స్థానే అడ్డురోడ్డును రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఖరారు చేశారు. ఈ మేరకు కొత్త సంవత్సరం నుంచే పరిపాలన మొదలు పెట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. దీనిలో భాగంగా ఆర్డీఓ పరిపాలన కోసం మంత్రి అనిత ఆదేశాలతో అడ్డురోడ్డు మార్కెట్ సమీపంలోని పంచాయతీ కార్యాలయం, రైతు సేవా కేంద్రాలను అధికారులు, కూటమి నాయకులు పరిశీలించారు.



ప్రస్తుతం ఇక్కడ మాత్రమే ప్రభుత్వ భవనాలు ఉన్నాయి. డివిజన్ ఏర్పాటు చేసి, తర్వాత సొంత భవన నిర్మాణం చేపట్టనున్నారు. ప్రస్తుతం తహసీల్దారు కార్యాలయం మండల కేంద్రమైన ఎస్.రాయవరంలో ఉంది. ఈ రెండింటికి మధ్య పది కిలోమీటర్ల దూరం ఉంటుంది. భవిష్యత్తులో దీన్ని ఆర్‌డీఓ కార్యాలయం వద్దకే తీసుకువచ్చేలా చూస్తే ప్రజలకు రాకపోకల భారం తగ్గనుంది. ఇక్కడ రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై ఈ ప్రాంత వాసుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. నిత్యం వివిధ వ్యాపారాలతో నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఎంతో కీలకమైన ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటవుతుండటంతో అడ్డురోడ్డుతో పాటు చుట్టు పక్కల గ్రామాలు అభివృద్ధి చెందుతాయని భావిస్తున్నారు. ప్రస్తుతం కార్యాలయం ఏర్పాటుతో తాత్కాలికంగా నర్సీపట్నం ఆర్డీఓనే ఇన్‌ఛార్జిగా కొనసాగిస్తారా? మరెవరికైనా బాధ్యతలు అప్పగిస్తారానేది తెలియాల్సి ఉంది.

## పేరుకే.. అత్యవసర విభాగం!

అనంతపురం : ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని అత్యవసర విభాగంలో పడకల ఏర్పాటు కలగా మారింది. నాలుగు నెలల కిందట రూ.8 లక్షలు వెచ్చించి విస్తరణ పనులు చేపట్టిన అధికారులు ఇప్పటి వరకు ఆదిశగా ఆలోచించిన పాపానపోలేదు. విస్తరణ పనుల్లోనూ వైద్యులు, సిబ్బంది ఉండేందుకు అవసరమయ్యే క్యాబిన్లు ఏర్పాటు చేశారు. తర్వాత ఎనిమిది పడకలు పట్టేందుకు మాత్రమే ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉంది.రోగుల సేవలపై ప్రభావం ఉమ్మడి అనంతపురం జిల్లాల నుంచి తీవ్ర అనారోగ్య సమస్యలతో, ప్రమాదాల్లో గాయపడి, ఇతరత్రా అత్యవసరం పరిస్థితుల్లో వస్తే ప్రాణాలు పోయే పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు ఇంత ప్రాధాన్యం ఉన్న విభాగంలో ప్రస్తుతం మూడు వెంటిలేటర్లు, 14 ఆక్సిజన్, మూడు సాధారణ పడకలు ఉన్నాయి. రోజూ సాయంత్రం నాలుగు గంటల నుంచి తెల్లవారు జాము వరకూ 200 మందికి పైగా ఓపీ సేవలు పొందుతుంటారు. పడకలు లేక ఒకే పడకపై ఇద్దర్ని ఉంచి సేవలందిస్తున్నారు. ఇలాంటి పరిస్థితులపై వరుస కథనాలు ఇవ్వడంతో ఉన్నతాధికారులు విస్తరణ పనులు చేపట్టేందుకు నిధులు కేటాయించి అనుమతి ఇచ్చారు. కొరవడిన అధికారుల సమన్వయంక్షేత్రస్థాయిలో కొంతమంది అధికారుల మధ్య సమన్వయం లేకపోవటంతో కేవలం విభాగాలను ఏర్పాటు చేసి వదిలేశారు.

# ఉద్యానవనమాయ



ఆదోని : పుర అధికారుల పర్యవేక్షణాలోపంతో గడువు తీరినా.. నేటికీ డంపింగ్ యార్డుల్లో చెత్తకుప్పలు తొలగలేదు. గుట్టలుగా పేరుకుపోయాయి. అనుకున్న లక్ష్యం నెరవేరకపోవడంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లడంతో పాటు ప్రజారోగ్యంపై ప్రభావం చూపనుంది. మరోసారి టెండర్లు పిలిచి, చెత్త శుద్ధి పనులు అప్పగించాలని నిర్ణయించారు. దీంతో వ్యర్థాల కుప్పలు లెక్కకట్టే పనులు ఆరంభించారు. నిధుల సమస్యలు అధిగమించేందుకు ప్రత్యేక ఆర్థిక సంఘం నిధులు వినియోగించుకోవాలని భావిస్తున్నారు.

**టన్ను చెత్తశుద్ధికి రూ.900**

గత ప్రభుత్వం వైకాపా హయాంలో మున్సిపాలిటీల్లో తట్టెడు చెత్త శుద్ధి చేయలేదు. 'కూటమి' ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రత్యేక దృష్టి సారించింది. తొలగింపు బాధ్యతలు సౌరాష్ట్ర కంపెనీకి అప్పగించారు. టన్ను చెత్తశుద్ధికి రూ.800–900 చెల్లించేలా ఒప్పందం చేసుకొన్నారు. ఈ ఏడాది జులై నుంచి శ్రీకారం చుట్టారు. ప్రజారోగ్య విభాగం పర్యవేక్షణ చేపట్టాల్సి ఉంది.ఆదోని పట్టణంలో పదివేల టన్నుల చెత్తశుద్ధి పనులు సౌరాష్ట్ర కంపెనీకి అప్పగించారు. ఎమ్మిగనూరులో 40 వేలు, డోన్‌లో 50 వేలు, నంద్యాలలో 80 వేల టన్నుల చెత్తను శుద్ధి చేశారు. నంద్యాలలో శుద్ధి చేసిన దాంట్లో ఇంకా 30 వేల టన్నులు తరలించాల్సి ఉంది.

అన్ని పురపాలికలు ఒకే కంపెనీకి పనులు అప్పగించడం, దీంతో శుద్ధి అనంతరం వచ్చేవి మండే స్వభావం కలిగినవి పరిశ్రమలకు కుప్పలు, తెప్పలుగా చేరుకుంటున్నాయి. దీంతో అక్కడి పరిశ్రమల్లో స్థలం లేక ఖాళీ అయ్యే వరకు పంపొద్దని సూచిస్తున్నారు.

**వాతావరణ కాలుష్యం**

పట్టణాలు, నగరాలకు డంపింగ్ యార్డులు దగ్గరగా ఉండటంతో.. భూ, వాయు, జల కాలుష్యం ఏర్పడుతోంది. ఏళ్లుగా శుద్ధి పనులు చేయక, చెత్తను నిల్వ చేయడంతో వర్షానికి తడిసి, ఎండకు ఎండి.. భూమిలో పది మీటర్ల లోతులో కలిసిపోయాయి.

యంత్రాంగం సరైన లెక్కలు వేయకపోవడం, తవ్వే కొద్దీ గుట్టలుగా చెత్త బయటకు వస్తోంది. ఇక్కడ పచ్చదనం పెంచాలంటే కనీసం పది మీటర్లు మేర మట్టిని తొలగించి, కొత్త మట్టి తెచ్చి పోస్తే.. తప్ప ఉద్యానవనాలుగా మారే పరిస్థితి లేదు. ప్రస్తుతం ఆదోనిలో 45 వేలు, ఎమ్మిగనూరులో 60 వేలు, డోన్‌లో 30 వేలు, నంద్యాలలో 30 వేలు టన్నులకు పైగా వ్యర్థాలు పోగయ్యాయి.

# లీకులు చూడరు.. లాకులు వేయరు



నంద్యాల : రబీ వచ్చేసింది.. ఈ సీజన్లో ప్రతి నీటి చుక్కను ఎంతో జాగ్రత్తగా వాడుకోవాలి.. ఉమ్మడి జిల్లాలో ఐదు లక్షల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాల్సి ఉంటుంది. సాగు నీటి వినియోగంపై లస్కర్ల పాత్ర కీలకం.. కాల్వల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క, చెత్తను తొలగించడం లేదు.. డిస్ట్రిబ్యూటర్ల నిర్వహణను పట్టించుకోవడం లేదు. నీటి యాజమాన్య పద్ధతులు అత్యవసరం. లస్కర్ల పర్యవేక్షణ లేకపోవడం ప్రతిబంధకంగా మారింది.

**ఏం చేయాలి.. ఏం చేస్తున్నారు**

ప్రతి 1,200 ఎకరాలకు సాగునీటి సరఫరాకు లేదా 12 కి.మీ.ల పొడవునా కాల్వ నిర్వహణకు ఒక లస్కర్ తప్పనిసరిగా ఉండాలి. వీరంతా తమ పరిధిలో రెగ్యులేటర్ నియంత్రణను పర్యవేక్షిస్తూ ఉండాలి. ప్రధాన కాల్వలు, గేట్ల నిర్వహణను లస్కర్లు చూసుకోవాల్సి ఉంది. గేట్లు ఎత్తి దించేందుకు వీలుగా గ్రీజింగ్ చేయాలి. షట్టర్లను పర్యవేక్షిస్తూ లోపాలుంటే ఉన్నతాధికారులకు సమాచారమివ్వాలి. కాలువల లోపలి భాగంలో, గట్లపై ముళ్లపొదలు, కంప చెట్లు పెరగకుండా చూసుకోవాలి. రెండు జిల్లాల్లో ఏ ప్రాజెక్టుల పరిధిలోనూ లస్కర్లు విధులు సక్రమంగా నిర్వహించడం లేదు.

**దస్త్రంలోనే హాజరు**

కేసీ, ఎల్లెల్సీ, ఎస్సార్బీసీ, హెచ్ఎన్ఎస్ఎస్ తదితర కాల్వల పరిధిలో 492 మంది లస్కర్లు పనిచేస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది శ్రీశైలం రిజర్వాయరు ముంపు బాధితులే ఎక్కువగా ఉన్నారు. వీరికి నెలకు రూ.20 వేల గౌరవ వేతనం ఇస్తున్నారు. ప్రతి నెలా రూ.1950 కోత విధిస్తున్నారు.

జిల్లాకు చెందిన చాలా మందిని వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరు, దువ్వూరు, కడప ప్రాంతాల్లో నియమించారు. వీరికి వచ్చే రూ.20 వేల వేతనంతో ఆ ప్రాంతాలకు వెళ్లలేక జిల్లాలోనే ఉంటూ వ్యవహారం నడిపిస్తున్నారు.

ఎక్కడుంటారో తెలియదు

కేసీ కాల్వ పరిధిలో 240 మంది, ఎల్లెల్సీలో 116 మంది లస్కర్లు విధుల్లో ఉన్నట్లు దస్త్రాలు చెబుతున్నాయి. వీరిలో చాలా మంది జిల్లాలోనే లేరు. ఇతర ప్రాంతాల్లో మరో ఉద్యోగం చేస్తున్నారు.

ఎల్లెల్సీ కింద కోడుమూరు సబ్ డివిజన్‌లో 64 మంది, ఆదోనిలో 13, ఆదోని–2లో 13, ఎమ్మిగనూరులో 17, జీడీపీ సబ్ డివిజన్‌లో 9 మంది పనిచేస్తున్నట్లు దస్త్రాల్లో ఉండగా వీరిలో 40 శాతం మంది కూడా విధుల్లో లేరు.

కేసీ కాల్వ పరిధిలోని 240 మందిలో కర్నూలు సబ్ డివిజన్ పరిధిలో ఆరుగురు, నంద్యాలలో 42 మంది, ఆళ్లగడ్డలో 21 మంది, వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరు సబ్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న 23 మంది ఏళ్లుగా విధులకు రావడం లేదు.

హెచ్ఎన్ఎస్ఎస్‌లో పనిచేస్తున్న 45 మంది, ఎస్సార్బీసీలో పనిచేస్తున్న 41 మంది కనీసం అటువైపు చూడటం లేదు.

శ్రీశైలం ముంపు బాధితులనే ఎల్లెల్సీలో కింద తుంగభద్ర ప్రాజెక్టు వివిధ సబ్ డివిజన్లలోని ఆదోని, ఎమ్మిగనూరు తదితర ప్రాంతాల్లో నియమించారు. అంతదూరం వెళ్లలేక 'ఒప్పందం' చేసుకుంటున్నారు.

# 'ఓపి'క నశిస్తోంది!

పుట్టపర్తి: జిల్లాలో చలితీవ్రత పెరుగుతుండటంతో ఆసుపత్రులకు రోగుల రద్దీ పెరుగుతోంది. కొన్నిచోట్ల అందుకనుగుణంగా సౌకర్యాలు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.జిల్లాలోని కదిరి, మడకశిర, ధర్మవరం ప్రాంతీయ ఆసుపత్రులు, హిందూపురం జిల్లా ఆసుపత్రిని బృందం పరిశీలించింది. హిందూపురం ఆసుపత్రి మినహా మిగిలినచోట్ల వివిధ సమస్యలతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

వేచి ఉండలేక..కేంద్రం: ధర్మవరం ఏరియా ఆసుపత్రి

వచ్చిన రోగులు: 1,150 మంది

ధర్మవరం ఏరియా ఆసుపత్రిలో రోజూ 800 మందికి పైగా ఔట్ పేషెంట్లు వస్తుంటారు. సోమవారం ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ ఓపీ చీటీలు ఒక్కచోటే రాస్తుండటంతో ఒక్కో రోగికి 30 నుంచి 40 నిమిషాలు పడుతోంది. వైద్యుల వద్ద కూడా మరో 40 నిమిషాల వరకు పడుతోంది. దీంతో రోగులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఓపీ చీటీలు రాసే కేంద్రాల సంఖ్య పెంచాల్సి ఉంది.

పరీక్షలకు అవస్థలు

కేంద్రం: కదిరి ఏరియా ఆసుపత్రి

వచ్చిన రోగులు: 499

జ్వరాలు, జలుబు, దగ్గుతో రోగులు ఆసుపత్రికి వచ్చారు. వైద్యుల హాజరు పర్వాలేదు. రక్త పరీక్షల కేంద్రం వద్ద కొంత ఆలస్యం అవుతోంది. ఈసీజీ, ఎక్స్‌రే పరీక్షలు చేయాల్సినచోట ఐదుగురు నిపుణుల్లో నలుగురు మానేశారు. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఇరుకు గదుల్లోనే వైద్యం

కేంద్రం: మడకశిర ఏరియా ఆసుపత్రి

వచ్చిన రోగులు: 200 నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి భవనం పూర్తికాకపోవడంతో ఇరుకు గదుల్లోనే సేవలందిస్తున్నారు. దీంతో అటు వైద్యులు, సిబ్బంది, ఇటు రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ శస్త్రచికిత్సలు నిర్వహించకపోవడంతో ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడినవారిని హిందూపురం జిల్లా ఆసుపత్రికి తరలించాల్సి వస్తోంది. గర్భిణులకు సాధారణ కాన్పులు మాత్రం చేస్తున్నారు.

సేవలు పర్వాలేదు

కేంద్రం: హిందూపురం జిల్లా ఆసుపత్రి

వచ్చిన రోగులు: 941గత కలెక్టర్ చేతన్ కృషితో ఇక్కడ ఓపీ కేంద్రాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేయడంతో సమస్య తొలగింది. రక్త పరీక్షలు చేయడంలో ఆలస్యం అవుతుంది. పిల్లల ఆసుపత్రిలో రోజూ ఐదు నుంచి ఎనిమిది వైరల్ ఫీవర్ కేసులు నమోదవుతున్నాయి. 200 పడకలు ఉండగా.. 300 పడకల స్థాయిలో రోగులు వస్తున్నారు. ఉన్నంతలో సిబ్బంది సేవలందిస్తున్నారు.సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం– ంధుసూదన, డీసీహెచ్ఎస్

ధర్మవరంలో ఓపీ కేంద్రాలు పెంచుకోవాలని ఇప్పటికే సూచించాం. స్థలం సమస్య ఉన్నందున ఆసల్యమైంది. మంత్రి దృష్టికి తీసుకెళతాం. కదిరిలో స్కానింగ్ కేంద్రాల్లో నిపుణుల కొరత సమస్య పరిష్కరిస్తాం. మడకశిరలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే రోగులకు సమస్య ఉండదు. ఈ సమస్యలన్నీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

## నిల్వలున్నా.. నిర్వహణ నీరుగారుతోంది

నాయుడుపేట : తెలుగుగంగ బ్రాంచి కాలువలపై ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ కొరవడటం, నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారింది. సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరి, సత్యవేడు నియోజకవర్గాల్లో 1.33 లక్షల ఎకరాలకు తెలుగుగంగ ఐదు, ఏడు బ్రాంచి కాలువల ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. ఈ ఏడాది సోమశిల, కండలేరు జలాశయాలకు పూర్తిస్థాయిలో నీటిమట్టం చేరడంతో రెండు నెలలుగా సాగునీరు విడుదల చేస్తున్నారు.

**నిండిన చెరువులకే మళ్లీ..**

అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నిండిన చెరువులకు మళ్లీ నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో పలుచోట్ల మధ్యలో కట్టలు తెగి నీరు వృథాగా పోతోంది. రైతులకు అవస్థలు తప్పడం లేదు.

**అధ్వానంగా కాలువలు**



బ్రాంచి కాలువల నిర్మాణం పూర్తయి 25 ఏళ్లు కావొస్తున్నా పూడిక తీయలేదు. కొన్ని ప్రాంతాల్లో పనులు అసంపూర్తిగా ఉన్నాయి.

కొందరు గట్లు ధ్వంసం చేయడంతో కాలువల్లో నీరు సాఫీగా వెళ్లడం లేదు. ఏడో బ్రాంచి కాలువ పరిధిలో పుదూరు, మిట్టకండ్రిగ, సీఎన్‌పేట, శ్రీనివాసపురం ప్రాంతాల్లో, ఐదు బ్రాంచి కాలువ పరిధిలో కొనేటిరాజుపాళెం, ముమ్మయపాళెం, ఓజిలి ప్రాంతాల్లో మైనరు కాలువలు మరమ్మతులకు గురయ్యాయి.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

ప్రధాన కాలువ నుంచి బ్రాంచి కాలువలకు సరఫరా చేసే నీటిని డీఈ, ఏఈ స్థాయిలో ఉన్న ఇంజినీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి. ప్రణాళికాబద్ధంగా మేజరు, మైనర్ కాలువల ద్వారా చెరువులు, ఆయకట్టు భూములకు నీటిని సరఫరా చేయాలి. నీరు వృథా కాకుండా చూడాలి.

## కొండెక్కిన స్మార్ట్‌సిటీ

తిరుపతి : తిరుపతిలో స్మార్ట్‌సిటీ ఊసే లేకుండా పోయింది. తిరుపతి నగరపాలక సంస్థ ఆర్థిక సుస్థిరత సాధించే లక్ష్యంతో కేంద్రం దీన్ని ప్రకటించింది. 2019లో అప్పటి తెదేపా ప్రభుత్వం పనులు ప్రారంభించినా.. తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ఐదేళ్లలో రాష్ట్రం వాటా పైసా కూడా విడుదల చేయలేదు. అప్పటికే ఖాతాల్లో ఉన్న సొమ్ములనూ ఊడ్చేసింది. దీంతో అసంపూర్తి ప్రాజెక్టు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కేంద్రం స్మార్ట్‌సిటీ పథకాన్ని రద్దు చేయడంతో ఆ ప్రాజెక్టులన్నీ దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. అసంపూర్తి పనులు చేయడానికి రూ.405 కోట్లు అవసరం. తితిదే నుంచి స్మార్ట్‌సిటీ పథకానికి రావాల్సిన రూ.53 కోట్లు కూడా అందలేదని తెలుస్తోంది.

**ఆగిపోయినవి ఇవే..**

ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ రూ.180 కోట్లు, సిటీ ఆపరేషన్ సెంటర్ రూ.94.50 కోట్లు, మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ సెంటర్ రూ.52.50 కోట్లు, రూ.30 కోట్లతో నిరంతర నీటి సరఫరా తాగునీటి సరఫరా వ్యవస్థ ఏర్పాటు ప్రాజెక్టుతో పాటు వినాయకసాగర్‌లో అదనపు అంతస్తులు, కూరగాయల మార్కెట్, వ్యాయామశాల, విద్యుత్ దీపాలంకరణ ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉన్నాయి. గొల్లవానిగుంట పునరుద్ధరణ పనులు సైతం పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల వినాయకసాగర్‌లో రూ.3 కోట్ల విలువైన ఈత కొలను, గ్లోగార్డెన్ పనులు పూర్తి చేశారు.

**తప్పుకొంటూ, తప్పించుకుంటూ...**

స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులు పూర్తి చేయడం అసాధ్యమని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఒక్కో ప్రాజెక్టు నుంచి అధికారులు తప్పుకొంటున్నారు.

తూకివాకంలో రూ.22 కోట్లతో చేపట్టిన 6 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు పనులు 75 శాతం పూర్తి కాగా.. ఇప్పటికే రూ.14.30 కోట్లు బిల్లులు కూడా చెల్లించారు. పనులు చేయడంలో గుత్తేదారు నిర్లక్ష్యంతో టెండరు రద్దు చేశారు.

కరకంబాడి రోడ్డులో రూ.2 కోట్లతో కూరగాయల మార్కెట్ నిర్మాణం ప్రాజెక్టు పూర్తి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న గుత్తేదారు టెండరు రద్దు చేశారు.



గొల్లవానిగుంటలో వద్ద రూ.2 కోట్ల స్టేడియం, రూ.2 కోట్ల క్రికెట్ మైదానాన్ని స్మార్ట్‌సిటీ నుంచి శాప్‌నకు అప్పగించారు.

వినాయకసాగర్‌లోని రూ.1.76 కోట్ల విలువైన మల్టీపర్పస్ హాల్, రూ.2 కోట్ల విలువైన యోగా కేంద్రం, రూ.1.86 కోట్ల చిన్నారుల ఆటస్థలం ప్రాజెక్టులను రద్దు చేసినట్లు తెలుస్తోంది.

దిష్టిబొమ్మల్లా భవనాలు

మొత్తం ప్రాజెక్టులు: 97

ప్రాజెక్టు విలువ: రూ.1586 కోట్లు

పూర్తయినవి: 83

విలువ: రూ.1148 కోట్లు

అసంపూర్తి: 14

విలువ: రూ.438 కోట్లు

## పచ్చని ప్రకృతిలో ప్రగ్యా జైస్వాల్!

కంచె సినిమాతో తనకంటూ ఎంతో ప్రత్యేకమైన పేరు తెచ్చుకున్న హీరోయిన్ ప్రగ్యా జైస్వాల్. మొదటి సినిమాతోనే తెగ ఆకట్టుకున్న ఈ హీరోయిన్ ఆ తర్వాత ఎన్నో సినిమాలు చేస్తూ టాలీవుడ్ లో.. మంచి పేరు తెచ్చుకుంది. తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫోటో ఇప్పుడు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది. ఈ ఫోటోలో ఆమె పూర్తిగా ప్రకృతి మధ్య.. పచ్చని వాతావరణంలో కనిపిస్తూ... గ్రీన్ కలర్ డ్రెస్‌లో అందానికే అసూయ తెప్పించేలా.. నిలబడుకొని ఫోటోలకు ఫోజు ఇచ్చింది. “నేను అవుట్‌డోర్స్ అని చెప్పినప్పుడు అర్థం ఇదే”.. అంటూ క్యాప్షన్ కూడా పెట్టింది. పచ్చని గడ్డి, చెట్ల మధ్య నిలబడి ఉన్న ప్రగ్యా లుక్ చాలా ఫ్రెష్‌గా ఉంది. ఆమె డ్రెస్ రంగు కూడా చుట్టూ ఉన్న ప్రకృతికి బాగా మ్యాచ్ అయింది.



ఈ ఫోటోను మౌర్య అనే ఫోటోగ్రాఫర్ తీశారు. ఆమె వేసుకున్న డ్రెస్ మిస్ మోసా అనే బ్రాండ్ నుంచి.. తీసుకోగా.. చెవులకు వేసుకున్న ఆభరణాలు, చేతి ఆభరణాలు రుబాన్స్ బ్రాండ్ చెందినవి. వేళ్లకు ఉన్న ఉంగరాలు అనంతయ బై మణి నుంచి వచ్చాయి. ఈ మొత్తం లుక్?ను నటాషా బోత్రా స్టైలింగ్ చేశారు. స్టైలింగ్ టీమ్‌గా మిచియెలా, మౌస్మి మిత్ర పని చేశారు. మేకప్‌ను అతిరా థక్కర్ చేశారు. హెయిర్ స్టైలింగ్‌ను అమిత్ ఠాకూర్ చేశారు. ఒక మధ్యప్రదేశ్లో పుట్టిన ప్రగ్యా జైశ్వర్ కెరియర్ విషయానికి వస్తే.. 2014లో తమిళ సినిమా ‘విరట్టు’తో ఆమె నటిగా పరిచయం అయ్యారు. అదే ఏడాది హిందీ సినిమా టిటూ ఎంబీఏలో కూడా నటించారు. 2015లో వచ్చిన తెలుగు సినిమా కంచె ఆమె కెరీర్‌ను పూర్తిగా మార్చేసింది. ఆ సినిమాలో రాజకుమారి పాత్రలో ఆమె నటనకు మంచి గుర్తింపు వచ్చింది. ఈ సినిమాతో ఆమె ఫిల్మ్‌ఫేర్ బెస్ట్ ఫిమేల్ డెబ్యూ అవార్డు కూడా గెలుచుకున్నారు. తర్వాత నక్షత్రం,అచారి అమెరికా యాత్ర, అఖండ.. వంటి సినిమాల్లో నటించారు. అఖండ ఆమె కెరీర్‌లో పెద్ద హిట్‌గా నిలిచింది. ఇటీవల హిందీలో ఖేల్ ఖేల్ మేన్ సినిమాలో నటించిన ప్రగ్యా.. గత సంవత్సరం బాలకృష్ణ తో డాకు మహారాజ్ సినిమాలో కనిపించింది. ఇక ఈ హీరోయిన్ మళ్లీ తెలుగు సినిమాల్లో ఎప్పుడూ కనిపిస్తుందా అని ఎదురు చూస్తున్నారు అందరూ.

## డాల్ఫిన్ల స్వర్గంలో పాలకోవా బ్యూటీ

పాలక్ తివారీ పరిచయం అవసరం లేదు. ఆదిపురుష్ ఫేం సైఫ్ అలీఖాన్ కుమారుడు ఇబ్రహీం అలీఖాన్ తో డేటింగ్ చేస్తోందన్న పుకార్ల నడుమ పాలక్ దేశమంతా ఫేమస్. బుల్లితెర నటి శ్వేతా తివారీ నటవారసురాలిగాను సుపరిచితురాలు. పాలక్ తన బోయ్ ఫ్రెండ్ ఇబ్రహీంతో సెలబ్రేషన్స్ కారణంగా విమర్శల్ని కూడా ఎదుర్కొంటోంది. ఈ బ్యూటీ డేటింగుల కంటే, సినిమా కెరీర్ పై దృష్టి సారించాలని సూచిస్తున్నారు. అందాల పాలక్ కి సామాజిక మాధ్యమాల్లో భారీ ఫాలోయింగ్ ఉంది. ఇన్‌స్టాలో 48 లక్షల (4.8 మిలియన్ల)కు పైగా అనుచరులున్నారు. పాలక్ వరుస ఫోటోషూట్లు హీటెక్కిస్తూనే ఉన్నాయి. ఇంతకుముందు మారిషస్ బీచ్ లలో చిలౌట్ చేసిన ఫోటోషూట్లను షేర్ చేసిన పాలక్ ఇప్పుడు ఆస్ట్రేలియాలోని ఎగ్జోటిక్ లొకేషన్లలో ఎంజాయ్ చేస్తున్న కొన్ని అందమైన ఫోటోగ్రాఫ్స్ ని షేర్ చేసింది. ఆస్ట్రేలియాలో ఫేమస్ రిసార్ట్స్ ప్రత్యేకత గురించి



చెప్పింది పాలక్. అక్కడ సముద్రపు అంచులో డాల్ఫిన్స్ నేరుగా మనుషులతో స్నేహం చేస్తాయని కూడా వెల్లడించింది. అంతేకాదు.. పాలక్ ఒక చిన్న చేపపిల్లను డాల్ఫిన్ కి ప్రేమగా తినిపించింది. అది ఆ బుల్లి చేపపిల్లను గొంతులో వేసుకుని నీళ్లలోనే పాలక్ మోకాలిపై ఒక ముద్దు కూడా ఇచ్చి వెళ్లింది. ప్రస్తుతం ఈ ఎగ్జోటిక్ లొకేషన్ నుంచి ఫోటోషూట్ ని పాలక్ నేరుగా తన ఇన్ స్టాలో షేర్ చేసింది. ఇదే ఫోటోషూట్ లో బీచ్ ఇసుకలోకి ఏటవాలుగా ఒరిగిపోయిన ఒక భారీ కొబ్బరి చెట్టు వద్ద పాలక్ బికినీ ఫోటోషూట్ గుబులు రేపుతోంది. ఇందులో ఫ్లోరల్ మోనోకినిలో పాలక్ అందచందాలు హీట్ పుట్టిస్తున్నాయి. కెరీర్ మ్యాటర్ కి వస్తే... పాలక్ రోమియో S3` అనే చిత్రంతో అభిమానుల ముందుకు వచ్చింది. అంతకుముందు సల్మాన్ భాయ్ కిసీ కా భాయ్ కిసీకి జాన్ చిత్రంలో నటించింది. భూత్నీ అనే హారర్ చిత్రంలోను పాలక్ నటించింది. కానీ ఇవేవీ ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. ఇటీవల పాలక్ యువహీరో ఇబ్రహీం అలీఖాన్ తో డేటింగ్ చేయడంపై తన తండ్రి (శ్వేతా తివారీ మాజీ భర్త) స్పందిస్తూ, డేటింగ్ కంటే నటనపై దృష్టి సారించాలని సూచించారు.




## ‘ద్రౌపది 2’ బ్యాన్.. మొగలుల్ని క్రూరంగా చూపిస్తే నచ్చలేదా?




కొన్నిసార్లు భారీ కాస్టింగ్, అగ్ర దర్శకుడు పని చేయకపోయినా ఆ సినిమా ఏదో ఒక వివాదం కారణంగా నిరంతరం వార్తల్లో నిలుస్తుంది. మోహన్.జి దర్శకత్వంలో రూపొందించిన -ద్రౌపది 2- ఇదే కేటగిరీకి చెందినది. ద్రౌపది ఇంతకు ముందు విడుద?లై ఆక?ట్టుకుంది. ఇప్పుడు దీనికి సీక్వెల్ రూపొందిస్తుండటంతో అందరిలో క్యూరియాసిటీ నెలకొంది. అయితే ద్రౌపది 2 భారతదేశంలో విడుదలవుతుంది కానీ, గల్ఫ్ దేశమైన ఖతార్ లో విడుదల నిషేధితమైంది. తాజా సమాచారం ప్రకారం..ఖతార్ ప్రభుత్వం -ద్రౌపతి 2- చిత్రాన్ని తమ దేశంలో విడుదల చేయకుండా నిషేధించింది. ఈ సినిమాలో 14వ శతాబ్దపు చరిత్రను చూపిస్తూ, ముస్లిం పాలకులైన మొఘల్ రాజుల క్రూరమైన దండయాత్రలు, ఆ సమయంలో జరిగిన ఘర్షణలను వివాదాస్పదంగా చిత్రీకరించారని ఖతార్ సెన్సార్ బోర్డు భావించినట్లు తెలుస్తోంది. సున్నితమైన భౌగోళిక రాజకీయ, మతపరమైన అంశాలు ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అయితే ఈ రిపబ్లిక్ డే కానుకగా జనవరి 23న ఈ చిత్రం పాన్ ఇండియా కేటగిరీలో ఐదు భాషల్లో (తమిళం, తెలుగు, హిందీ, కన్నడ, మలయాళం) విడుదల కానుంది. ఈ సినిమా 14వ శతాబ్దపు చారిత్రక నేపథ్యంలో సాగుతుంది. హోయసల చక్రవర్తి వీర భల్లాల పాలన, దక్షిణాది రాజ్యాలపై జరిగిన తొలి మొఘల్ దండయాత్రల చుట్టూ కథ తిరుగుతుంది. ముఖ్యంగా మొహమ్మద్ బీన్ తుగ్లక్ దండయాత్రను ఎదిరించిన స్థానిక యోధుల పోరాటాన్ని ఈ సినిమాలో చూపించారు. రిచర్డ్ రిషి వీర సింహ కాడవరాయన్ గా ప్రధాన పాత్రలో నటించగా, ద్రౌపతి దేవిగా రక్షణ ఇందుచూడన్ న?టించారు. మొహమ్మద్ బీన్ తుగ్లక్ పాత్రలో (విలన్‌గా) చిరాగ్ జాని కనిపిస్తారు. నట్టి నటరాజ్, వై.జి. మహేంద్రన్, వేల రామమూర్తి, దివి వాధ్యా (బిగ్ బాస్ ఫేమ్), దేవయాని శర్మ కీలక పాత్రల్లో నటించారు. మోహన్ జి క్షత్రియన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. జిబ్రాన్ వైబోధ ఈ చిత్రానికి సంగీతం అందించారు. నేతాజీ ప్రొడక్షన్స్ పతాకంపై చోళ చక్రవర్తి ఈ సినిమాని తెరకెక్కించారు. అసలు వివాదం ఏమిటి అంటే... కేవలం అంతర్జాతీయ రిలీజ్ విషయంలో నిషేధం మాత్రమే కాకుండా, ఈ సినిమా టైటిల్, అందులో చూపించిన చారిత్రక పాత్రల కుల గుర్తింపుపై కూడా తమిళనాడులో కొన్ని వివాదాలు నడుస్తున్నాయి. అయినప్పటికీ భారత్‌లో ఈ సినిమా సెన్సార్ పూర్తి చేసుకుని యుఏ సర్టిఫికేట్?తో విడుదలకు సిద్ధంగా ఉంది.

## శర్వా బైకర్.. రేసులో ఊహించని బ్రేక్




సినిమా ఇండస్ట్రీలో రిలీజ్ డేట్ అనౌన్స్ చేశాక వెనక్కి తగ్గడం అంటే ఫ్యాన్స్ కు కొంచెం నిరాశ కలిగించే విషయమే. చార్మింగ్ స్టార్ శర్వానంద్ నటిస్తున్న ‘బైకర్’ సినిమా విషయంలో కూడా ఇప్పుడు అదే జరిగింది. డిసెంబర్ 6న థియేటర్లలో దుమ్ములేపడానికి సిద్ధమైన ఈ రేసర్, సడెన్ గా బ్రేక్ వేశాడు. అయితే ఈ వాయిదా వెనుక సాధారణ కారణాలు కాకుండా, ఒక మైండ్ బ్లోయింగ్ ప్లాన్ ఉందని మేకర్స్ ఇచ్చిన అప్డేట్ ఇప్పుడు ఆసక్తిని రేకెత్తిస్తోంది. సాధారణంగా పోస్ట్ ప్రొడక్షన్ లేట్ అయ్యిందో, షూటింగ్ అవ్వలేదో వాయిదా వేస్తుంటారు. కానీ ‘బైకర్’ టీమ్ ఆలోచన వేరే లెవెల్ లో ఉంది. కేవలం సినిమాను చూపించడమే కాదు, ప్రేక్షకులకు ఒక సరికొత్త అనుభూతిని ఇవ్వాలని డిసైడ్ అయ్యారు. అందుకే అనుకున్న తేదీకి రాలేకపోతున్నామని, కానీ తిరిగి వచ్చేటప్పుడు మాత్రం అంతకు మించి ఉంటుందని ఒక అఫిషియల్ నోట్ ద్వారా క్లారిటీ ఇచ్చారు. అసలు విషయం ఏంటంటే.. ‘బైకర్’ సినిమా విడుదల వాయిదా పడింది. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాని రెడీ చేయడానికి తమ కాస్ట్ అండ్ క్రూ నిద్రలేని రాత్రులు గడిపారని, అయితే అవుట్ పుట్ చూసాక ఇది కేవలం స్క్రీన్ మీద చూసే సినిమా మాత్రమే కాదని, అంతకు మించిన ఎక్స్ పీరియన్స్ అని అర్థమైందని మేకర్స్ తెలిపారు. ఇక్కడే అసలు ట్విస్ట్ ఉంది. ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు సరికొత్త టెక్నాలజీతో తీసుకురాబోతున్నారు. కేవలం 2Dలోనే కాకుండా, 3D మరియు 4DX ఫార్మాట్లలో కూడా ‘బైకర్’ రిలీజ్ కానుందట. రేసింగ్ సన్నివేశాలు, హై యాక్షన్ సీక్వెన్సులు 4DX లో చూస్తే ఆ కిక్కే వేరుగా ఉంటుంది. ఆ అడ్రినలిన్ రష్ ను ఆడియన్స్ కు ఫీల్ అయ్యేలా చేయడానికే ఈ సమయం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. తెలుగు సినిమా ఇప్పటివరకు చూడని భారీ స్కేల్ లో ఈ సినిమా ఉండబోతోందని చిత్ర యూనిట్ నమ్మకంగా చెబుతోంది. “హెల్మెట్లు టైట్ గా పెట్టుకోండి.. లైఫ్ టైమ్ రైడ్ కు సిద్ధమవ్వండి” అంటూ మేకర్స్ ఇచ్చిన వార్నింగ్ ఫ్యాన్స్ లో అంచనాలను పెంచేసింది. శర్వానంద్ కెరీర్ లోనే ఇదొక బెంచ్ మార్క్ సినిమాగా నిలిచే అవకాశం ఉంది. మొత్తానికి డిసెంబర్ 6న రావలసిన సినిమా వాయిదా పడినా, 3D మరియు 4DX రూపంలో రాబోతున్న ఈ గుడ్ న్యూస్ ఫ్యాన్స్ ను కూల్ చేసింది. కొత్త రిలీజ్ డేట్ ను త్వరలోనే అనౌన్స్ చేయనున్నారు. మరి ఈ లేటెస్ట్ టెక్నాలజీతో శర్వానంద్ బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి రేస్ ని చూపిస్తాడో చూడాలి.

## ఫ్యాషన్ కి పర్ఫెక్ట్ మీనింగ్ చెప్పిన బ్యూటీ!

సెలబ్రిటీలు సందర్భాన్ని బట్టి రకరకాల ఫ్యాషన్ శైలిని ఎంచుకుంటారు. హాట్ కోచర్ రెడ్ కార్పెట్ కోసంఅవార్డు ఫంక్షన్లు, ఫిల్మ్ ఫెస్టివల్స్ లేదా మెట్ గాలా వంటి వేడుకల్లో సెలబ్రిటీలు ఖచ్చితంగా హాట్ కోచర్ దుస్తులనే ధరిస్తారు. ప్రపంచ ప్రసిద్ధ డిజైనర్లు మనీష్ మల్హోత్రా, సబ్యసాచి, వెర్సాచే లాంటి ప్రత్యేకంగా కొలతలకు తగ్గట్టుగా తయారు చేస్తారు. ఇవి చాలా ఖరీదైనవి. ఒక రకమైన డిజైన్ ఒక్కరి దగ్గర మాత్రమే ఉంటుంది. అథ్లీజర్ ఎయిర్‌పోర్ట్ అండ్ జిమ్ లుక్స్. ప్రస్తుతం సోషల్ మీడియాలో పెద్ద ట్రెండ్ ఇది. ప్రయాణాల్లో, జిమ్‌కు వెళ్లేటప్పుడు వారు అథ్లీజర్ స్టైల్‌ను ఎంచుకుంటారు. సౌకర్యవంతమైన ట్రాక్ ప్యాంట్లు, బ్రాండెడ్ హూడీలు, స్నీకర్లు యోగా వేర్ ఇందులో భాగాలుగా కనిపిస్తాయి. నైకీ, అడిడాస్ లేదా లూలూలెమన్ వంటి బ్రాండ్లను ఎక్కువగా ఇష్టపడతారు. పెళ్లిళ్లు, పూజలు , సినిమా ప్రమోషన్ల సమయంలో సెలబ్రిటీలు సాంప్రదాయ



దుస్తులు ధరిస్తారు. ప్రస్తుతం సంప్రదాయ దుస్తులకు మోడరన్ టచ్ ఇచ్చే ఫ్యూజన్ వేర్స్. అంటే చీరపై బెల్ట్ ధరించడం లేదా లెహంగాపై క్రాప్ టాప్ లను ఎంచుకోవడం. ఓవర్ సైజ్డ్ టీషర్టులు, రిప్డ్ జీన్స్ , ఖరీదైన షూస్ ఈ లుక్‌లో ప్రధానం. ఇలా ఎన్ని రకాల ఫ్యాషన్ దుస్తులున్నా సంప్రదాయ చీరకట్టు మాత్రం అన్నింటికంటే ప్రత్యేకమనే చెప్పాలి. ఇదే విషయాన్ని మాలీవుడ్ హీరోయిన్ మాళవికా మోహనన్ మరోసారి ఉద్ఘాటించింది. కొందరు పేరు కోసమే ఫ్యాషన్ ట్రెండ్ ని అనుసరించడానికి ప్రయత్నిస్తారు. కానీ అలా చేస్తే దీర్ఘ కాలం దాన్ని కొనసాగించలేమన్నది తన అభిప్రాయంగా పేర్కొంది. తాను ఫ్యాష?న్ విష?యంలో ఒకే శైలికి పరిమితం కానంది. -ఇండియా లాంటి గొప్ప దేశంలో పెరిగినప్పుడు రకరకాల దుస్తులను చూస్తుంటాం. నాకు చిన్నప్పటి అమ్మ చేనేత చీరలు కట్టుకోవడం చూస్తూ పెరిగాను. నా దృష్టిలో ఫ్యాషన్ అంటే చీరలు కట్టుకుని నుదిటపై ఎర్రబొట్టు..కళ్లకు కాటుక, పువ్వులు పెట్టుకోవడమే. అంతకు మించి భారత దేశంలో గొప్ప ఫ్యాషన్ అంటూ మరొకటి లేదు. మన సంస్కృతి, సంప్ర దాయాల్ని మించిన ఫ్యాషన్ కన్నా ఏదీ గొప్పది కాదని తెలిపింది.

చీరందం గురించి గొప్పగా వర్ణించే నాయికలు చాలా తక్కువ మంది ఉంటారు. అందులో మాళవిక ఒకరు. కేరళ నుంచి దిగుమతి అయింది. ఈ బ్యూటీ ఇటీవలే రిలీజ్ అయిన -ది రాజాసాబ్- తో పరిచయమైన సంగతి తెలిసిందే. ప్రస్తుతానికి అమ్మడి చేతిలో తెలుగులో కొత్త అవకాశాలైతే లేవు.

## 8 గంటల పనిదినం వెనక కష్టం చెప్పిన కీర్తి

ఈరోజుల్లో 8గంటల పనిదినం గురించి దేశవ్యాప్తంగా అన్ని సినీపరిశ్రమల్లో విస్తృతంగా చర్చ సాగుతోంది. దీపిక పదుకొనే కేవలం 8గం.ల పని దినం కారణంగా రెండు పెద్ద అవకాశాల్ని కోల్పోవడంతో ఈ చర్చకు మరికాస్త ప్రాధాన్యత పెరిగింది. అయితే ఎనిమిది గంటల పనిదినం లేదా 9-6 జాబ్ గురించి నటి కీర్తి సురేష్ ని ప్రశ్నిస్తే, తను ఇచ్చిన జవాబు నిజంగా ఆశ్చర్యపరుస్తోంది. నిజానికి తాను 24గంటల షిఫ్ట్ పని చేస్తానని కీర్తి సురేష్ అన్నారు. 9-6 షిఫ్ట్... 9-9 షిఫ్ట్.. 9-2 షిఫ్ట్ కూడా తనకు అలవాటు అని తెలిపారు. నిజానికి నేను మహానటి షూటింగ్ చేసేప్పుడు ఒకేసారి ఐదు సినిమాలకు పని చేసాను. అజ్ఞాతవాసి, సామి 2, సర్కార్, పందెంకోడి 2 (సండకోడి2) , వీటితో పాటు మహానటి సినిమా చేసాను. చాలామందికి ఎనిమిది గంటల పని దినం అంటే అర్థం కావడం లేదు. దీని గురించి తెలుసుకోవాల్సింది చాలా ఉంది. వాస్తవానికి 9కి మేకప్ తో ఆర్టిస్టు రెడీ అవ్వాలంటే 7గంటలకే సెట్లో ఉండాలి. ఆర్టిస్టు 6 గంటలకు బయల్దేరితేనే సెట్ కి రాగలడు. అలా రావాలంటే, 5 గంటలకు నిద్ర లేచి రెడీ అవ్వాలి. 6 గంటలకు ప్యాకప్ చెబితే, మేకప్ రిమూవ్ చేసి ప్రయాణించి ఇంటికి వెళ్లడానికి



అదనంగా మరో గంట పడుతుంది. 9-6 పని అంటే ఇంత ఉంటుంది.. అని కీర్తి డీటెయిలింగ్ ఇచ్చారు. ఇది కేవలం ఆర్టిస్టు వరకే, టెక్నీషియన్లు, లైట్ మెన్లు వీరంతా ఆర్టిస్టులు సెట్ కి రాకముందే అక్కడ ఉండాలి. ఆర్టిస్టులు వెళ్లిపోయిన తర్వాత సెటప్ మొత్తం సర్దుకోవడానికి చాలా సమయం పడుతుంది. అంటే వాళ్లు ఎంత అదనపు సమయం పని చేయాలో, ఎంతగా వేచి చూడాలో ఆలోచించండి! అని కీర్తి సురేష్ సినిమా కష్టాల గురించి మాట్లాడారు. మహానటి చిత్రీకరణ సమయంలో మరో నాలుగు సినిమాలతో తాను 24 బై 7 కాల్షీట్లను మ్యానేజ్ చేసానని తెలిపారు. సహజంగా మనిషికి 8గంటల నిద్ర అవసరం. కానీ మాకు అంత నిద్ర ఎక్కడ కుదురుతుంది. 5గంటలు నిదురపోవడం కూడా గగనం. సాయంత్రం 8గం.లకు ఇంటికి చేరితే ఆ తర్వాత ఒక గంట వర్కవుట్ల కోసం, అర్ధగంట షవర్ కింద సరిపోతుంది. 11- 11.30 పీఎం మధ్య నిదురపోతే మళ్లీ 5గంటలకే నిద్ర లేవాలి అని ఆర్టిస్టు రోజువారీ సైకిల్ గురించి కీర్తి వర్ణించిన తీరు నిజంగా కళాకారుల కష్టానికి అద్దం పట్టింది. తెలుగు తమిళంలో 9-6 పని చేస్తారు కానీ, మలయాళం, హిందీలో 12గంటలు వర్క్ షెడ్యూల్ ఉంటుందని కూడా కీర్తి వెల్లడించారు. రివాల్వర్ రీటా విడుదల ప్రచారంలో బిజీగా ఉన్న కీర్తి ఈ విషయాలన్నిటినీ చెప్పారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536